సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

RNI No. APTEL 2015/ 66622

రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

అమరావతి సోమవారం 6 - ఆదివారం 12 మార్చి, 2017 సంపుటి : 2 సంచిక 24 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక | Whatsapp No: 9440662699 | పేజీలు 8 | వెల : రూ. 5.00

వివరాలు2లో...

ఇంటి, కుళాయి పన్నులు వెంటనే చెల్లించాలి

వివరాలు3లో...



నటులు - రాజకీయాలు

వివరాలు4లో...

వేసవికి సిద్ధమయ్యారా!

వివరాలు7లో...

ఈగ, మిర్చిలకు నందుల పంట

వివరాలు8లో...

రుధి రాశ్రువులతో మహిళలు

నూతన అసెంబ్లీ రెడీ

రేపటి నుంచి సమావేశాలు

ఎమ్మెల్యేల వాహనాల కోసం సిద్ధమవుతున్న కార్ పార్కింగ్

అసెంబ్లీ ఆవరణలో ఉన్న పెట్టెలు...

మీడియా గ్యాలరీ వద్ద పనులు చేస్తున్న రాంబాబు

రాజధానిప్రతినిధి, వెలగపూడి : నవ్యాంధ్రలో ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అత్యాధునికంగా నిర్మించిన అసెంబ్లీని చూడటానికి దూరప్రాంతాల నుంచి కూడా ప్రజలు వస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం లంచ్ టైమ్‌లో దీనిని చూద్దామని వచ్చిన సచివాలయ ఉద్యోగులు తాళాలు వేసి ఉండటంతో నిరాశగా వెనుదిరిగారు. అసెంబ్లీ ఉద్యోగులకు కూడా లంచ్ అవర్ కావడంతో ఈ పరిస్థితి నెలకొంది. కాగా అసెంబ్లీ సిబ్బంది అధికారులు మాత్రం శని, ఆదివారాల్లో కూడా సర్థుకుంటూ, సోమవారం నాటికి అన్ని సిద్ధంగా పెట్టుకుంటూ కనిపించారు. అసెంబ్లీ ప్రాంతం పరిశుభ్రంగా ఉంచడం కోసం మంగళగిరి, యర్రబాలెం, వెలగపూడి, పరిసర ప్రాంతాలనుంచి మహిళలను నియమించారు.

ప్రశాంతతను కోల్పోతున్న రాజధాని ప్రాంతం

పైరుపంటలతో ప్రశాంతంగా ఉండే రాజధాని గ్రామాలు రోజురోజుకూ పెరుగుతున్న

- మిగతా 2 లో



మీడియా గ్యాలరీ వద్ద రాజధాని వార్తలు ఎడిటర్ హెచ్. ఖాన్

అమెరికాలో మరో భారతీయుడి హత్య

న్యూయార్క్: జాత్యహంకార దాడిలో తెలుగు యువకుడు శ్రీనివాస్ మరణించిన ఘటన నుంచి తేరుకోకముందే మరో అమెరికాలో మరో సంఘటన జరిగింది. సౌత్ కరోలినాలో గురువారం రాత్రి భారత సంతతికి చెందిన ఓ వ్యాపారిని ఆయన ఇంటి ముందే హత్య చేసినట్లు అక్కడి మీడియా వెల్లడించింది. లాంకాస్టర్ ప్రాంతంలో హర్నీష్ పటేల్ అనే వ్యక్తి గురువారం రాత్రి 11.24 సమయంలో దుకాణం మూసేసి ఇంటికి వెళ్తుండగా.. పది నిమిషాలకే ఇంటికి సమీపంలోనే కాల్చి చంపినట్లు మీడియా పేర్కొంది. ఇటీవల కేన్సస్‌లో అమెరికన్ వ్యక్తి బార్‌లో కాల్పులు జరపగా శ్రీనివాస్ కూచిభొట్ల మరణించగా, అలోక్, మరో అమెరికన్ వ్యక్తి గ్రిల్లాట్ గాయాలతో బయటపడిన సంగతి తెలిసిందే. ఈ దాడిని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఖండించిన రెండ్రోజుల్లోనే మరో భారతీయుడు హత్యకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది.

పటేల్ మృతిపై దర్యాప్తు చేస్తున్నామని లాంకాస్టర్ అధికారులు వెల్లడించారు. దర్యాప్తు

- మిగతా 2 లో

విజయవాడ- గుంటూరులను వణికిస్తున్న బ్లడ్ కేన్సర్

రాజధాని డెస్క్, విజయవాడ : బ్లడ్ కేన్సర్‌లో ఒకటైన ఎక్యూట్ మైలాయిడ్ లుకేమియా(ఎఎంఎల్) ఎం3 విజయవాడ -గుంటూరుల్లో చాల ఎక్కువగా ఉందని మణిపాల్ ఆసుపత్రి అంకాలజీ శాఖాధిపతి డాక్టర్ . శృతి ప్రేమ్ తెలిపారు. ఈ వ్యాధిలో ఎముకల మజ్జ నుంచి ఉత్పత్తి అయ్యే ఎర్ర రక్తకణాలుగణనీయంగా తగ్గుతాయి. ఈ కేన్సర్‌ను చికిత్సతో తగ్గించ వచ్చని ఆమె తెలిపారు. చికిత్స అందించే కేసుల్లో దాదాపు 60 నుంచి 80 శాతం వరకు ఈ రెండు నగరాల నుంచి వచ్చేవారే ఎక్కువన్నారు. కేన్సర్ రోగులను ఎక్కువగా మణిపాల్ ఆసుపత్రికే రిఫర్ చేస్తుంటారని ఆమె తెలిపారు. ఈ ప్రాంతంలో కేన్సర్‌కు చికిత్స అందించే సంస్థగా మణిపాల్ ఆసుపత్రి పేరుగాంచిందన్నారు. ఈ ప్రాంతంలోనే ఈ వ్యాధి ప్రబలడానికి కారణాలను విశ్లేషిస్తున్నామని , డాక్టర్. శృతి తెలిపారు. పంటపొలాల్లోని క్రిమినాశక రసాయనాలకు అతిదగ్గరగా ఉండటంతో రక్తకణాలు దెబ్బతింటున్నాయన్నారు. ఎప్లాస్టిక్ ఎనిమియాకు గురైన వారిలో ఎముకల గుజ్జును నిర్వీంర్వం కావడంతో రక్తహీనత కలుగుతోందన్నారు. ఈ ప్రాంతాల్లో పిల్లల్లో కేన్సర్ ఎక్కువగా నమోదవుతోందని, దీనికి మేనరిక వివాహాలే కారణమన్నారు. తాను దక్షిణాది రాష్ట్రాల్లో కేన్సర్ వైద్యురాలిగా పనిచేశానని , అయితే ఈ ప్రాంతంలో ఉన్నన్ని కేసులు ఎక్కడా లేవన్నారు. తినే ఆహారపదార్థాలను పరిశుభ్రంగా కడగడం, పంట పొలాలకు పురుగుమందులు కొట్టేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమని డాక్టర్. శృతి తెలిపారు.

బెంబెలెత్తిస్తున్న ప్రైవేటు బస్సులు

- మూడు రోజుల్లో నాలుగు ప్రమాదాలు
- మృతుల పోస్టుమార్టంపై రాకీయ రగడ
- దిక్కుతోచని స్థితిలో బాధిత కుటుంబాలు

రాజధాని డెస్క్, అమరావతి : ప్రైవేటు వాహనాల ప్రమాదాలతో రాష్ట్రం అట్టుడుకుతోంది. బస్సుడ్రైవర్ల నిర్లక్ష్యం, సమగ్ర ప్రభుత్వ పరిశీలన లేకపోవడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు భావిస్తున్నారు. కృష్ణాజిల్లా ముండ్లపాడు వద్ద మంగళవారం జరిగిన దుర్ఘటనలో 10 మంది మృతి చెందగా, మరో 37 మందికి తీవ్రగాయాలైన విషయం తెలిసిందే.. కాగా గురువారం నాడు జరిగిన వేర్వేరు ఘటనల్లో 48 మంది గాయపడ్డారు. ఆరోజు తెల్లవారు జామున నెల్లూరు దొరవారి సత్రంమండలం నెలిబలివద్ద ప్రైవేటు బస్సును ఓల్వా బస్సు ఢీకొనడంతో 18 మందికి గాయాలవగా, ప్రకాశం జిల్లా చెర్లోపల్లి మండలం అలవలపాడు వద్ద కల్వర్టును ఢీకొని వాగులో పడిన ప్రైవేటు బస్సులోని 30 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. శనివారంనాడు పశ్చిమ గోదావరి జిల్లాలో ఓ ప్రైవేటు బస్సుకు ప్రమాదం జరిగింది. జిల్లాలోని తణుకు సమీపంలో హైవేపై ప్రైవేట్ బస్సు-ట్యాంకర్ ఢీ కొన్నాయి. దీంతో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.

ముండ్లపాడు వద్ద జరిగిన దుర్ఘటనలో 10 మంది మృతుల కుటుంబాలను, గాయాపడిన వారిని పరామర్శించడానికి వెళ్లిన జగన్‌కు చేదు అనుభవం ఎదురైంది. సహాయ కార్యక్రమాలను అడ్డుకుంటూ, జిల్లాకలెక్టర్‌ను , డాక్టర్లను ప్రతిపక్షనాయకుడు బెదిరిస్తున్నారని అధికారపక్ష పార్టీ విమర్శిస్తుండగా, 10 మందిని బలిగొన్న దివాకర్ ట్రావెలర్స్ వాల్వో బస్సు అధికార పార్టీ ఎమ్మెల్యేది కావడంతో వారిని రక్షించేందుకు మృతులకు పోస్టుమార్టం జరపకుండా తరలిస్తున్నారని ఇది చట్టవ్యతిరేకం కావడంతో నిబంధనలకుమేర కలెక్టర్, డాక్టర్లను జైలు కెళ్లవలసి వస్తుందని వారిని హెచ్చరించామని ప్రతిపక్షపార్టీ

చెబుతోంది. ఈ ఘటనపై ప్రజలు విచారణ జరపమనకుండా ఉండటానికి తమను తప్పుడు కేసుల్లో ఇరికించి, ప్రజల దృష్టిని మరల్చుతున్నారని ప్రతిపక్షం చెబుతోంది. క్షతగాత్రులకు సేవలందించకుండా ప్రతిపక్షం అధికారులను అడ్డుకోవడం సరికాదని అధికారపక్షం వాదిస్తోంది. ఏది ఏమైనా ఇరుపక్షాల రగడతో యాజమాన్యం తప్పించుకుందని మృతుల కుటుంబాలు వాపోతున్నాయి. ప్రైవేటు వాహనాలు మితిమీరిన వేగాన్ని తగ్గించి ప్రాణాలు కాపాడాలని ప్రజలు కోరతున్నారు.

అరకొర సిబ్బందితో ప్రమాదాలు

బస్సు డ్రైవర్ విపరీతవేగం, నిద్రలేకుండా చేసే అధిక డ్యూటీలు, అలసట,నిద్రతో ఈ ప్రమాదం జరిగిందని అధికారుల ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది. ప్రైవేటు బస్సులు సరిపడినంతమంది డ్రైవర్లను పెట్టుకుంటే జీతాలు ఇవ్వాల్సి వస్తుందని, అందువల్ల ఉన్నవారితోనే ఎక్కువ ట్రిప్పులు

- మిగతా 2 లో

ఈవారం రాజధాని

- పౌర సమాచార లేఖ అడిషనల్ డైరెక్టర్‌గా కృష్ణానంద్ : యస్. వెంకటేశ్వర్ కమిషనర్
- గన్నవరం ఎయిర్ పోర్టుకు ఎన్టీఆర్ పేరు : సీఎం
- విజయవాడ లక్ష్మీశ్రావ్యకు ప్రపంచ ఫోటోగ్రఫీ అవార్డు
- మార్చి 4న పున్నమి ఘాట్ భవానిపురం నందు యోగా కార్యక్రమం
- 8న గుంటూరు మిర్చి యార్డ్‌లో రైతుల ధర్నా
- అంతర్జాలంలో రైలు టెకెట్‌కు ఆధార్ : రైల్వేశాఖ

రాజధాని వార్తలు
కలం

ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించండి...

నూతన అసెంబ్లీలో ప్రారంభమయ్యే శాసనసభ సమావేశాలు ఇకపై ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేవిగా, ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా జరగాలి. తెలుగురాష్ట్రాల్లో మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ సమావేశాలు మరీ నాసిరకంగా మారాయి. ప్రజాసమస్యలపై చర్చ జరగడం ఎప్పుడో ఆగి పోయింది. ఎంతవరకు అధికార ప్రతిపక్షాలు వాదోపవాదాలు, ఒకరిని ఒకరు సవాలు చేసుకోవడంతోనే సరిపోయింది. అంతేకాదు సభ్యులు తమ రౌడీయిజాన్ని ప్రదర్శించే వేదికగా అసెంబ్లీ రూపొందడం విచారకరం.ఒకరిపై ఒకరు పైచేయి సాధించాలన్న తపనేకాని ప్రజల సమస్యలపై చర్చించే చిత్తశుద్ధి తక్కువైంది. పలానా దాని మీద చర్చ జరగాలని ప్రతిపక్షం, దానిపై చివరిలో సమావేశం జరుపుతామని అధికార పక్షం ఇలా పంతాలకు పోయి సభా సమయాన్ని కొండెక్కిస్తున్నారు. సభాపతి అంటే అధికార, విపక్షాలను సమాన దృష్టిలో చూసే వారై ఉండాలి. అయితే సభలో ఇది తీవ్రంగా కొరవడింది. ఎంతసేపైనా అధికార పక్షానికి మైక్ ఇచ్చే స్పీకర్ ప్రతిపక్షం విమర్శిస్తే చాలు మైక్ కట్ చేస్తారు. దీనితో సభలో సమస్యలపై చర్చకు తావులేకుండాపోయింది. అధికార సభ్యులు ముఖ్యమంత్రితో సహా వేలు చూపుతూ, కళ్లెర్ర చేస్తూ మాట్లాడటం, తాన అంటే తందాన అనే మంత్రులు ప్రతిపక్షాన్ని కించపరచడమే తమ ధ్యేయంగా పెట్టుకున్నారు. ప్రతిపక్షానికి కూడా అంతకుముందు సభలో మాట్లాడిన అనుభవం లేకపోవడంతో పాయింట్ ఆఫ్ ఆర్డర్ అధికరణలో స్పీకర్‌ను సమయం కోరలేకపోవడం, అవి అసెంబ్లీ రికార్డుల్లో ఎక్కకపోవడం జరుగుతోంది. రాజ్యాంగం, చట్టం గురించి తెలుసుకొని అందుకు అను గుణంగా ప్రవర్తించాల్సిన అవసరం ప్రతిపక్ష,అధికార పక్ష సభ్యులకు ఎంతైనా ఉంది. అంతేకాని అర్థం పర్థంలేని ఆరోపణలతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం ఎంతమాత్రమూ తగదు. సభ్యులు మాట్లాడే సమయంలో అశేష ఆంధ్రప్రజలు తమ వ్యాఖ్యలను వింటున్నారన్న స్పృహకలిగి ఉండాలి.అంతేకాని ఎదుటివారిని తీవ్రపదాలతో దూషించినంత మాత్రాన తాము అధికులమవుతామన్న భావన సరికాదని తెలుసుకోవాలి. ప్రజలు మౌనంగా ఉన్నారంటే వారు అధికార పక్షానికి అనుగుణంగా ఉన్నారనికాదు, సమయం వచ్చినప్పుడు తప్పకుండా ప్రతిస్పందించడానికని గుర్తించాలి. మహిళా పార్లమెంటు సభ్యులు ఎకసెక్కంగా మాట్లాడటం, తూర్పారబట్టడం కాకుండా సమస్యలను లేవనెత్త డానికి వాటిని పరిష్కరించడానికి కృషి జరపాలి. ముదురుతున్న ఎండలతో అడుగంటుతున్న జలాశయాలు, రాష్ట్రంలోని తాగునీటి సమస్య, రబీ పంటసాగు, విస్తీర్ణం, యువతకు ఉద్యోగ అవకాశాలు, రైతుల అగచాట్లు, తదితర అంశాలపై సుదీర్ఘ చర్చ చేపట్టి సభకు వన్నె తేవాలని ప్రజలు భావిస్తున్నారు.

మూడేళ్లలో జరిగిన శాసనసభా కార్యక్రమాలు చాలా తక్కువే అని తెలుసు. రాజధానిలో అసెంబ్లీ హాలు కనీసం ప్రతిపాదనలో కూడా లేని సమయంలోనే సెప్టెంబరు 8, 2016న ఇవే చివరి అసెంబ్లీ సమావేశాలని భావోద్వేగాలకు గురై అక్కడి నుంచి వచ్చేశారు. అంతతొందరపాటు నిర్ణయం ఎందుకు తీసుకోవల్సిందే తెలియదు. దీనికి ప్రతిగా ఆంధ్రప్రదేశ్‌లో శీతాకాల సమా వేశాలను కోల్పోవలసి వచ్చింది. దీంతో అనేక ప్రజాసమస్యలపై చర్చించే అవకాశం లేకుండా పోయింది.

ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీని ప్రారంభించిన కోడెల శివప్రసాద్‌కు విపక్ష వైసీపీ నేత బహిరంగ లేఖ రాస్తూ తెలంగాణ ఎమ్మెల్యేలను తెలుగుదేశం పార్టీ కొనబోతూ పట్టుబడిందని, మా పార్టీ టికెట్‌పై గెలిచి, అధికార పార్టీలోకి జంప్ చేసినవారు శాసన సభ సభ్యత్వానికి రాజీనామా చేసి పోటీ చేయించాలని రాసిన లేఖకు అధికార పక్ష నేతలు ఆగ్రహం వెలిబుచ్చారే తప్ప ...వాటిపై ఏ నిర్ణయం తీసుకోలేదు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు అధికార టీఆర్ఎస్ పార్టీలో దుమికిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు మంత్రిగా పదవి ప్రమాణం చేయించిన గవర్నర్ నరసింహన్‌పై తెలుగుదేశం ఎంతగా మండిపడిందీ ఒక సారి గుర్తుచేసుకోవాలి. గెలుపంటే డబ్బు, అధికారం కాదు విలువలని గుర్తించి గౌరవించినప్పుడే ఇలాంటి అప్రజాస్వామ్యిక ఘటనలు చోటు చేసుకోవు. ప్రజలకు అవకాశం లేదుకాబట్టి ఈనాడు వారు ఎదిరించి ఉండకపోవచ్చుగాని, రాజీనామా చేయకుండా పార్టీ మారడాన్ని ప్రజలు ఏ మాత్రం సహించరని గుర్తుంచుకోవాలి. అయినా అధికారపార్టీకి తగినన్ని సీట్లు ఉన్నప్పటికీ ఇలాంటి పనులకు దిగజారడం శోచనీయం. ప్రజాస్వామ్యానికి అధికార, ప్రతిపక్షాలు రెండూ రెండు కళ్లులాంటివి. అలాంటి కళ్లను చీకటి చేసి ప్రజలను అంధకారంలో నడపాలనుకోవడం క్షేమదాయకం కాదు. రాష్ట్రంలో ఆరోగ్యకరమైన రాజకీయాలు ఉండాలన్నదే ప్రజల అభిమతం. అంతేకాని, శాసనసభలో ఇష్టానుసారం ప్రవర్తించడం, ప్రతిపక్షం గొంతు నొక్కిపట్టి ఉంచడం, అధికారపక్షం నోరేసేకుని పడటం, లేదంటే ప్రతిపక్ష సభ్యులు అధికార పక్ష సభ్యుల్ని ఇరకాటంలో పెట్టడమే ద్వేయంగా ఉండటం ప్రజల మనోభావాలను దెబ్బతీస్తుందని గుర్తెరగాలి.

అసలు రాజధానే వద్దన్నట్లుందే!

శివరామకృష్ణన్ కమిటీ నివేదికపై ఎన్‌జీటీ వ్యాఖ్య

న్యూఢిల్లీ : 'అసలు ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని నగరమే వద్దు అన్నట్లుగా ఉందే' అని శివరామకృష్ణన్ కమిటీ నివేదికను ఉద్దేశించి జాతీయ హరిత ధర్మాసనం (ఎన్‌జీటీ) వాఖ్యానించింది. అమరావతి ప్రాంతంలో రాజధాని నిర్మాణాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పటిషన్లపై ఎన్‌జీటీ చైర్మన్ జస్టిస్ స్వతంత్రకుమార్ ఆధ్వర్యంలోని ధర్మాసనం విచారణ కొనసాగించింది. ఏపీలో రాజధాని ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ ఏ ప్రాంతాన్ని అందుకు ఎంపిక చేసిందని ప్రశ్నించింది. ఇందుకు ఆంధ్ర తరపు సీనియర్ న్యాయవాది ఏకే గంగూలీ సమాధానమిస్తూ..' ఐదు అంశాలవారీగా రాష్ట్రంలోని 9 జిల్లాలను కమిటీ మదించింది. విజయవాడ- గుంటూరు ప్రాంతానికి ఎక్కువ మార్కులు లభించాయి' అని తెలిపారు. రాజధానికి అనువైన ప్రాంతంగా కమిటీ దేనినైనా సిఫారసు చేసిందా అని ధర్మాసనం అడగగా.. కమిటీ కేవలం అధ్యయనం మాత్రమే చేసిందని, రాజధాని ఎంపిక బాధ్యత దానిది కాదని, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి ఎంపిక చేసుకునే హక్కు రాష్ట్రానికి ఉందని గంగూలీ వివరించారు. ఈ సందర్భంగా పిటిషనర్ల తరపు న్యాయవాది శ్రావణ్‌కుమార్ జోక్యం చేసుకుంటూ... రాజధానిని విజయవాడ- గుంటూరు ప్రాంతంలో మాత్రం పెట్టవద్దని కమిటీ సూచిందన్నారు. అలా నివేదికలో ఎక్కడుందో చూపించాలని ధర్మాసనం పేర్కొనగా.. కొన్ని పేరాలను శ్రావణ్ చదివి వినిపించారు. వ్యవసాయ భూములు ఉన్నందున, జనాభా అధికంగా ఉన్నందున విజయవాడ- గుంటూరు- తెనాలి-మంగళగిరి ప్రాంతం రాజధానికి సరికాదని కమిటీ సిఫారసు చేసిందన్నారు. పైగా హైదరాబాద్‌లో మొత్తం అభివృద్ధి కేంద్రీకృతమైనందున మరోసారి అలాంటి రాజధానిని ఏర్పాటు చేయవద్దని కూడా సూచించిందన్నారు.జస్టిస్ స్వతంత్రకుమార్ స్పందిస్తూ..కమిటీ చెప్పింది చూస్తే రాజధానే వద్దు అన్నట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. కాగా, కొండవీటి వాగు వరద ముంపును ఎత్తిపోసేందుకు ముఖ్యమంత్రి ఒక పథకాన్ని ప్రారంభించారని న్యాయవాది శ్రావణ్‌కుమార్ ఎన్‌జీటీ దృష్టికి తీసుకెళ్లారు. 'అలా చేయడం మంచిదంటారా.. కాదంటారా' అని ధర్మాసనం ప్రశ్నించింది. అనంతరం విచారణను వాయిదా వేసింది.

ఇంటి, కుళాయి పన్నులు వెంటనే చెల్లించాలి

రాజధాని ప్రతినిధి, రాయపూడి: తుళ్ళూరు మండల రాయపూడి గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటి, కుళాయిల పన్ను చెల్లించనివారు వెంటేనే చెల్లించాలని రాయపూడి కార్యదర్శి గాదె వెంకటప్పయ్య కోరారు. 2016-2017 సంవత్సరానికి ఈ నెల 20వ తేదీలోపు పన్ను చెల్లించాలన్నారు. చెల్లించిన పన్ను రశీదులను భద్రపరచుకోవాలని, ఇంటి ఆస్తి విలువలకు ఈ పన్ను ప్రధానమైనందున రశీదులు పొంది గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ నెల 20 లోపు ఇంటి, నీటి కుళాయి పన్నులను చెల్లించని వారికి ప్రత్యేకమైన నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెంకటప్పయ్య హెచ్చరించారు.

హిందుచట్టం

మన దేశంలో హిందువులు జనాభా ఎక్కువ కాబట్టి, ముందుగా హిందు చట్టం గురించి తెలుసుకుదాం. ఈ చట్టాన్ని క్రోడీకరించింది బ్రిటిష్ వారే. దేశాన్ని పరిపాలించాలంటే దేశీయుల ఆచార్య వ్యవహారాలు, చట్టాలు తెలిసితీరాలి. మనది భిన్నత్వంలో ఏకత్వం గల దేశం. అందరూ భారతీయులే అయినా ఎవరి ఆచారాలు వారివే. అందువల్ల హిందుధర్మానికి చెందిన పండితుల్ని పిలిపించి, ధర్మ శాస్త్రాలను క్రోడీకరించే పని అప్పగించారు.

ప్రధానంగా మన ధర్మాశాస్త్రాలు 'శ్రుతి,స్మృతి' అనే మూలగ్రంథాల మీద ఆధారపడి ఉన్నాయి. వేదాలంటే శ్రుతులే.భగవంతుని నుండి రుషులు విన్నవాటిని వేదాలు-శ్రతులుగా చెబుతారు. వేదాలు నాలుగు అవి, రుగ్, యజుర్, సామ, అధర్వ వేదాలు.'స్మృతి' అంటే జ్ఞప్తిలో ఉంచుకున్నవి. ఇవి రుషుల నుండి తరతరాలుగా అందజేయబడిన ధర్మములు. ఇవి ప్రధానంగా మూడు మను, యాజ్ఞవల్య, నారద-అని వీటికి పేర్లు.

హిందుచట్టం వీటి ఆధారంగా నిర్మితమైంది. తర్వాత కాలంలో వివిధ అంశాలకు గాను వేర్వేరుచట్టాలు చేయటం జరిగింది ఆ వివరాలు

1. హిందు వివాహ చట్టం - 1955
2. హిందు వారసత్వ చట్టం - 1956

పౌరులు-చట్టాలు
Law-Citizen

కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
హైకోర్టు న్యాయవాది
98495 68901 / 83309 68901
katuruRavindraTrivikram@gmail.com

3. హిందు మైనార్టీ మరియు గార్డియన్‌షిప్ చట్టం, 1956
4. హిందు దత్తత మరియు పోషణ చట్టం - 1956

దయాభాగ, మితాక్షర వంటి భిన్న ఆచారాలలోని ముఖ్యాంశాలను క్రోడీకరించడం వల్ల న్యాయ నిర్ణయాలకు సౌలభ్యం కలిగింది. కొన్నింటిని తొలగించడం వల్ల అయోమయం తొలగింది.

మహమ్మదీయచట్టం

బ్రిటీష్ వారు ముస్లిము పాలకుల నుండీ రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. ముసల్మానుల న్యాయసూత్రాలను, మతమేధావుల సహాయ సహకారాలతో తయారు చేయించారు. వీటికి ఆధారాలు-

1. ఖురాన్ : ఇవి భగవంతుని పలుకులతో నిండి ఉంది. ప్రవక్తమహ్మద్ దైవవాణిని వింటూ లిఖించిన పవిత్ర గ్రంథం ఇది. అత్యంత ప్రామాణికమైంది. మహమ్మదీయ చట్టాలకు మూలంగా చెప్పదగినది. అధికారయుతమైనది.
2. హదీసులు : మహ్మద్ ప్రవక్త బోధలు, ఆచరణలు వగైరా
3. ఇజ్మాలు : ఖురాన్‌కి హదీసులకి వ్యతిరేకం కానివి, మహ్మద్ ప్రవక్త సహచరులు, ఆయన శిష్యులు వెలిబుచ్చిన అభిప్రాయాల ఆమోదం
4. ఖాయాన్ : విచక్షణాయుతమైన నిర్ణయాలు
5. న్యాయ వ్యాఖ్యానాలు : ఉదా॥హిదయా (12వ శతాబ్దం), ఫత్వా ఆలమ్‌గిరి (ఔరంగజేబు ఆదేశాల ప్రకారం కూర్పు చేయబడింది)

మహమ్మదీయులు, వారి వ్యక్తిగత చట్టాలు (personal law)కి బద్ధులు. ఆచారవ్యవహారాలు, దేశచట్టాలను అనుసరించి - వారసత్వం, వీలునామాలు, వివాహాలు, కట్నకానుకలు,వక్ఫ్, గార్డియన్‌షిప్ వగైరాలు..

1954లో వక్ఫ్ ఆస్తుల క్రమబద్ధీకరణకు చట్టం చేయబడింది. 1986లో ముస్లిమ్ మహిళల చట్టం (విడాకుల తర్వాత హక్కుల రక్షణకు) చేయబడింది. ఇది మహిళల జీవనహక్కుకు సంబంధించింది.

1954-ప్రత్యేక వివాహ చట్టం మరియు వ్యక్తిగత చట్టాల కొనసాగింపు

ఏ మత చట్టాలూ వర్తించని వారికి ఈ చట్టం వర్తిస్తుంది. ఇది న్యాయం, సమానత్వం, మంచి-చెడు విచక్షణలమీద, ఇంగ్లీషు చట్టాల సూత్రాలకు అనుగుణంగా చేయబడింది. చాలా అరుదుగా మాత్రమే ఈ చట్టం ఉపయోగించటం జరుగుతుంది.

అబ్బో.. ఎన్ని పక్షులో...

విజయవాడ డీపీఆర్వో ఆఫీస్ ఎదురుగా ఉన్న చెట్టుపై కనిపించిన దృశ్యం

ఉగాదిపై తర్జనబర్జన

రాజధానిప్రతినిధి : తెలుగు నూతన సంవత్సరం" హేమలంబిక " ఎప్పుడు నుండి మొదలవుతుందో ఇంకా నిర్ధారణకాలేదు. తిథిని నిశ్చయించలేక పురోహితులు తర్జన భర్జన పడుతున్నారు. మార్చి 28 లేదా 29 వ తేది ఉగాది పండుగ ఆచరించాలా అన్న విషయంపై పండితులు భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం పంచాంగం ప్రకారం 29న ఉగాది అని, కంచిపీఠాదిపతి ఈ నెల 28న అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పంచాంగం ప్రకారం 28న ఉగాదిగా తెలుపుతోంది. పండితుల మధ్య ఉన్న భిన్నాభిప్రాయాల వల్ల ప్రజలు అయోమయంలో ఉన్నారని, సాధ్యమైనంత త్వరగా ప్రకటనచేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

నూతన అసెంబ్లీ రెడీ

(మొదటిపేజీ తరువాయి)

జనాభా,వాహనాలు, ప్రభుత్వ ఆఫీసులతో, అసెంబ్లీ నిర్మాణాలతో రానున్న రోజుల్లో ప్రశాంతతను కోల్పోతాయా అని ఇక్కడి ప్రజలు భీతిల్లు తున్నారు. వివాదాలు లేని ఈ ప్రాంతంలో అసెంబ్లీ నిర్మించడంతో ఆందోళనాకారులంతా ఇక్కడకు చేరివారి నిరసన ప్రదర్శనలతో ఈ ప్రాంతంలో శాంతిభద్రతలకు ముప్పుగా వాటిల్లుతుందాని కలత చెందుతున్నారు. ఈ ప్రాంతాన్ని రాజధానిగా రూపొందించిన సమయంలో ఎంతో సంతోషపడ్డ ప్రజలు రానున్న కాలంలో ఆందోళనలకు, నిరసనలకు వేదికగా మారుతుందని ఆవేదన చెందుతున్నారు. అగ్రిగోల్డ్ బాధితులకోసం మూడేళ్లనుంచి ముఖ్యమంత్రిని, మిగతా మంత్రులను కలిసి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితంలేకపోయిందని, దీంతో అసెంబ్లీ ప్రారంభం రోజున బాధితులతో కలసి ధర్నా చేపడతామని ఇప్పటికే వామపక్షాలు తాఖీదు ఇచ్చాయి. నూతన అసెంబ్లీలో కరువుపై చర్చిండాలని , లేదంటే తీవ్ర ఆందోళనలు చేపడతామని ప్రతిపక్షాలు హెచ్చరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి ప్రజలు తమ ప్రశాంతతను కోల్పోతున్నామని భావిస్తున్నారు. సోమవారం జరిగే అసెంబ్లీ కార్యక్రమాలకు హాజరయ్యే 175 మంది ఎమ్మెల్యేలు, వారి మందిమాగాదులు, రాష్ట్రం నలుమూలల నుంచి అనేక సమస్యలపై ఇక్కడకు వచ్చే ఆందోళనాకారుల నినాదాలతో ఈ ప్రాంతం మర్మోగిపోతుందని ఇక్కడి ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

పోలీసులకు పరీక్షా కాలం

పల్లెటూరి నుంచి మహానగరంగా రూపొందుతున్న రాజధాని ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు చేయడం సవాల్‌తో కూడుకుంది. ఇప్పటికే ఇక్కడ మావోయిస్టుల కదలికలు ఉండటం, ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందికాకపోవడంతో రోజురోజుకు కొత్త వ్యక్తులు ఈ ప్రాంతానికి రావడంతో అనుమానితులపై నిఘా పెట్టడం కష్టసాధ్యంగా మారింది. అయినప్పటికీ నిఘా కెమేరాలతోను, బ్యాంబు స్క్వాడ్లు, జాగిలాలతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. సభలకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఆందోళనాకారులను నిరోధించడానికి పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు.

బెంబెలెత్తిస్తున్న ప్రైవేటు బస్సులు

(మొదటిపేజీ తరువాయి)

తిప్పి, వారిని అలసటకు గురిచేయడంతో తెల్లవారు జామున నిద్రకునుకుతో స్టీరింగ్ కంట్రోల్ తప్పిందంటున్నారు. రాష్ట్ర రవాణా బస్సులు నిర్ణీత వేగంతోనే వెళతాయి. అయితే నిబంధనలకు వ్యతిరేకంగా స్టేజికారియర్లుగా ఉన్న ఈ బస్సులు 120 కి.మీ వేగంతో పక్కన వెళ్లే వాళ్లకు కూడా భయం పుట్టిస్తుంటాయి. బస్సుల విపరీత వేగాన్ని నిరోధించడానికి ఇంటర్‌సెప్టర్ వాహనాన్ని పోలీసులు ప్రవేశపెట్టినా పనితీరు సక్రమంగా లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని ప్రజలు భావిస్తున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి ప్రయాణీకులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

ఏపీలో మరో ప్రైవేటు బస్సుకు ప్రమాదం

తణుకు: కృష్ణాజిల్లాలో ప్రైవేట్ బస్సు ప్రమాదం మరువక ముందే తెలుగు రాష్ట్రాల్లో రోజుకో ప్రమాదం జరుగుతుంది. దీంతో ప్రయాణికులను భయభ్రాంతులకు గురి అవుతున్నారు. తాజాగా పశ్చిమ గోదావరి జిల్లాలో ఓ ప్రైవేటు బస్సుకు ప్రమాదం జరిగింది. జిల్లాలోని తణుకు సమీపంలో హైవేపై ప్రైవేట్ బస్సు-ట్యాంకర్ ఢీ కొన్నాయి. దీంతో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. అయితే వారి గాయాలు ప్రమాదకరమైనవి కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

అమెరికాలో మరో భారతీయుడి హత్య

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతుండగా ఇది జాత్యహంకార దాడి అని చెప్పలేమని, విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.నిందితుల కోసం గాలిస్తున్నారు. గురువారం రాత్రి ఓ మహిళ పోలీసులకు ఫోన్ చేసి వ్యక్తి అరుపులు, తుపాకీ కాల్పుల శబ్దాలు వినిపించాయని చెప్పడంతో వారు ఘటనాస్థలానికి వచ్చారు. పటేల్ ఇంటికి కొంచెం దూరంలోనే ఆయన మృతదేహం పోలీసులకు లభ్యమైనట్లు డబ్ల్యుబీటీవీ వెల్లడించింది. పటేల్ చాలా మంచి వ్యక్తి అని, కస్టమర్లతో చాలా మర్యాదగా వ్యవహరిస్తారని, చాలా దయగల వ్యక్తి అని అక్కడి వారు చెప్పారు. పటేల్‌కు భార్య, ఎలిమెంటరీ స్కూల్‌లో చదువుతున్న చిన్నారి ఉన్నారు. హత్య జరిగిన సమయంలో వారు ఇంట్లో ఉన్నారు. పటేల్ హత్యపై లాంకాస్టర్ ప్రాంతంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. పటేల్ స్టోర్ బయట ప్రజలు ఆయనకు నివాళు లర్పించారు. స్టోర్ బయట ఫ్యామిలీ ఎమర్జెన్సీ వల్ల కొన్ని రోజులు స్టోర్ మూసేస్తున్నామని, అసౌకర్యానికి క్షమించాలని రాసి పెట్టారు.

ఎస్సీకాలనీ వాసులకు జేసీ శుక్లా భరోసా

రాజధాని ప్రతినిధి-రాయపూడి : సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణాలతో ఇళ్లు కోల్పోతున్న నివాసితులకు జేసీ శుక్లా భరోసా ఇచ్చారు. తుళ్ళూరు మండలం రాయపూడి పాత ,కొత్త ఎస్సీ కాలనీలోని 289, 288, 292,317 సర్వే నెంబర్ల నుంచి సీడ్ యాక్సెస్ రోడ్లు నిర్మాణాలు జరుగుతాయన్నారు. ఈ విషయంపై నివాసితులు ఆందోళన వ్యక్తం చేయగా, దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ బాధితులు ఆందోళన చెందనక్కర్లేదని, ఆర్ అండ్ బీ అధికారులు సర్వేచేసి సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణం కోసం తీసుకున్న స్థలాలకు అంతే మొత్తంలో స్థలాలను దగ్గర్లోనే కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తుళ్ళూరు మండల తహశీల్దార్ సుధీర్‌బాబు, సీఆర్‌డీఏ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

FORM IV

Statement about ownership and other particulars about newspaper RAJADHANI VARTALU

1.Place of publication	: Rayapudi, Guntur District
2.Periodicity of its publication	: Weekly
3.Printer's Name	: Pattan Hussain Khan
Nationality	: Indian
Address	: 6-45/1, Rayapudi Post, Guntur District, AP – 522237
4.Publisher's Name	: Pattan Hussain Khan
Nationality	: Indian
Address	: 6-45/1, Rayapudi Post, Guntur District, AP – 522237
5.Editor's Name	: Pattan Hussain Khan
Nationality	: Indian
Address	: 6-45/1, Rayapudi Post, Guntur District, AP – 522237
6.Names and addresses of Individuals who own the newspaper and partners or shareholders holding more than one percent of the total capital	: Vastitude Media Pvt.Ltd

I, Pattan Hussain Khan, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief

Sd/ –
Pattan Hussain Khan
Signature of Publisher

Date : 5-3-2017

నటులు - రాజకీయాలు

ఆంధ్రప్రదేశ్‌లో నటులు రాజకీయాల్లోకి రావడం మొదలైంది నాకు తెలిసి కళావాచస్పతి జగ్గయ్య దగ్గర నుంచే ... నటుడిగా తన కేరీర్ అత్యున్నతంగా ఉండగానే అప్పటి అధికార పార్టీ కాంగ్రెస్‌నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. ఆతరువాత తమిళనాడులో హీరోగా వెలిగిపోతున్న రామచంద్రన్, కథారచయితగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్న కరుణానిధులు రాజకీయాల్లోకి వచ్చారు. అదే సమయంలో అగ్రదేశం అమెరికాలో రోనాల్డ్ రీగన్‌కూడా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయనకు కూడా సినీనేపథ్యం ఉంది. కాలిఫోర్నియా మేయర్ (2003-2011)గా పనిచేసిన ఆర్నాల్డ్ స్వ్వార్జ్‌నెగ్గర్ 20 ఏళ్లకే మిస్టర్ ఒలంపిక్స్‌గా ఎన్నికై సినిమాల్లో హీరోగా నటించారు. అయితే ఆంధ్రదేశాన అపార అభిమానులను సొంతం చేసుకున్న ఎన్‌టీరామారావు ఎనిమిది మాసాలు సమైఖ్య ఆంధ్రప్రదేశ్‌లో తిరిగి అధికారాన్ని సొంతం చేసుకోవడం మాత్రం సినీపరిశ్రమను చాలా ప్రభావితం చేసింది. రాష్ట్రంలో కమ్యూనిష్టులు పదవులను అందిపుచ్చుకోలేని సమయంలో కాంగ్రెస్‌కు ఎదురులేదని భావిస్తుండగా సుడిగాలి పర్యటనతో ఆశేష జనవాహినిని మెప్పించి ముఖ్యమంత్రి పీఠం అధిష్టించారు ఎన్టీఆర్. ఆయనను ఎదుర్కొనేందుకు అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ సినిమా నటులను బాగా ప్రోత్సహించారు. అందులో భాగంగా కృష్ణ, కృష్ణంరాజు, జమున, కోటా శ్రీనివాసరావులు ఉన్నారు. దీని తర్వాత చాలా గ్యాప్ వచ్చింది. ఆపై చిరంజీవి ప్రజారాజ్యం పేరుతో ప్రజల మధ్యకు వచ్చారు. అప్పుడు కూడా అనేకకాపుసంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి వారినుంచి సలహాలు, సూచనలు తీసుకొని ఎట్టకేలకు ప్రజారాజ్య పార్టీని స్థాపిస్తున్నట్లుగా తిరుపతి మహాసభలో ప్రకటించారు. అయితే కొద్దిపాటి ఓట్లతేడాతో ఓడిపోవడంతో, ప్రజారాజ్యం అధికారం చేజిక్కించుకోలేక పోయింది. దాంతో కాంగ్రెస్‌లో విలీనమయ్యేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌తో అంగీకారం కుదిరినప్పటికీ, ఆయన హఠాన్మరణంతో కిరణ్‌కుమార్‌రెడ్డి సోనియాగాంధీ సమక్షంలోనే పార్టీని విలీనం చేసి కేంద్ర పర్యాటక మంత్రిగా పదవిని నిర్వహించారు. రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ రాష్ట్రంలో తుడిచిపెట్టుకు పోవడంతో మళ్లీ ఆయన చిత్రపరిశ్రమకు చేరుకున్నారు. 9 ఏళ్ల తరువాత ఖైదీనెంబరు 150 ద్వారా మళ్లీ చరిత్ర సృష్టించారు.

పవన్ రెండు పడవల ప్రయాణం

దీన్నిబట్టి మనకు అర్థమయ్యేదేమంటే హీరోలు రాజకీయాల్లోకి వస్తారు...నిలదొక్కుకుంటే ఓకే... లేదంటే మళ్లీ వారి దారి వారు చూసుకుంటారు. ప్రస్తుతం పవన్‌కల్యాణ్ కూడా దీనికి మినహాయింపు లేదనిపిస్తోంది. ఆయన జనసేన రాజకీయపార్టీని స్థాపించారు. అయితే అదినామ మాత్రమే... ఇంతవరకు దానికి కార్యవర్గ సభ్యులెవరూ లేరు. ఆ దిశగా ప్రయత్నాలు కూడా జరపడంలేదు. పభుత్వం పనిచేయక పోతే ప్రశ్నిస్తాను... అవినీతికి ఓటేయ్యవద్దు.. అన్నారు... అభిమానులు ఊగిపోయారు. తద్వారా గెలవదనుకున్న టీడీపీ పార్టీ అధికారంలోకి వచ్చింది. అధికారపార్టీ రైతుల నుంచి బలవంతంగా భూసేకరణచేస్తుంటే ఒక్కసారి రాజధాని ప్రాంతాన్ని దర్శించి రైతులు ఉదారంగా ఇస్తేనే భూములుతీసుకోవాలని హడావుడిగా వచ్చి అంతే స్పీడుతో వెళ్లిపోయారు. అయితే కరెంటు సరఫరా నిలిపి,మోటర్లు కట్‌చేసి రైతుల నుంచి ప్రభుత్వం ఎంత దౌర్జన్యంగా భూములు లాక్కొన్నారో అందరికీ తెలిసిన విషయమే.. దిన,వార , తెలుగు ,ఆంగ్ల వార్తా పత్రికలు ఆ విషయాలను ఎప్పటికప్పుడు బయట పెడుతూనే ఉన్నారు. అయినా ఎన్నికల ప్రచారంలోని ఆవేశం, వాగ్దాటి లేనేలేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక హోదా ప్రకటించనందుకు రాష్ట్రంలో కేవలం రెండు సార్లు మహాసభలు పెట్టారు. ఉద్దానం కిడ్నీవ్యాధిగ్రస్తుల కోసం సమావేశం ఏర్పాటు చేసి తూతూ మంత్రంగా డైలాగుల చెప్పి వెళ్లిపోయారు. ఆయన ఒక్క మాటంటే అనేక మంది అభిమానులు కిడ్నీ బాధితుల కోసం శాశ్వత సేవలందించడానికి, అనేక కార్యక్రమాలు నిర్వహించడానికి ముందు కొస్తారు. అయితే అది ఒక పోగ్రాంలా చేశారేతప్ప దానిలో నిబద్ధత పూర్తిగా కరువైందని చెప్పక తప్పదు. అదేవిధంగా ముద్రగడ పద్మనాభం ఆమరణ దీక్షలు...నిజానికి అది టీడీపీ అధికారంలోకి రావడానికి ముందు చేసిన ఎన్నికల వాగ్దానం.. దాన్ని గురించి ఇంతవరకు ఎందుకు అడగలేకపోతున్నారో తెలియడం లేదు. అదేమంటే నా కూతురు క్రిస్టియన్ ఆల్‌రడీ బాప్తిస్మం తీసుకుంది, మరోకూతురు హిందూ అంటారు. కులాలు మతాలు నాకు అంటగట్టవద్దు అంటారు. అది ఎన్నికల వాగ్దానం కదా...దాన్ని గురించి ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయరో పరమాత్ముడికే ఎరుక. మొన్నటికి మొన్న చేనేత పరిశ్రమను ఆదుకోవాలని చేనేత కార్మికులు ఆయన దగ్గరకు వెళ్లితే ఒక తేదీ నిర్ణయించి , ఆ సమయానికి అక్కడకు వచ్చి నాలుగు మాటలు చెప్పి వచ్చారు. అభిమానులు మరికొందరు మరో విషయంపై పిల్చినా ఇదే తతంగం. అంతే కాని ఆయన పూర్తి సమయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయాలకు కేటాయించేందుకు సంసిద్ధత వ్యక్తం చేయడంలేదు. ఏదో అభిమానంతో ఆయన్ను అడగడం, ఆయన షూటింగ్ సెలవున్నప్పుడు రావడం ఇదే తతంగం ...ఇలానే మరో రెండేళ్లు గడిపే స్థితే కనిపిస్తుంది. నిజానికి కొత్త రాష్ట్రంలో చేయవలసిన వి చాలా ఉన్నాయి. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకొని తన సినిమాలను సూపర్ డూపర్ హిట్ చేసిన ప్రజల రుణం కొంతైనా తీర్చుకుందాం అనే ధోరణి వ్యక్తం కావడంలేదు... కేవలం కాలక్షేప కబుర్లు మాత్రమే....అని రాజకీయపండితులు విశ్లేషిస్తున్నారు. రెండేళ్లలో ఎన్నికల్లో పోటీ చేస్తాననడం కేవలం అవకాశరాజకీయాలే తప్ప, ప్రజలకు ఒరగబెట్టిందేమీలేదు. ఇప్పటికైనా చిత్తశుద్ధితో రాజకీయాల్లోకి వస్తారా? డైలాగులతో కాకుండా కార్యసాధనకు ఉపక్రమిస్తారా అంటూ అభిమానులు నిలదీయాల్సిన సమయం ఆసన్నమైంది. లేకపోతే ప్రజల తమ ఆశలు వమ్ము చేసుకోవాల్సి ఉంటుందని గుర్తు పెట్టుకోవాలి. అభిమానులను నిరశ పరిచే అంశం ఏమంటే పవన్‌కల్యాణ్‌కు ఏదో చేసేయ్యాలన్న ఆవేశం ఉందికాని, ఎలా చేయాలన్న దానిపై వ్యూహం,ప్రణాళిక, కార్యాచరణలు మాత్రం లేవు. అందువల్లే రాజకీయాలకు పూర్తి కాలం కేటాయించలేకపోతున్నారు.



– ఖాన్

ఆ రెండు అంశాలను పరిష్కరించండి

జీఎస్‌టీ కౌన్సిల్ చెర్మన్‌కు మంత్రి యనమల లేఖ

రాజధాని ప్రతినిధి, అమరావతి : తీరప్రాంతం నుంచి 12 నాటికల్ మైల్స్ వరకు ఉన్న సముద్ర జలాలపై పన్ను వసూలు చేసే హక్కు రాష్ట్రాలకు అప్పగించడంతో పాటు, జీఎస్‌టీ చట్టంలో రాష్ట్ర అధికారులను మినహాయింపుపై జీఎస్‌టీ కౌన్సిల్ చైర్మన్‌కు రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు లేఖ రాశారు. ఇటీవల రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో జరిగిన 10 వ జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశాల్లో ఈ అంశాలు సూచించామని వీటిపై తుది నిర్ణయం తీసుకోవాలని కోరారు. అలాగే ఈ రెండు అంశాలపై తలెత్తిన వివాదాలను పరిష్కరించడానికి న్యాయశాఖ పరిశీలనకు పంపించామని కూడా తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకున్న తర్వాతే తుది జీఎస్‌టీ ముసాయిదా, పరిహారానికి సంబంధించిన నిబంధనలను జారీ చేయాలని మంత్రి యనమల విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రాహాస్పిటల్స్‌లో యూకే వైద్యులతో పిల్లల గుండె ఆపరేషన్లు

రాజధాని ప్రతినిధి ,విజయవాడ : ఆంధ్రా హాస్పిటల్స్ హార్ట్ అండ్ బ్రెయిన్ ఇన్‌స్టిట్యూట్‌లో హీలింగ్ లిటిల్ హార్ట్ యూకే డాక్టర్ల టీమ్‌తో గత నెల 26 నుండి మార్చి 4వ తేదీ వరకు గుండె ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రహాస్పిటల్ డైరెక్టర్ పి.వి.రామారావు తెలిపారు.ఆంధ్రహార్ట్ అండ్ బ్రెయిన్ ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 మంది ఇంగ్లండ్ డాక్టర్ల బృందం పిల్లల ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్, ఇద్దరు పిల్లల కార్డియాక్ సర్జన్లు, పిల్లల ఇంటెన్సివ్‌కేర్ నర్సుల బృందం 15 ఆపరేషన్ల వరకు చేయనున్నట్లు తెలిపారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఇంగ్లాండ్ హాస్పిటల్స్ ఆల్డర్ హై హాస్పిటల్, లివర్ పూల్ లెసిస్టర్ రాయల్ ఇఫెర్కిటి లిసిస్టర్ గ్లెన్‌ఫీల్డ్ హాస్పిటల్, లెస్టర్ గ్రేట్ అర్కండ్ స్ట్రీట్ హాస్పిటల్ లండన్ నుండి వచ్చిన డాక్టర్ సంజీవ్ నిచాని పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్ ఆధ్వర్యంలో ఈ బృందం గుండె ఆపరేషన్లు నిర్వహిస్తారని చెప్పారు. గత ఏడాది నుండి హీలింగ్ లిటిల్ హార్ట్ యూకే ఆధ్వర్యంలో 3 నెలలకోసారి వారం రోజుల పాటు అతి క్లిష్టమైన పిల్లల గుండెజబ్బులకు ఉచిత సర్జరీ జరుగుతున్నదన్నారు. ఈ నెల 19 నుండి 25 వరకు మరో క్యాంపునిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ క్యాంపులో వంద సర్జరీలు నిర్వహిస్తారని తెలిపారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో గత రెండేళ్లలో ఎన్నో పిల్లల గుండె ఆపరేషన్లు విజయవంతంగా చేశామని చెప్పారు. వైద్యులు దిలీప్, రమేష్, ఇంగ్లండ్ వైద్యులు, ఇతర డాక్టర్ల బృందం పాల్గొన్నారు.

మూడు నెలలకే రివాల్వింగ్ ఫండ్ !

కొత్త మహిళా సంఘాలకు ప్రభుత్వ కానుక

విజయనగరం : మహిళలకు కొత్త తాయిలాన్ని అందిస్తోంది ప్రభుత్వం. పట్టణాల్లో కొత్త మహిళాసంఘాలకు మూడు నెలల్లోనే రివాల్వింగ్ ఫండ్ మంజూరు చేస్తోంది విజయవాడ జిల్లాలోని మున్సిపాల్టీల్లో ఇప్పటికే 195 కొత్త సంఘాలకు మూడు నెలలు కాగానే రివాల్వింగ్ ఫండ్ మంజూరవుతుంది. గతంలో ఆరు నెలలు అయితేనే అవకాశం ఉండేది. మూడు నెలలకే ప్రతి సంఘానికి రూ.10 వేలు మంజూరు అవుతుంది. ముంజూరైన రివాల్వింగ్ ఫండ్, సంఘం దాచుకున్న పొదుపు సొమ్ము మొత్తానికి నాలుగు రెట్లు బ్యాంకు లింకేజీ లబ్ధి పొందనున్నారు.ఈ ఏడాది బ్యాంకు లింకేజీ రూపంలో రూ. 56 కోట్లు ఇవ్వాలని పట్టణ ప్రాంత పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) నిర్ణయించగా, ఇప్పటివరకు రూ.62 కోట్లు మంజూరు చేసి లక్ష్యాన్ని అధిగమించింది. విజయనగరం మున్సిపాల్టీలోని సంఘాలకు రూ. 36 కోట్లు , పార్వతీ పురం సంఘాలకు రూ.5.6 కోట్లు, బొబ్బిలి సంఘాలకు రూ.7.6 కోట్లు, సాలూరు సంఘాలకు రూ. 6.8 కోట్లు మంజూరు చేయగా, మొన్ననే మున్సిపాల్టీ హోదా పొందిన నెల్లిమర్లలోని మహిళా సంఘాలకు కూడా రూ. 5.8 కోట్లు మంజూరు చేయడం విశేషం. జిల్లాలోని మొత్తం ఐదు మున్సిపాల్టీల పరిధిలోని 293 ఎస్ఎల్ఎఫ్‌ల్లో 104 సంఘాలకు ఒక్కోదానికి రూ.50 వేల చొప్పున కార్పస్ ఫండ్ మంజూరైంది. ఆయా సంఘాల్లోని సభ్యుల సామర్థ్య పెంపుదలకు దీనిని వినియోగిస్తారు. వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు ఈ నిధులు దోహదం చేస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

క్షతగాత్రులను పరామర్శించిన కలెక్టర్

రాజధాని ప్రతినిధి ;(విజయవాడ) : కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలు మండలం, మండ్లపాడు వద్ద జాతీయ రహదారి పై జరిగిన ప్రమాదంలో గాయపడి భవానీపురం ఆంధ్రా హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న క్షతగాత్రులను జిల్లా కలెక్టర్ బాబు పరామర్శించారు. వారికి అందిస్తున్న వైద్య సదుపాయాలపై ఆస్పత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రాఆస్పత్రిలో 12 మంది క్షతగ్రాతులు చికిత్స పొందుతుండగా వీరిలో ఏడుగురు ఐసీయులోను, ఐదుగురు జనరల్ వార్డులోను వైద్య సౌకర్యాలు పొందుతున్నారు. చికిత్స పొందుతున్న ప్రతి ఒక్కరి గురించి కలెక్టర్ యోగక్షేమాలు అడిగి తెలుసుకొని తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యాధికారులతో మాట్లాడుతూ బాధితులకు అందిస్తున్న వైద్య సదుపాయాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో జిల్లా కలెక్టర్ బాబుతో పాటు ఎన్టీఆర్ వైద్యసేవా జిల్లా కోఆర్డినేటర్ కె.దుర్గాప్రసాద్, రూరల్ తహసీల్దార్ మదన్ మోహన్ ఆంధ్రా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రవీంద్రనాథ్‌లు ఉన్నారు.

పోలింగ్ రోజున సెలవు ప్రకటించాలి : ఎస్టీయూ

రాజధాని ప్రతినిధి-విజయవాడ : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ రోజైన 9వ తేదీలు ఓటు హక్కును వినియోగించేందుకునే నిమిత్తం సెలవు దినంగా ప్రకటించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు ఇ షణ్ముర్తి, సీహెచ్ జోసెఫ్ సుధీర్‌బాబు ఒక ప్రకటనలో డిమాండు చేశారు. ప్రస్తుతం ఓటర్లుగా నమోదైన వారు వారి నివాస ప్రాంతంలో నమోదైనందున, పనిచేసే ప్రాంతానికి ఓటు హక్కు వినియోగించుకోవడానికి వెళ్లాలంటే ఎక్కువ దూరం వెళ్లవలసి ఉంటుందన్నారు. ఈ కారణంగా తప్పనిసరిగా ప్రత్యేక సెలవు కాకుండా సాధారణ సెలవుగా ప్రకటించాలని వారు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల అధికారికి వినతిపత్రాన్ని అందజేసినట్లు ఎస్టీయూ నేతలు తెలిపారు.

ప్రారంభోత్సవానికి ఆహ్వానించలేదు : వైసీపీ

రాజధాని ప్రతినిధి- అమరావతి : అసెంబ్లీ నూతన భవన ప్రారంభోత్సవానికి తమకు ఆహ్వానం పంపించలేదని వైసీపీ నేతలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. వెలగపూడిలో తాత్కాలిక సచివాలయ భవన సముదాయంలో నిర్మించిన అసెంబ్లీ భవనాన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం తన ప్రసంగంలో ప్రతిపక్ష నేతలు ప్రారంభ కార్యక్రమానికి హాజరుకాకపోడం బాధాకరమన్నారు. రాజకీయ విబేధాలు ఎన్ని ఉన్నప్పటికీ ఇది ప్రజలందరికీ సంబంధించిన గౌరవ సభ కావడం వల్ల వారు కూడా హాజరైతే బాగుండేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే ప్రారంభోత్సవం పూర్తయిన తర్వాత అసెంబ్లీ భవనంలోకి ప్రవేశించిన నేతలు ఉమ్మారెడ్డి, పెద్దిరెడ్డిలను పలువురు విలేకరులు కార్యక్రమానికి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. దీనిపై వారు స్పందిస్తూ... 'ప్రభుత్వం జగన్‌కు కానీ, తమకు కానీ ఎలాంటి ఆహ్వానాలు పంపలేదని స్పష్టం చేశారు. కనీసం మొబైల్ ఫోన్లలో సామాజిక మాధ్యమాలైన వాట్సాప్, ఫేస్‌బుక్‌ల ద్వారా కూడా ఆహ్వానం అందలేదన్నారు. ప్రభుత్వం తమకు ఆహ్వానించామని చెప్పడం విడ్డూరంగా ఉందని, ఇది చాలా సిగ్గుచేటైన విషయమన్నారు. పిలిచినా రాలేదని ప్రజల్లో భవన కలిగించేందుకే ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిలవని పేరంటానికి రావాల్సిన అవసరం తమ పార్టీకి లేదన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్షనేతకు ఛాంబర్ కేటాయింపుపై కూడా తమకెలాంటి సమాచారం ఇవ్వలేదని, దీనిపై స్పీకర్‌ను కలుస్తామని నేతలు తెలిపారు.

గన్నవరం,తిరుపతి విమానాశ్రయాల పేర్లు మార్పు

- గన్నవరానికి ఎన్టీఆర్ అమరావతి, తిరుపతికి శ్రీ వెంకటేశ్వర ఎయిర్‌పోర్టుగా మార్పు
- ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం

రాజధాని ప్రతినిధి-అమరావతి : గన్నవరం, తిరుపతి విమానాశ్రయాల పేర్లు మార్పు చేస్తూ ఏపీ మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. గన్నవరం విమానాశ్రయానికి ఎన్టీఆర్ అమరావతి, తిరుపతి విమానా శ్రయానికి శ్రీవెంకటేశ్వర ఎయిం ్పోర్టుగా నామకరణం చేస్తూ మంత్రి వర్గం తీర్మానించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో మంత్రివర్గ సామావేశం దాదాపు 5 గంటల పాటు వివిధ అంశంలపై చర్చించింది. అందులో ముఖ్యంగా ఇటీవల కృష్ణాజిల్లా ముండ్లపాడు వద్ద జరిగిన బస్సు ప్రమాదానికి సంబంధించి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నందిగామ ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ బాబు పట్ల వ్యవహరించిన తీరును మంత్రివర్గం గర్హించింది. తొలుత మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసిన మంత్రివర్గం, ప్రతిపక్ష నేత విధినర్వహణలో వున్న కలెక్టర్ పట్ల ప్రవర్తించిన తీరు, వాడిన పరుష పదజాలం తీవ్ర అభ్యంతరకరంగా వుందని వ్యాఖ్యనించింది. అధికారులతో ప్రజాప్రతినిధులు మర్యాదపుర్వకంగా వ్యవహరించాలన్న సంప్రదయాన్ని విస్మరించడాన్ని తీవ్రంగా ఖండించింది. ఆంధ్రప్రదేశ్ విత్తన చట్టం- 2017కు చట్టబద్ధత కల్పించే అంశంపై మండలిలో చర్చ జరిగింది. 2012లో చైర్మన్ వి.నాగిరెడ్డితోపాటు ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీ రైతు సంఘాలు, విత్తన ఉత్పత్తి సంఘాలు, విత్తన సంస్థలతో విస్తృతచర్చలు జరిపి చేసిన సిఫార్సులకు అనుగుణంగా ఈ బిల్లును రూపొందించాలని విత్తన చట్టాన్ని శాసనసభలో ప్రవేశపెట్టబోయే ముందు మరోసారి ఆయా రంగా ప్రముఖులతో చర్చించాలని నిర్ణయించారు. గతంలో 1966 విత్తన చట్టం స్థానంలో ఇది రానున్నట్లు మంత్రి పల్లె రఘునాథరెడ్డి విలేకరుల సామావేశంలో తెలిపారు. ఈ చట్టం ద్వారా నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా విత్తనాలు సరఫరా చేసేవారిపై రూ.50 నుండి రూ.2 లక్షల వరకు జరిమానా, 3 మాసాల కారాగార శిక్ష విధించే అవకాశం ఏర్పడుతుం దన్నారు. 2015లో రాష్ట్ర ఉభయ సభల్లో ఆమోదం పొందిన డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్సియల్ ఎస్టాబ్లిష్మెంట్స్ బిల్లులో సవరణలు తెస్తూ ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు పల్లె వెల్లడించారు. దీనివల్ల డిపాజిటర్ల సొమ్ముకు, హక్కులకు మరింత రక్షణ కలుగుతుందని, ఎగవేతదారుల ఆస్తులను వేగంగా జప్తు చేసి, అస్తులు విక్రయించే అవకాశం ఏర్పడుతుం దన్నారు. ఇకపై ఆర్థిక లావాదేవీలు జరిపే సంస్థలు క్రమం తప్పకుండా ఆర్థిక నివేదికలను, రిటర్నులను అందించాల్సి ఉంటుందన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు కోసం ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రివర్గం తీర్మానించిందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవసాయ, మార్కెటింగ్, రైతు సాధికార సంస్థలకు చెందిన రూ. 125.40 కోట్లను మార్క్‌ఫెడ్‌కు రావాల్సిన ఎరువుల బకాయిల నిమిత్తం సర్దు బాటు చేయనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లాజిస్టిక్స్ యూనివర్శిటీ డ్రాఫ్ట్ బిల్లు 2017కి మంత్రిమండలి ఆమోదం తెలిపిందని మంత్రి పల్లె చెప్పారు.

ఆన్‌లైన్ రైలు టికెట్లకు ఆధార్ తప్పనిసరి

న్యూఢిల్లీ : ఆన్‌లైన్‌లో రైలు టికెట్ల మోసపూరిత బుకింగ్‌లు, పెద్ద సంఖ్యలో బ్లాక్ చేసే చర్యలను నిరోధించేందుకు ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ టికెట్ వ్యవస్థను రైల్వే శాఖ త్వరలో తీసుకురానున్నది. ఏప్రిల్ ఒకటి నుంచి రైలు టికెట్లలో రాయితీ పొందేందుకు సీనియర్ సిటిజన్లకు ఆధార్ సంఖ్య తప్పనిసరి దీనిని మూడు నెలలపాటు ప్రయోగాత్మకంగా పరిశీలించనున్నారు. రైల్వే మంత్రి సురేష్ ప్రభు 1,000 ఆటోమెటిక్ వెండింగ్ మెషిన్లు, 6 వేల సేల్ పాయింట్ మెషిన్లు ఏర్పాటు ద్వారా నగదు రహిత టికెట్ వ్యవస్థ దిశగా రైల్వేలు ముందుకు వెళుతున్నాయి. దీంతోపాటు ఆధార్ ఆధారిత టికెట్ వ్యవస్థను త్వరలో ప్రవేశపెడుతున్నట్లు వివరించారు. నగదు రహిత లావాదేవీల ప్రోత్సాహానికి మే నెల నుంచి సమగ్ర టికెట్ యాప్‌ను ప్రారంభించనున్నట్లు చెప్పారు. 'ఐఆర్‌సీటీసీ టికెటింగ్ వెబ్‌సైట్‌లో వన్‌టైమ్ రిజిస్ట్రేషన్‌కు ఆధార్ సంఖ్య తప్పనిసరి కానుంది. నకిలీ ధ్రువీకరణల నమోదును నిరోధించే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టాం' అని రైల్వే మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఇందుకోసం రైల్వేలు ఒక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేస్తున్నాయన్నారు. అనేక చర్యలు తీసుకున్నప్పటికీ, టికెట్ల పెద్ద సంఖ్యలో బుక్ చేసిన అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. రైల్వేలకు ఇది తీవ్ర సమస్యగా మారింది. హిల్ స్టేషన్లకు నూతన పర్యాటక రైళ్లను అనుసంధానించేలా కొత్త వ్యాపార ప్రణాళికను కూడా అమల్లోకి తీసుకురానున్నారు. అలాగే కేటరింగ్ సేవలు, సదుపాయాల మెరుగు ద్వారా ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని కలిగించేందుకు చర్యలు చేపడుతున్నారు.

రుచి మారేనా!?

కొత్త కేటరింగ్ విధానంతోనైనా

- ఐఆర్‌సీటీసీకి ప్యాంట్రీ కార్ల నిర్వహణ
- పరిశుభ్రమైన వాతావరణంలో తయారీ
- రైల్వేస్టేషన్లలోని బేస్ కిచెన్లలో వంటకాలు

రాజధాని ప్రతినిధి- విజయవాడ : రైలు ప్రయాణీకులకు తీయని కబురు, ఇన్నాళ్లు రుచి, పచీలేకుండా, అపరిశుభ్రవాతావరణంలో తయారు చేసిన ఆహారాన్నే ఎంత ఖరీదైనా సరే వేరే గత్యంతరం లేని పరిస్థితుల్లో తినవలసి వచ్చేది. సాంకేతికత పెరగడంతో మొబైల్‌ఫోన్ల నుంచి ఆహారపదార్థాల నాణ్యత, రుచి ధరలపై కుప్పతెప్పలుగా ఫిర్యాదులు వెల్లువెత్తడంతో రైల్వేశాఖ కేటరింగ్ విధానంలో సమూల మార్పులకు శ్రీకారం చట్టింది. ఇటీవల ఆశాఖమంత్రి సురేష్ ప్రభాకర్ ప్రభుకొత్త కేటరింగ్ విధానాన్ని ప్రకటించారు. ఇకనుంచి రైళ్లు, రైల్వేస్టేషన్లలో ఆహారం ఆహారాన్ని సరఫరా చేసే పూర్తి బాధ్యతను ఇండియన్ రైల్వే కేటరింగ్, టూరిజం కార్పోరేషన్ (ఐఆర్‌సీటీసీ)కి అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. రైల్వేశాఖ తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రైవేటు కేటరింగ్ కాంట్రాక్టర్ల దోపిడీకి అడ్డుకట్ట పడనుంది. ఇదే సమయంలో ఆయా ప్రాంతాలకు సంబంధించిన సంప్రదాయ వంటకాల తయారీకి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. దీంతో ఏ రాష్ట్రానికి చెందిన ప్రయాణీకులకు వారి ప్రాంతంలో లభ్యమయ్యే రుచిలోనే ఆహార పదార్థాలను పరిశుభ్ర వాతావరణంలో తయారుచేసి అందచేయనున్నారు. కొత్త విధానం ప్రకారం అన్ని మొబైల్ యూనిట్లలో క్యాటరింగ్ సేవల బాధ్యతలను ఐఆర్‌సీటీ సీయే నిర్వహించనుంది. అలాగే జోనల్ రైల్వేల్లో ఇప్పటి వరకూ వివిధ వర్గాలకు కేటాయించిన ప్యాంట్రీకార్ కాంట్రాక్టులను ఇకపై ఐఆర్‌సీటీసీకి అప్పగిస్తారు. ఈ కార్పోరేషన్‌కు ఉన్న వంటశాల నుంచి ఆహారాన్ని మొబైల్ యూనిట్లకు తరలిస్తారు. ప్రయాణీకుల నుంచి వచ్చే డిమాండ్‌ను బట్టి కొత్త వంటశాలలను ఏర్పాటు చేస్తారు. జోనల్ రైల్వేల నిర్వహణలో ఉన్న నాలుగు ప్రధాన వంటశాలలు, ఏ1,ఏ కేటగిరి స్టేషన్లలో ఉన్న రిఫ్రెష్‌మెంట్ రూమ్‌లు, జన్‌ఆహార్,సెల్ కిచెన్‌ల నిర్వహణ కూడా ఈ సంస్థే పర్యవేక్షిస్తుంది. ఇతర రైల్వేస్టేషన్లలో కొత్త వంటశాలలను ఏర్పాటు చేయనుంది. ప్రామాణిక ఆహార మెనూను కూడా ఈ సంస్థే నిర్ధారిస్తుంది. 'రైల్వేబోర్డు నిర్ణయించిన ధరల ప్రకారం ఆహారాన్ని విక్రయిస్తుంది. కేటరింగ్ సంబంధిత సేవల్లో స్వయంసహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) సేవలను కూడా వినియోగించుకోనున్నారు. రైల్వేస్టేషన్లలో పాలు పాల పదార్థాలను విక్రయించే కేంద్రాలను బహిరంగ టెండర్ల ద్వారా కేటాయిస్తారు.

ప్రైవేటు క్యాటరర్స్‌దే రాజ్యం

రైల్వేస్టేషన్లతోపాటు పలు రైళ్లలోని ప్యాంట్రీకార్ల కాంట్రాక్టులను ముఖ్యంగా ఢిల్లీ, కోల్‌కత, తిరువనంతపురం, కొచ్చి తదితర ప్రాంతాలకు చెందిన వారే చేజిక్కించుకునే వారు. కాంట్రాక్టర్లు నియమించుకునే వంటవాళ్లు వారి ప్రాంతాలకు చెందినవారే కావడంతో ఎవరికి తోచిన విధంగా వంటకాలను తయారుచేసేవారు. ఉదాహరణకు విజయవాడ కేంద్రంగా నడిచే ఇంటర్‌సి

ఒంటికి చలువ చేసే... ఖర్బూజా జ్యూస్!

వేసవి సీజన్ ప్రారంభమైంది. ఎండలు పెరిగేకొద్దీ జనం ఫ్రూట్ జ్యూస్, మిల్క్‌షేక్‌ల వైపు దృష్టి సారిస్తారు. ఇది అవసరం కూడా. అయితే బయట దొరికే వాటిపై ఆధారపడకుండా సాధ్యమైనంతవరకూ ఇంట్లోనే తయారు చేసుకోవడం ఉత్తమం. ఏ జ్యూస్ అయినా తాజా జ్యూస్ అయినా తాజాగా తీసుకోండి.

ఎక్కువగా ఫ్రూట్ జ్యూస్‌లు ఇష్టపడేవారు మీ జాబితాలో ఖర్బూజాను చేర్చుకోండి. ఇది వేసవి వేడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది. దాహం తీరుస్తుంది. ఖర్బూజా జ్యూస్‌లో కొంచెం నిమ్మరసం కూడా కలుపుకుని తాగితే రుచికి రుచి. ఆరోగ్యానికి ఆరోగ్యం చేకూరతాయి. ఈ జ్యూస్ జీర్ణశక్తిని పెంచుతుంది. తిన్నది అరగకపోతే చాలా అసౌకర్యంగా ఉంటుంది. ఒక్కోసారి తీవ్రమైన నొప్పికీ కారణమవుతుంది. ఈ సమస్యకు మందులతో కాకుండా సహజమైన రీతిలో తొలగించాలనుకున్నప్పుడు ఈ ఖర్బూజా జ్యూస్‌ని తీసుకోండి. జీర్ణక్రియ సాఫీగా జరగడానికి దీన్ని మించిన గృహ చిట్కా ఇంకొకటి లేదు. మరి ఇన్ని ప్రయోజనాలు అందించే ఖర్బూజా జ్యూస్‌ను ఈ వేసవిలో ఎక్కువగా తీసుకోండి. మీ ఆరోగ్యాన్ని కాపాడుకోండి. గ్లాస్ తాజా ఖర్బూజా జ్యూస్‌లో రెండు టేబుల్ స్పూన్‌ల నిమ్మరసం కలిపి తీసుకోండి. భోజనం తర్వాత రోజూ క్రమం తప్పకుండా మూడు నెలల పాటు ఈ జ్యూస్ తీసుకుంటే ఆరోగ్యంలో మంచి మార్పు కనిపిస్తుంది. వేసవి ప్రారంభమైందిగా....ఇక నూనె, మసాలా ఎక్కువగా ఉండే ఆహారపదార్థాలకు దూరంగా ఉండండి. ఖర్బూజాలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సీ....పొట్టలో అజీర్ణానికి కారణమయ్యే అదనపు ఆమ్లాలను నివారిస్తాయి. ఖర్బూజా సహజంగానే శరీరానికి చల్లదనాన్ని అందిస్తుంది. నిమ్మరసంలో ఉండే విటమిన్ సీ, ఇతర పదార్థాలు ఎసిడిటీని తగ్గిస్తాయి.

వేంకన్న ఆలయంలో పందిరి రాట మహోత్సవం

రా.వా. ప్రతినిధి, అమలాపురం -ఏ.తేజ : అమలాపురం పట్టణం మహిపాల వీధిలో వేంచేసియున్న భూ సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో జరుగు వార్షిక కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని మార్చి 1వ తేది పందిరి రాట మహోత్సవంను వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కర్రి రామస్వామి(దత్తుడు) మాట్లాడుతూ ఏప్రిల్ 6న శ్రీవేంకటేశ్వరస్వామివారి కళ్యాణ, 7న రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ పందిరి రాట మహోత్సవ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వివివిఎస్ఎన్.మూర్తి, ధర్మకర్తల మండలి సభ్యులు తోట విశ్వేశ్వరరావు, బసవా సింహాద్రి, సంగినీడి గణేష్, ఆచంట మూలాస్వామి, కర్రి వీరరాఘవులు, పేరూరి విజయలక్ష్మి, కర్రి పద్మనాభనాయుడు, కర్రి విష్ణువర్ధనరావు, తిక్కిరెడ్డి నేతాజీ, తోరం రాము, అబ్బిరెడ్డి నరసింహారావు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా 81వ త్రిమూర్తి శివజయంతి ఉత్సవాలు

రా.వా. ప్రతినిధి, అమలాపురం -ఏ.తేజ : ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఓంశాంతి కేంద్రం అమలాపురం ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాటుచేసిన అమరనాథ్ సెట్టింగ్‌కు భక్తుల తాకిడి పెరిగింది. మహాశివరాత్రి రోజు బ్రహ్మకుమారీలచే అమలాపురం పురవీధుల్లో వేలాది మంది బ్రహ్మకుమారీలు శాంతి ర్యాలీ నిర్వహించారు. శాంతి స్థాపనే ధ్యేయంగా అందరికీ మానసిక ప్రశాంతత చేకూరే లక్ష్యంగా ఓంశాంతి కేంద్రం చేపట్టిన ఈ ర్యాలీ పలువురిని ఆకట్టుకుంది. అమలాపురం ఓంశాంతి కేంద్రం ఇన్‌ఛార్జి బీకే శ్రీదేవి నేతృత్వంలో 81వ త్రిమూర్తి శివజయంతి మహోత్సవాలను ఈ సందర్భంగా ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక మాచిరాజువీధిలోని తటవర్తి వారి స్థలంలో ఏర్పాటైన అమరనాథ్ శివలింగం సాక్షిగా బ్రహ్మకుమారీలంతా కేక్‌ను కట్ చేసి ప్రతిజ్ఞ చేశారు. శాంతి స్థాపన కోసం బ్రహ్మకుమారీలంతా కాసేపు యోగసాధన చేసిన అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేసారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి స్వరూప, బీకే రాజ్‌కుమార్, బీకే సూరపరాజు, బీకే వెంకటేశ్వరరావు, బీకే ఆదినారాయణ, బీకే నార్ని శ్రీనివాస్‌లతో పాటు బ్రహ్మకుమారి, బ్రహ్మకుమారులు పాల్గొని వచ్చిన భక్తులకు సేవలందించారు.

రిజర్వేషన్ల హామీకి చంద్రబాబు కట్టుబడి ఉండాలి : ముద్రగడ

కొత్తపేట ప్రతినిధి : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో కాపులకు ఇచ్చిన రిజర్వేషన్ హామీకి కట్టుబడి ఉండాలని మజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అన్నారు. కాపు నాయకుడు పాలూరి సత్యానందం స్వగృహంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ ఆరు నెలల గడువుతో కాపుల కోసం మంజునాథ్ కమీషన్ వేశామని చెప్పి చంద్రబాబు సంవత్సరం దాటినా కమిషన్ నివేదికను తెప్పించలేకపోయారన్నారు. కాపులకు రిజర్వేషన్లు కల్పించే వరకు ఈ పోరాటాన్ని ఆపే ప్రశక్తే లేదన్నారు. ఈ నెల 26వ తేదిన కాకినాడలో కాపు సామాజిక వర్గానికి చెందిన లీగల్ సెల్ ప్రతినిధులతో సమావేశంలో ఏర్పాటుచేశామన్నారు. త్వరలో ఉద్యమ కార్యచరణను ప్రకటిస్తానన్నారు. ఈ సమావేశంలో కాపు నాయకులు ఆకుల రామకృష్ణ, చీకట్ల ప్రసాద్, పెదపూడి బాపిరాజు, సలాది బ్రహ్మాజీరావు, సలాది చిన్నా, ముద్రగడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి టెన్త్ పరీక్షలు

జిల్లాలో 181 కేంద్రాలు-ఏర్పాట్లు పూర్తి

రాజధాని ప్రతినిధి విజయవాడ : ఈ నెల 17న ప్రారంభంకానున్న టెన్త్ పరీక్షలకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేశామని పాఠశాల విద్యా కమిషనరు కె.సంధ్యారాణికి కలెక్టరు బాబు తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లు, విద్యా శాఖాధికారులతో పాఠశాల విద్యా కమిషనరు వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టరు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 181 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొత్తం 58,008 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావల్సి ఉందని తెలిపారు. వారిలో 56,249 మంది రెగ్యులర్, 1,759 మంది ప్రైవేటు విద్యార్థులు వున్నారన్నారు. పరీక్షల నిర్వహణను పరిశీలించేందుకుగాను ఏడుగురు అడిషనల్ డిపార్టుమెంటు ఆఫీసర్లను నియమించామని చెప్పారు. పరీక్షా పత్రాలు, సామాగ్రిని తరలించేందుకు 22 రూట్లను గుర్తించి 44 మంది రూట్ ఆఫీసర్లు, అదనపు రూట్ ఆఫీసర్లను నియమించామని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాలను భద్రపరిచేందుకు 61 పోలీసుస్టేషన్‌లో స్ట్రాంగ్ రూంలను గుర్తించామని పేర్కొన్నారు. 2,950 మంది ఇన్విజిలేటర్లను నియమించామని, 14 ఫ్లయింగ్ స్క్వాడ్లతో పరీక్షా ప్రక్రియ పర్యవేక్షణకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. పరీక్షల నిర్వహణపై ఈ నెల 7వ తేదీన జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేస్తామని సంధ్యారాణికి కలెక్టరు బాబు వివరించారు. వీడియో కాన్ఫరెన్సులో జిల్లా విద్యాశాఖాధికారి ఎ.సుబ్బా రెడ్డి, ఆర్టీసీ రీజనల్ మేనేజరు పీవీ రామారావు, డైట్ ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు రవికుమార్, దుర్గా ప్రసాద్, కోటేశ్వరరావు, రవీంద్ర, జయబాబు, కుమార్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వేసవికి సిద్ధమయ్యారా!

ఆరోగ్యం

ఎండాకాలం మొదలైంది. ఎండలు పెరుగుతున్నాయి. ఈ కాలంలో మనిషిని ఎక్కువ ఇబ్బంది పెట్టేది. చెమట. శరీరంలో లవణాన్నీ చెమట రూపంలో బయటకు వస్తాయి. ఫలితంగా నీరసం ఆవహిస్తుంది. సీజన్ ప్రారంభం నుంచే తగిన జాగ్రత్తలు తీసుకుంటే నడి వేసవి వచ్చేటప్పటికి ఆ ఎండలను తట్టుకునేందుకు శరీరమూ సిద్ధమవుతుంది. అప్పటికప్పుడు ఏదో చేద్దాంలే అనుకుంటే ఫలితం శూన్యమే. అనారోగ్యం తప్పదు. ఎండాకాలం జాగ్రత్తలను ఇప్పటినుంచే ప్రారంభించండి.

నీరసం రాకుండా ఎక్కువ ద్రవ పదార్థాలు, మంచినీళ్ళు తీసుకోండి. చెమట రూపంలో శరీరం కోల్పోయే లవణాలు భర్తీ చేసే స్థాయిలో ఇవి ఉండాలి. వీటి మోతాదు క్రమంగా పెంచుకుంటూ వెళ్ళాలి. ఎండలు పెరిగేకొద్దీ నిస్సత్తువ ఆవహిస్తూంటుంది. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే తీసుకునే ద్రవ పదార్థాల్లో కొంచెం ఉప్పు వేసుకుని తీసుకోవాలి. కర్బూజా, పుచ్చ లాంటి నీరు ఎక్కువగా ఉండే వేసవి ఫలాలను ఆరగించాలి. సాధ్యమైనంత వరకు ఇంట్లో తయారుచేసుకున్న జ్యూస్‌లకే ప్రాధాన్యతనివ్వాలి. ఆ జ్యూస్‌లో కూడా కొంచెం ఉప్పు, మిరియాల పొడి లైట్‌గా వేసుకుని తీసుకుంటే మంచి ఆరోగ్య చేకూరుతుంది. ఎండాకాలంలో మనకు ఎక్కువ తీసుకోవాల్సినవి సగ్గుబియ్యం జావ, అన్నం వార్చిన గంజి, పల్చటి మజ్జిగ లాంటివి కూడా చాలా బాగా పనిచేస్తాయి. వడగాల్పుల నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. చిన్న పిల్లలు ఉన్న ఇళ్ళల్లో ఈ జాగ్రత్తలు ఇంకాస్త ఎక్కువగా తీసుకోవాలి. పెద్దవాళ్ళు దాహం వేస్తే నీళ్ళు తాగుతారు. పిల్లలకు చెప్పలేరు. వారంతట వారు తాగలేరు. పిల్లలందరికీ ముఖ్యంగా ఐదేళ్ళలోపు పిల్లలు అందరికి ప్రతి రెండు, మూడు గంటలకు ఒక సారి ఏదో ఒక ద్రవపదార్థం ఇస్తూ ఉండాలి. పచ్చటి మజ్జిగ, పల్చటి గంజి లాంటివి కూడా ఇవ్వాలి. పుచ్చ, కర్బూజ లాంటి ఫలాలను పిల్లలకూ ఇవ్వాలి. నూనె పదార్థాల జోలికి వెళ్ళకపోవడమే ఉత్తమం. అబ్బో అస్సలు ఉండలేం అనుకునేవాళ్ళు వీటిని ఎంత తక్కువగా వాడితే అంత మంచిది. పెద్దలైనా, పిల్లలైనా అల్పాహారంగా ఆవిరి మీద ఉడికించిన ఇడ్లీలాంటి ఆహారం తీసుకోవడమే ఉత్తమం. పిల్లలకు ఏ మాత్రం అనారోగ్యం కలిగినా అశ్రద్ధ చేయకూడదు. వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. సీజన్ మారే సమయంలో ఈ వాతావరణాన్ని తట్టుకోలేని పిల్లలకు సహజంగానే అనారోగ్యాలు కనిపిస్తుంటాయి. అలాగని బెంబేలెత్తిపోకుండా ఈ సీజన్‌లో తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకుంటే సగం రోగం తగ్గిపోతుంది. వీలైనంతవరకూ కాటన్ దుస్తులనే వేసుకోవాలి. ఇవికూడా వదులుగా ఉండేలా చూసుకోవాలి. లేత రంగు దుస్తుల్నే ఎంచుకోవడం అత్యుత్తమం. వీటివల్ల ఎండాకాలంలో సహజంగా వచ్చే దద్దుర్లు, నీటిపొక్కులు లాంటివి మూడు వంతులు తగ్గిపోతాయి. పిల్లలకు స్నానం చేయించిన వెంటనే ప్రిక్లీ హీట్ పౌడర్ లాంటివి వేయాలి. శరీరంపైన తడి లేకుండా చూసుకోవాలి. వేసవిలో చిన్నారులు ఏ చిన్న అసౌకర్యం కలిగినా తట్టుకోలేరు. పసి పిల్లలను పడుకోబెట్టే బెడ్‌పై పక్కలు మెత్తగా ఉండేలా చూసుకోవాలి. పక్క సరిగ్గా లేకపోతే అసౌకర్యానికి గురవుతారు. పిల్లలకు ఇచ్చే ఆహారమూ తేలిగ్గా అరిగిపోయేలా ఉండాలి. కొవ్వు పదార్థాలు, మాంసకృత్తులు ఆహారంలో ఉంటే త్వరగా జీర్ణం కావు. ఆహారాన్ని మెత్తగా చేసి తినిపించాలి. అన్నింటికంటే ఎక్కువగా పచ్చని మజ్జిగ ఇస్తూ ఉండాలి. ఉదయం, సాయంత్రం వేళ పచ్చని ప్రకృతిలో, ఆరుబయట గడపండి. ఇంట్లోకి మంచి గాలి, వెలుతురు వచ్చేలా చూడండి. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే పసిపిల్లల నుంచి పండు ముదుసలుల వరకూ వేసవికాలం ఇబ్బందుల నుంచి తేలిగ్గా బయటపడవచ్చు. వేసవి తాపం నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోవచ్చు.

వైభవంగా మల్లేశ్వరస్వామి మహోత్సవాలు..

శివనామ స్మరణతో మారుమ్రోగిన శైవాలయాలు

రా.వా. ప్రతినిధి, కోనసీమ -జిఎన్.రావ్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అమలాపురంలో ప్రసిద్ధ శైవక్షేత్రమైన శ్రీచెన్న మల్లేశ్వరస్వామి వారి ఆలయం భక్తజనసందోహంతో పోటెత్తింది. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో వున్న ఈ ఆలయాన్ని పాంచాల పురాధీశ్వరుడైన ధృపధ మహారాజు హయాంలో చెన్నుడు అనే మహాముని ప్రతిష్టించినట్లు పురాణగాథ. మల్లేశ్వరస్వామిని చెన్నుడు ప్రతిష్ఠించిన కారణంగా చెన్నమల్లేశ్వరుడు అయ్యాడని ప్రతీతి. కేవలం ప్రదక్షిణ నమస్కారాలకే ప్రసన్నుడయ్యే చెన్నమల్లేశ్వరుడుగా ఈ స్వామికి పేరు. అందుచేత శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామిచుట్టూ ప్రదక్షిణలు చేసేందుకు భక్తులు బారులుతీరారు. రోజునే కాకుండా ప్రతీ సోమవారం స్వామిని ప్రదక్షిణలతో భక్తులు నమస్కరిస్తుంటారు. తెల్లవారు జామున 3 గంటల నుండే ఆలయం వద్ద భక్తుల తాకిడి ఎక్కువైంది. మహాశివరాత్రి సందర్భంగా ఆలయం వద్ద అభివృద్ధి కమిటీ నేతృత్వంలో భక్తులకు సకల ఏర్పాట్లను చేశారు. తెల్లవారు జాము నుండే ఆలయంలో స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకముతో పాటు మహాన్యాసపూర్వక పంచామృత అభిషేకాలు జరిగాయి. సాయంత్రం ద్వాదశ జ్యోతిర్లింగార్చన కార్యక్రమంలో పాల్గొని భక్తులు దీపారాధనలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ముచ్చర్ల రెడ్డినాయుడు, అభివృద్ధి కమిటీ సభ్యులు తోట శ్రీను, నల్లా శ్రీధర్‌లతో పాటు గంధం శ్రీను, పిండి రాజా, రేకపల్లి వరప్రసాద్, దున్నాల బాబి తదితరులు భక్తులకు సేవలందించారు. ఈ ఆలయం చెంతనే వున్న చెన్నకేశవస్వామిని కూడా భక్తులు దర్శించడం ఆనవాయితీ అయినందున ఆ ఆలయంలో కూడా చైర్మన్ నల్లా చిట్టిబాబు నేతృత్వంలో ఏర్పాట్లు సిద్ధం చేసారు. స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

అలాగే ఎన్‌టిఆర్ మార్గ్‌లోని శ్రీఉమా నాగలింగేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామి వారికి తెల్లవారు జాము నుండే ఏకాదశ రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. లింగోద్భవ సమయంలో స్వామికి అన్నాభిషేకం చేస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక శేషగిరిరావు తెలిపారు. సినిమా రోడ్‌లోని శ్రీసిద్దేశ్వరస్వామి ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణలతో పందిళ్ళు వేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శ్రీశైలం తరువాత అమలాపురంలో వున్న సిద్దేశ్వరస్వామి ఆలయంలోనే స్వామి స్పర్శ దర్శనం ఉన్నందున భక్తులు శివరాత్రి రోజున పోటెత్తారు. ఈ సందర్భంగా సినిమా రోడ్డులోని ఆలయం వద్ద భారీ కేడ్‌లను క్యూలైన్‌లను ఏర్పాటుచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు సిద్ధం చేసింది. రవణం వీధిలోని శ్రీసర్వ మంగళ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని స్వామికి విశేష పూజలతో పాటు పంచా మృతాభిషేకాలు వైభవంగా జరిగాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మాచిరాజు రవికుమార్ తెలిపారు.

అమలాపురంలో శ్రీచెన్నమల్లేశ్వరస్వామి

మానసిక ప్రశాంతతకు 'ఓంశాతి' ఒక వేదిక

హోంమంత్రి రాజప్ప

రా.వా. ప్రతినిధి, కోనసీమ -జిఎన్.రావ్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విద్యాలయం (ఓంశాంతి కేంద్రం) అమలాపురం ఆధ్వర్యంలో శివరాత్రి ఉత్సవాలను ప్రతీ సంవత్సరం వినూత్న తరహాలో ఈ ఏడాది కూడా అమలాపురంలో అమర్‌నాథ్ దివ్యదర్శనం సెట్టింగ్‌ను చేశారు. దీనికి అమలాపురంలోని మాచిరాజువీధి, తటవర్తి వారి స్థలం వేదికగా నిలిచింది. ఈ నెల 21వ తేదీ నుండి ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్పతో పాటు మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు, మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మెట్ల రమణబాబు, అల్లవరం మార్కెట్ కమిటీ చైర్మన్ గునిశెట్టి చినబాబు, కొమరగిరిపట్నం నీటి సంఘం అధ్యక్షులు దాట్ల గోపీరాజు తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా రెండవ రోజు ఉత్సవాలను చినరాజప్ప జ్యోతిప్రజ్వలనచేసి ప్రారంభించారు. అనంతరం రాజప్ప మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా కైలాసాన్ని తలపించే అమర్‌నాథ్ సెట్టింగ్‌ను దర్శించడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ప్రస్తుత సమాజంలో ఎన్నో ఒత్తిళ్ళను ఓర్చి జీవితాన్ని సాగిస్తున్న ప్రస్తుత తరుణంలో ఒత్తిడిని తగ్గించుకోవాలంటే ధ్యానశిక్షణ అవసరమని, దీనికి ఓంశాంతి కేంద్రం ఒక వేదిక అని అభిప్రాయపడ్డారు. ఇందులో నేను కూడా ఒక సభ్యుడినని, ఇంత ప్రశాంతంగా నేను జీవించగలుగుతున్నానంటే శివపరమాత్మే కారణమన్నారు. మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ ఓంశాంతి కేంద్రం సేవలో తాము పాలుపంచుకునే అవకాశం వచ్చిందని, దీనికి గత ప్రభుత్వ హయాంలో ఈ సంస్థ పేరిట నామమాత్రపు ధరకు కేబినెట్‌లో ఆమోదించి స్థలాన్ని సమకూర్చామని, ఇందులో ప్రస్తుతం ప్రశాంత నిలయాన్ని నిర్మించతలపెట్టడం వల్ల అమలాపురం ప్రజలకు త్వరలో ఒత్తిడిని జయించే ఒక ప్రశాంత కేంద్రం రానుందని వివరించారు. అనంతరం ఓంశాంతి కేంద్రం ఇన్‌ఛార్జి బీకే శ్రీదేవి మాట్లాడుతూ ఒత్తిడిని జయించేందుకు మానసిక ప్రశాంతతను అందరికీ అందించేందుకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఓంశాంతి కేంద్రం ప్రజలందరికీ మానసిక ప్రశాంతత చేకూరేలా మహాశివరాత్రి రోజు అమర్‌నాథ్ దివ్యదర్శనంతో పాటు '108 శివలింగాల దర్శనభాగ్యం', అదృశ్య హస్తాలతో శివునికి పాలాభిషేకం', ఆధ్యాత్మిక చిత్రప్రదర్శన వంటివి ఏర్పాటుచేసినట్లు ఓంశాంతి కేంద్రం ఇన్‌ఛార్జి బికె శ్రీదేవి తెలిపారు.

సైకిల్ జోరు

6 ఎమ్మెల్సీ స్థానాలు ఏకగ్రీవం-మూడింటిలో పోటీ

రాజధాని ప్రతినిధి- అమరావతి : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార్టీదే పైచేయి అయింది. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల కోటాలో మొత్తం 9 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు దీంతో ఆరు స్థానాలకు టీడీపీ ఆభ్యర్థులు తప్ప మిగిలిన వారంతా విత్‌డ్రా చేసుకోవడంతో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. కొన్ని స్థానాల్లో తెలుగుదేశం పార్టీకి తిరుగులేని మెజార్టీ వుండగా, మరికొన్ని స్థానాల్లో అధికారపార్టీ నేతలు తమ అధికారంతో నయానా, భయనా అస్త్రాలు ఉపయోగించి నామినేషన్ల ఉపసంహరింపజేసినట్లు తెలుస్తోంది. శ్రీకాకుళం జిల్లా నుండి శుత్రుచర్ల విజయరామరాజు, తూర్పుగోదావరి జిల్లా నుండి చిక్కాల రామచంద్రరావు, పశ్చిమగోదావరి జిల్లా నుండి మంతెన సత్యనారాయణ అంగర రామమోహనరావు, చిత్తూరు నుండి రాజసింహులు (దొరబాబు), అనంతపురం జిల్లా నుండి దీపక్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాల స్థానిక సంస్థలకు మాత్రం పోటీ కొనసాగుతుంది. వీటిలో కూడా కడప మినహా కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో టీడీపీ అభ్యర్థులే గెలిచే అవకాశం ఉందని అధికారపార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తుండగా, ఈ మూడు స్థానాల్లో విజయం మాదేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్నారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహనరెడ్డి సొంత జిల్లా అయిన కడపలో తన సొంత బాబాయి వైఎస్ వివేకానందరెడ్డి పోటీచేస్తుండగా, టీడీపీ అభ్యర్థిగా బీటెక్ రవి ఆయనతో తలపడుతున్నారు. ఈఎన్నికను అధికారపార్టీ ప్రతిష్టాత్మకం తీసుకుంది. కడపలో ఓడిస్తే ప్రతిపక్షపార్టీని నైతికంగా దెబ్బతీసినట్లవుతుందని, దాంతో ఆపార్టీ క్యాడర్‌కూడా మానస్థిక స్థైర్యం కోల్పోయి పార్టీ మరింత బలహీనపడుతుందని టీడీపీ అధినేతలు వ్యూహారచన చేస్తున్నారు. కర్నూలులో సిట్టింగ్ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి టీడీపీ అభ్యర్థిగా మళ్ళీ పోటీచేస్తుండగా, వైఎస్సార్ అభ్యర్థిగా గౌరు వెంకటరెడ్డి రంగంలో ఉన్నారు. నెల్లూరు టీడీపీ అభ్యర్థి వాకాటి నారాయణ రెడ్డికి వైసీపీ నుండి గట్టిపోటీనే నెలకొంది. ఇక మిగిలిన మూడు ఎమ్మెల్సీ స్థానాలను ఎట్టిపరిస్థితుల్లో చేజార్చుకోరాదన్న లక్ష్యంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది. కడపతోపాటు రాయలసీమలో వైసీపీకి తిరుగులేదని మరోసారి నిరూపించాలన్న కసితో పార్టీ క్యాడర్ ఆ ముగ్గుర్ని గెలిపించుకునేందుకు తీవ్రంగా కృషి చేస్తోంది.

క్షిపణి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ : నావికాదళం విజయవంతంగా క్షిపణిని పరీక్షించింది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన జలాంతర్గామి కల్వరీ క్లాస్ నుంచి ఈ పరీక్ష నిర్వహించింది. ఉపరితల సామర్థ్యంతో నావికాదళం చేసిన ప్రతిష్ఠాత్మకమైన ఈ పరీక్ష మైలురాయి వంటిదని దక్షిణ మంత్రిత్వశాఖ ప్రకటించింది. జలాంతర్గాముల నుంచి ప్రయోగించాల్సి ఆరు స్కోరిన్ సీరిస్‌ల్లో ఈ క్షిపణి మొదటిది. అరేబియా సముద్రంలో జరిగిన ఈ పరీక్షలో ఉపరితల లక్ష్యాన్ని విజయవంతంగా చేరుకోగలిగిందని రక్షణ మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ముంబైలోని మగజోన్ డాక్ లిమిటెడ్ కంపెనీ ప్రాజెక్టు-75 కింద ఈ యుద్ధనౌకలు నిర్మితమవుతాయని ఆ వర్గాలు చెప్పాయి. దాడుల సమయంలో యాంటిషిప్ క్షిపణితో ఈ డీజెల్-ఎలక్ట్రిక్ జలాంతర్గాములు నిరూపితమైన రికార్డుగా రక్షణ శాఖ అధికారులు ప్రకటించారు. సుదూర ప్రాంతంలోని ఉపరితల బెదిరింపులను నిలువరించే సామర్థ్యాన్ని కలిగివుంటాయి. వచ్చే డిసెంబర్‌లో ఈ సీరిస్‌లోని రెండో క్షిపణిని ప్రయోగిస్తారు. ఈ క్షిపణులను ఫ్రాన్స్ నావికాదళం, ఇంధనం కంపెనీ డీసీఎన్ఎస్ నిర్మించాయి. జలాంతర్గాముల నుంచి యాంటీ షిప్ క్షిపణులను కలిగివున్న కొద్ది దేశాల సరసన భారత్ కూడా చేరింది. ఒక్కొక్క జలాంతర్గామికి తొమ్మిది నెలల విరామం ఉంటుందని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి.

అమరావతిలో 'వీసాఫ్ట్' టెక్నాలజీస్ ఏర్పాటు

రాజధాని ప్రతినిధి ,(విజయవాడ) : ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతం అమరావతి పరిధిలోని మంగళగిరిలో 'వీసాఫ్ట్‌టెక్నాలజీ' సంస్థ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం అనందంగా ఉందని వీసాఫ్ట్ టెక్నాలజీస్ చైర్మన్ అండ్ సిఈఓ వీరఘంట శ్రీరామూర్తి తెలిపారు. స్థానిక హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ వీసాఫ్ట్ టెక్నాలజీస్ సంస్థను స్థాపించి 20 సంవత్సరాలు అయ్యిందని, ఆర్థిక సంస్థలకు ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ పరిష్కారాలను అందిస్తూ అంతర్జాతీయంగా 2600 మంది వినియోగ దారులకు సేవలు అందిస్తున్నదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నైపుణ్యం గల 400 మంది ప్రతిభావంతులకు ఉద్యోగాలు సృష్టించేందుకు మా సంస్థకట్టుబడి ఉందని చెప్పారు. ఈ సమావేశంలో సంస్థ అధికారి పిడుగు వేణుగోపాల్ పాల్గొన్నారు

విదేశీయులు, ముస్లింలపై వ్యతిరేకత సరికాదు

ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి గుటెరస్

ఐక్యరాజ్యసమితి : అమెరికాలో భారత ఇంజినీర్ ద్వేషపూరిత హత్య ఆరోపణల నేపథ్యంలో విదేశీయులు, ముస్లింలు (జెనోఫోబియా, ఇస్లామో ఫోబియో)లపై వ్యతిరేకత సరికాదని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటినోయో గుటెరస్ వ్యాఖ్యానించారు. 'ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి నేరాలు పెరుగుతుండటం మేము గమనిస్తున్నాం. యాంటీ- సెమిటిజం, ఇస్లామోఫోబియా, జెనోఫోబియాలను ప్రధాన కార్యదర్శి తీవ్రంగా వ్యతిరేకించారు. ముస్లింలపై దాడులను ఆయన ఖండిస్తూనే ఉన్నారు. అని ప్రధాన కార్యదర్శి ప్రత్యేక ప్రతినిధి స్టీఫన్ డుజార్రిక్ ఒక విలేకరుల సమావేశంలో తెలిపారు. కన్సాస్ నగరంలో భారత ఇంజినీర్ హత్యతో సహా దక్షిణాసియా నుంచి వచ్చిన ప్రజలపై అమెరికాలో చోటుచేసుకుంటున్న ద్వేషపూరిత నేరాలపై గుటెరస్ ఏమైనా వ్యాఖ్యానించారా ప్రశ్నించగా డుజార్రిక్ పై విధంగా సమాధానమిచ్చారు.

ఆమోదనీయం కాదు

అమెరికా చట్టసభ సభ్యుల ఆందోళన

వాషింగ్టన్ : కన్సాస్ నగరంలో అమెరికా నావికాదళ మాజీ ఉద్యోగి భారత ఇంజినీర్‌ను హత్య చేయడాన్ని అమెరికా చట్టసభ సభ్యులు తీవ్రస్థాయిలో బహిరంగంగా విమర్శించారు. దేశంలో ఇటువంటి మతిలేని హింసాత్మక చర్యలకు చోటు లేదన్నారు. కాలిఫోర్నియాలో భారత సంతతికి చెందిన డెమొక్రటిక్ సెనేటర్ కమలా హారిస్ స్పందిస్తూ.. 'ద్వేషంతో విజయం సాధించలేం. కన్సాస్‌లో చోటుచేసుకున్న విషాద ఘటన నన్నెంతో బాధించింది. బాధితులకు, వారి కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలియజేస్తున్నా' అని ట్వీట్‌లో పేర్కొన్నారు. 'కన్సాస్‌లో కాల్పుల ఘటనలో బాధితులు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించా. మన దేశంలో ఇటువంటి హింసాత్మక చర్యలకు చోటులేదు. ఈ ఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది.' అని ఇండో-అమెరికన్ కాంగ్రెస్ మహిళా సభ్యురాలు పరిమళా జయపాల్ అన్నారు. అమెరికా చట్టసభకు ఎనికైన మొట్ట మొదటి ఇండో- అమెరికన్ మహిళా సభ్యురాలు పరిమళా జయపాల్, నవంబరులో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఎనికైనా నాటి నుంచి వలస దారులకు వ్యతిరేకంగా ఆయన చేపట్టిన వివాదాస్పద పాలనపరమైన ఆలోచనల ఫలితంగానే అమెరికాలో ద్వేషపూరిత నేరాలు పెరిగాయని ఆమె వివరించారు. 'ఇది సాధారణమైన విషయం కాదు, ఇటువంటి ద్వేషపూరిత ఘటనపై పోరాడాలి. దేశం మొత్తాన్ని ద్వేషరహిత ప్రాంతంగా మేము ప్రకటించాలి. ఈ విషాదకర సమయంలో భారత అమెరికన్లు, ముస్లిం అమెరికన్లకు అండగా ఉంటా. ట్రంప్ పాలనపరమైన ప్రమాదకర ప్రకటనలు అన్ని వర్గాల ప్రజలపై ప్రభావం చూపుతున్నాయి' అని జయపాల్ పేర్కొన్నారు.

20శాతం అధిక పన్నుతో మోడల్ జీఎస్‌టీ బిల్లు

- భవిష్యత్తులో అనిశ్చితి తలెత్తకుండా నిబంధన
- ప్రతిపాదించిన జీఎస్‌టీ కౌన్సిల్

న్యూఢిల్లీ : సరకు, రవాణా పన్నులను ప్రస్తుత 14 శాతం నుంచి అత్యధికంగా 20శాతానికి పెంచేందుకు జీఎస్‌టీ కౌన్సిల్ ప్రతిపాదించింది. భవిష్యత్తులో రేటల్లో ఎటువంటి మార్పు కోసమైనా పార్లమెంటును సంప్రదించే అవసరం లేకుండా ఈ ప్రతిపాదన చేసింది. గత ఏడాది అంగీకరించిన 5,12,18,28 శాతంతో నాలుగు స్లాబ్‌లకు అత్యధిక రేటులో మార్పు ప్రత్యామ్నాయం కానప్పటికీ భవిష్యత్‌లో అనిశ్చిత తెలత్తకుండా నూతన చట్టంలో ఈ నింబంధనను చేర్చనున్నట్లు పేర్లు వెల్లడించడానికి ఇష్టపడని ఇద్దరు అధికారులు తెలిపారు. 2016 నవంబరులో బహిరంగపరిచిన మోడల్ జీఎస్‌టీ చట్టం ముసాయిదా 14 శాతంతో అత్యధిక రేటు కేంద్ర జీఎస్‌టీ 14 శాతం, అందుకు సమానమైన రాష్ట్ర జీఎస్‌టీతో మొత్తం సరఫరాలు లేదా సేవలన్నింటిపై కేంద్ర, రాష్ట్ర సరకు,సేవల పన్ను (సీజీఎస్‌టీ/ఎస్‌జీఎస్‌టీ) పేరుతో పన్ను విధించింది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఈ రేట్లు వెల్లడవుతాయి. కానీ కౌన్సిల్ సిఫార్సు చేసిన 14 శాతానికి మాత్రం మించను' అని రాష్ట్రాల ముసాయిదా చట్టం పేర్కొంది. అధికారులు మాట్లాడుతూ 'ప్రస్తుతం 14 శాతం నుంచి మార్పు చేసినప్పటికీ 20 శాతానికి మించదు. 20 శాతంగా చట్టంలో రేటు ఉండేలా అన్ని రాష్ట్రాల ప్రతినిధులతో కూడాన కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలోని భవిష్యత్తులో జీఎస్‌టీ కౌన్సిల్‌లో గానీ, పార్లమెంట్ ఆమోదంగానీ అవసరం ఉండదు' అని వారు తెలిపారు. అంటే కేంద్ర, రాష్ట్ర జీఎస్‌టీలు 40 శాతం చొప్పున, మొత్తంగా అత్యధిక రేటు 40 శాతంగా ఉంటుంది. సంప్రదింపుల తర్వాత ఒక తేదీని నిర్ణయించి ఈ నిబంధనపై కసరత్తు చేస్తామని అధికారి ఒకరు తెలిపారు. మార్చి 9 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర జీఎస్‌టీ (సీజీఎస్‌టీ) బిల్లును ప్రవేశపెట్టేందుకు కేంద్రం ప్రణాళిక రూపొందిస్తోంది. దీని ఆమోదం తర్వాత ఆయా రాష్ట్రాల చట్టసభల్లో కూడా రాష్ట్ర జీఎస్‌టీ (ఎస్‌జీఎస్‌టీ)ను ప్రవేశపెట్టనున్నారు. కాగా, జూలై 1 నుంచి జీఎస్‌టీని అమల్లోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

పెట్టుబడుల కోసం ప్రయత్నాలు ముమ్మరం

ఏపీఈడీబీ సమీక్షలో చంద్రబాబు

రాజధాని ప్రతినిధి- అమరావతి : ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులను ఆకట్టు కోవడంలో ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ) కీలకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కేవలం పరస్పర అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చు కోవడంతోనే సరిపెట్టుకుండా అవి స్థాపన జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత బోర్డుదేనని ఆయన స్పష్టం చేశారు. ఎంఓయూలు కార్యరూపం దాల్చ దానికి ఆటంకాలు లేకుండా అన్ని శాఖలతో ఈడీబీ సమన్వయం చేసుకోవాలన్నారు. ఆయా ఎంఓయూల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు దశలవారీగా వెబ్‌సైట్‌లో పొందుపరచాలని ఆయన ఆదేశించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో ఈడీబీ అధికారులతో సమావేశం నిర్వహించారు. గత ఏడాది కాలంలో బోర్డు కార్యకలాపాలు, వచ్చే ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న కార్యాచరణ ప్రణాళికపై ఆయన సమీక్షించారు. దేశంలో 'మేకిన్ ఇండియా'ను అనుసరిస్తూ రాష్ట్రంలో ఉన్న ఖనిజ సంపద, మానవ వనరులు, సుదీర్ఘ తీర ప్రాంతం, విస్తారమైన అవకాశాలను మార్కెట్ చేయాలన్నారు. వివిధ రంగాలవారీగా ప్రాజెక్టు నివేదికలను బోర్డు సిద్ధం చేయాలన్నారు. ముఖ్యంగా ఆగ్రో ఉత్పత్తులు, ఫుడ్ ప్రాసెసింగ్ తదితరలకు సంబంధించి ఒక్కో రంగానికి కనీసం 500 వరకూ సవివర ప్రణాళిక నివేదిక (డీపీఆర్)లను సిద్ధం చేయాలన్నారు. పెద్ద ఎత్తున ఉపాధి కల్పించే ప్రాజెక్టులు, గ్రోత్ ఇంజన్లకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్యరంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, ఏయే రంగాలకు భవిష్యత్ ఉంది. అనే అంశాలపై అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ. 3.66లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన మొత్తం 65 ఎంఓయూలను కుదుర్చుకున్నట్లు బోర్డు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు నెక్స్ట్ ఆర్బిట్ వెంచర్స్, గమేశా, బీఆర్ఎస్ వెంచర్స్, ఎంటీఐపీ, జీఐఐసీ వంటి ప్రముఖ సంస్థలున్నాయని వారు వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకట్టుకోవడంలో భాగంగా వచ్చే ఏడాది చైనా, అమెరికా, రష్యా, కెనడా సహా మొత్తం 12 దేశాల్లో 20 రోడ్‌షోలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ నెలలో ఢిల్లీలో జరిగే గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌కు హాజరుకావాలని అధికారులు కోరగా సీఎం అంగీకరించారు. బోర్డు కార్యకలాపాలు విజయవాడ నుంచి నిర్వహించడం ద్వారా మరింత చురుగ్గా పనిచేయడం సాధ్యమవుతుందని, ఈడీబీ లోగోను ఆకర్షణీయంగా రూపొందించాలని చంద్రబాబు సూచించారు. ఈ సమీక్షలో ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, బోర్డు సీఈవో జె కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నవ్యాంధ్ర హరిత రాజధాని

రాజధాని ప్రతినిధి, అమరావతి : అమరావతి రాజధానిలో 900 ఎకరాలలో నిర్మించనున్న తొమ్మిది నగరాలలో పరిపాలనా నగరం ఒకటి. దాదాపు రెండు వందల ఎకరాలకు పచ్చదనం కోసం కేటాయించారు. మరో 50 ఎకరాలను నీటి పార్కులను, కాలువల కోసం కేటాయించారు. కృష్ణానది ముఖంగా రెండు కిలోమీటర్ల పొడవుగా ఒక నీటి కాలువను పరిపాలనా నగరంలో నిర్మించనున్నారు. డి ఆకారంలో ఉండే ఈ కాలువకు కృష్ణానది నుంచి నీటిని తీసుకుని మరలా కృష్ణానదిలోనికి వెళ్లేందుకు వీలుగా దీన్ని కడుతున్నారు. పరిపాలనా భవనాలు, ఐకానిక్ టవర్లు కృష్ణానదికి - కాలువకు (కెనాల్)కు మధ్యన వస్తాయని ఒక అధికారి తెలిపారు. వివిధ శాఖల అధిపతులకు కలిపి 20 నుంచి 30 అంతస్తులు వరకు ఉండే ఒకే భవనంలో నివాసం ఇవ్వనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో అమరావతి నగరాన్ని నిర్మించనున్నారు. ఇందులో భాగంగా డిజైన్ ఇస్తున్న ఫోస్టర్ కంపెనీ వాషింగ్‌టన్, లండన్ నగరాలను పరిశీలించింది. 24/7 నగరంలో వసతలు ఉండేలా నిర్మించనున్నారు.

వైజాగ్ - చెన్నై కారిడార్‌కు మహర్దశ



న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్ నుంచి చెన్నైని కలిపే 800కి.మీ పొడవైన విశాఖపట్నం -చెన్నై పారిశ్రామిక నడవా (వీసీఐసీ) నిర్మాణానికిగాను రూ.2,500(375 డాలర్లు) కోట్లను రుణంగా మంజూరు చేసేందుకు ఆసియా అభివృద్ధిబ్యాంకు (ఏడీబీ) అంగీకరించింది. ఇందుకు సంబంధించి కుదుర్చుకున్న ఒప్పందంపై భారత ప్రభుత్వం, ఏడీబీలు సంతకాలు చేశాయి. కాగా, ప్రతిపాదిత ఈస్ట్‌కోస్ట్ ఆర్థిక నడవా మొత్తం పొడవు 2,500కి.మీగా ఉంది. ఇందులో భాగంగా తొలి దశలో విశాఖపట్నం- చెన్నై మధ్యన 800కి.మీ పొడవునా నడవా నిర్మించాలని నిర్ణయించారు. ఈనడవాలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు ప్రధాన కూడళ్లు విశాఖపట్నం, కాకినాడ, అమరావతి, శ్రీకాళహస్తి - ఏర్పేడు మధ్యన మౌలిక సదేపాయాల అభివృద్ధికి ఉద్దేశించిన వ్యవస్థలను ఏర్పాటు చేసేందుకు రూ.3,300కోట్లను రుణంగా మంజూరు చేయడానికి అంగీకరించినట్లు ఏడీబీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతిపాదిత నాలుగు ప్రధాన మౌలిక వృద్ధి ప్రాజెక్టుల్లో మౌలిక వృద్ధి ప్రాజెక్టుల్లో భాగంగా విశాఖపట్నం, ఏర్పేడు -శ్రీ కాళహస్తి మధ్యన రెండు చోట్ల అత్యాధునిక అంతర్గత మౌలికాలను అభివృద్ధి చేసేందుకుగాను రూ.1,630 కోట్లను రుణంగా జారీ చేసుంది. పారిశ్రామిక అభివృద్ధి ఉద్దీపనకు ఉద్దేశించిన పారిశ్రామిక విధానాలు, వ్యాపారాన్ని సులభతరం చేసేందుకు ఉద్దేశించిన విధానాలకు అనుగుణంగా నడవా నిర్వహణలో భాగస్వామ్యం వహించే వ్యవస్థల్లో నైపుణాభివృద్ధి కల్పనకు రూ.830 కోట్లను విధాన రుణంగా మంజూరు చేయడానికి ఏడీబీ అంగీకరించింది. ఈ రుణాలు కాక, వాతావరణ మార్పుల సవాళ్లను ధీటుగా ఎదుర్కొనేందుకు ఒక ప్రత్యేక మౌలికాభివృద్ధి వ్యవస్థ ఏర్పాటుకుగాను తన అజమాయిషీలో నడిచే అర్బన్ క్లైమేట్ ఛేంజ్ రిసైలియన్స్ ట్రస్ట్ ఫండ్ ద్వారా అదనంగా ఐదు మిలియన్లను గ్రాంటుగా మంజూరు చేసేందుకు కుదుర్చుకున్న ఒప్పందం పైనా సంతకం చేసినట్లుగా ఏడీబీ ప్రకటనలో తెలిపింది.

రూ.2,500కోట్ల రుణం మంజూరుకు ఏడీబీ అంగీకారం

తొలి దశ రుణంరూ.1,630 కోట్లలో భాగంగా చేపట్టనున్న ప్రతిపాదనల్లో జాతీయ రహదారి 16 - కాకినాడల మధ్యన రహదారి అనుసంధానత మెరుగు పరచడం లక్ష్యంగా ఉంది. ఈ 29.6కి.మీ. పొడవు రాష్ట్ర రహదారిని నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి చేయాలన్న అంశమూ ఇమిడి ఉంది. విశాఖపట్నంలో నీటి ఎద్దడి తగ్గించడవ, నిరంతర తాగునీటి సరఫరా లక్ష్యాలుగా స్వచ్ఛమైన తాగునీటి సరఫరా వ్యవస్థలో పెట్టుబడులు సమకూర్చడమూ మరొక ప్రాధాన్యతాంశంగా ఉంది. తీసుకున్న రుణాన్ని వడ్డీతో సహా చెల్లింపుకు ఐదు సంవత్సరాల గ్రేస్ పీరియడ్‌ను కలుపుకుని మొత్తం 25 సంవత్సరాలను గడువుగా నిర్ణయించినట్లు ఏడీబీ తెలిపింది. ఏడీబీకి చెందిన లిబర్ ఆధారిత రుణాలపై వడ్డీ విధాన ప్రతిపదికగా వడ్డీ నిర్ణయం జరుగుతుందని తెలిపింది.. నిర్ణయించిన వడ్డీతో పాటుగా అసలు ఫాయిదా చెల్లింపులు 20 ఏళ్ల పాటు చెల్లించేలా ఒప్పందం కుదరినట్లుగా ఏడీబీ ప్రకటన వివరించింది. తాము మంజూరు చేసిన రుణ సాయంతో అమలు జరిపూ ప్రాజెక్టుల ద్వారా 2015లో 16 బిలియను డాలర్లుగా ఉన్న వార్షిక పారిశ్రామికోత్పత్తి 2025నాటికి నాలుగింతలు వృద్ధి చెంది 64 బిలియను డాలర్లకు చేరుతుందని ఆశిస్తున్నట్లు ఏడీబీ ఇండియా రెసిడెంట్ మిషన్ డిప్యూటీ డైరెక్టర్ ఎల్బీసోంద్‌జాజా ఆశాభావం వ్యక్తం పరిచారు. అయితే , రానున్న ఐదేళ్ల కాలంలో పారిశ్రామిక పెట్టుబడుట మరింతగా పెరగాల్సి ఉందని ఆయన హెచ్చరించారు. మనీలా కేంద్రంగా మొత్తం 67 మంది యాజమాన్య ప్రతినిధులతో 1966లో ప్రారంభమైన ఏడీబీలోఒక్క ఆసియా ప్రాంతం నుంచే 48 మంది ప్రతినిధులు ఉన్నారు.

ఏప్రిల్ 7 నుంచి ఆరోగ్యరక్ష

- త్వరలో 173 ముఖ్యమంత్రి ఆరోగ్యకేంద్రాలు
- డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో నిర్వహణ
- సీఎం చంద్రబాబు వెల్లడి

రాజధాని ప్రతినిధి ,(అమరావతి) : రాష్ట్రంలో యూనివర్సల్ హెల్త్‌కేర్ (ఆరోగ్యరక్ష) కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఏప్రిల్ 7వ తేదీ నుంచి సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఆరోగ్యంగా వుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకే ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం అందించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి తన నివాసం నుంచి వైద్య ఆరోగ్యశాఖల అధికారులు, జిల్లాల కలెక్టర్లు, పంచాయతీరాజ్, పురపాలక శాఖ అధికారులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా రూపొందించడంలో భాగంగా గ్రామాలు వార్డుల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలన్నారు. డయేరియా, టైఫాయిడ్, డెంగ్యూ తదితర వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వేసవిలో వడదెబ్బ తగులకుండా ఇప్పటినుండే చర్యలు తీసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా వుంచుకోవాలని, రద్దీ ప్రాంతాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద నిర్వహించేపనులు ఉదయం పూటే జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో త్వరలోనే 173 ముఖ్యమంత్రి ఆరోగ్యకేంద్రాలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. డ్వాక్రా మహిళలే వీటిని నిర్వహిస్తారని, చౌకధరకు అన్నిరకాల మందులు ఈ కేంద్రాల ద్వారా అందజేయబడతాయాన్నారు. ఆరోగ్యరక్షకు విస్తృత ప్రచారం కల్పించాలని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రపంచ ఆరోగ్యదినం సందర్భంగా యూనివర్సల్ హెల్త్ కేర్ సాధించిన తొలి గ్రామానికి, మండలానికి, జిల్లాకు అవార్డులు అందించనున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఈసందర్భంగా ఆరోగ్యంపై ప్రజలను చైతన్యపర్చిన వ్యక్తులు , సంస్థలకు , అవార్డులిచ్చి సత్కరిస్తామన్నారు. నరేగా ద్వారా విశాఖ జిల్లాలో మనరామన గ్రామరామన శుభ్రత విజయవంతం చేసిన పంచాయతీరాజ్ శాఖను, నరేగా అధికారులను అభినందించారు. దీనిని స్ఫూర్తిని తీసుకొని ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని సూచించారు. చంద్రన్న బీమా పరిహారం సకాలంలో అందించడంలో వైద్యాధికారులు సహకరించాలని, ఐదు రోజుల్లో డెత్ సర్టిఫికెట్లు పోస్టుమార్టమ్ రిపోర్టులు అందజేయాలని ఆదేశించారు. మార్చి 31వ తేదీలోగా ఉద్దానంలో డిస్పెన్సరీ యూనిట్లు ప్రారంభించాలని అధికారులకు డెడ్‌టైన్ విధించారు. అలాగే ఆ ప్రాంతంలో ఎన్టీఆర్ సుజల ప్లాంట్ల ఏర్పాటుకు 100 చదరపు గజాల స్థలం ఆయా గ్రామాల్లో త్వరితగతిన కేటాయించాలన్నారు. ఉద్దానం, కనిగిరి ప్రాంతాలు, ఏజెన్సీ ఏరియాలపైయ వైద్య , పంచాయతీరాజ్‌శాఖాధికారులు ప్రతేక్య శ్రద్ధ పెట్టాలన్నారు. వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి పూనం మాలకొండయ్య మాట్లాడుతూ ఈ ఏడాది ఇప్పటివరకు ఎన్టీఆర్ వైద్య పరీక్షల కింద 49,94,270 మందికి , 4,37,321 మందికి ఎక్స్‌రే, 21,913 మదికి సిటీ స్కాన్ పరీక్షలు, చంద్రన్న సంచార చికిత్స కింద 33,38,34 మందికి వైద్యహాయం అందించామని తెలిపారు.

5న సాఫల్య పురస్కారాలు ప్రదానం

విశాఖపట్నం :

ప్రపంచ మహిళాదినోత్సవాన్ని పురస్కరించు కొని ఈ నెల ఐదో తేదీ అదివారం సాయంత్రం ఉడా చిల్డ్రన్స్ ఎరీనాలో వి-టీమ్ సంస్థ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గుత్తాజ్వాలకు 'ద మోస్ట్ ఔట్‌స్టాండింగ్ స్పోర్ట్స్ పర్సనాలిటీ' (అత్యంత ప్రతిభావంతురాలైన క్రీడాకారిణి) బిరుదు ప్రదానం చేయనుంది.

అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ నన్నపనేని రాజకుమారిని 'జీవన సాఫల్య పురస్కారం'తో గౌరవిస్తారు. వి-టీమ్ సంస్థ ముఖ్య కార్యనిర్వహణధికారి వీరూమామ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆ వేదికపై ప్రఖ్యాత సినీ నేపథ్యగాయని సునీతకు లతామంగేష్కర్ స్వీట్ వాయిస్ అవార్డు, రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాల నుంచి ఎంపిక చేసిన తొమ్మిది మందికి 'మార్వెలస్ మహిళ అవార్డ్-2017'ను ఆనాటి ముఖ్య అతిథి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి గంటా శ్రీనివాసరావు,కలశ ఫౌండేషన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డా. నూతన్ నాయుడు, సినీ రచయిత, దర్శకుడు జగదీష్ దానేటి ప్రదానం చేస్తారు.

పిల్లల దత్తత చట్టాలు మారాలి

రాజధాని ప్రతినిధి ,(విజయవాడ) : పిల్లల దత్తత చట్టాల్లోసమూల మార్పులు రాల్సిన అవసరం వుందని పలువురు న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. విజయవాడలోని ఎ కన్వెషన్ సెంటర్‌లో రెండవ రోజు కార్యక్రమంలో అంతర్జాతీయ వర్క్‌షాప్‌లో మేధోసంపత్తి, వాణిజ్య అనువర్తిత చట్టాలపై నిర్వహించిన సదస్సులో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి.లోకూర్ పాల్గొన్నారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ సివిల్ కేసుల పరిష్కారంలో ఆయన మాట్లాడుతూ సివిల్ కేసుల పరిష్కారంలో ఆర్బిట్రేటర్ ముఖ్య పాత్ర వహిస్తున్నారన్నారు. వలన చట్టాలకు, కంపెనీల ఆగ్రీమెంట్లకు సంబంధించి సింగపూర్ లాంటి దేశంలో రోజుకు ఒక్కో కేసుకు లక్షరూపాయల వరకు తీసుకుంటున్నారన్నారు. భారతదేశంలో ఆర్బిట్రేటర్లు తక్కువ ఖర్చుతోనే తమ సేవలు కేసుల పరిష్కారంలో అందిస్తున్నారని తెలిపారు. మధ్యవర్తిత్వంలో ఆర్బిట్రేటర్ కేసుల పరిష్కారంలో గణనీయమైన పాత్ర నిర్వహిస్తున్నారన్నారు. వలన చట్టాల మీద ఆధారపడే కన్నా మనకంటూ భారతదేశానికి చట్టాల విషయంలో స్వీయ విధానం అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. క్రొత్త ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అమల్లోకి తేవడం వల్ల త్వరగా కేసుల పరిష్కారానికి దోహదం చేస్తుందన్నారు. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి.రోహిణి వివాహ సంబంధాలపై సవివరంగా మాట్లాడారు. మారుతున్న కాలంలో ఎన్ఆర్ఐ, సహజీవనం , సరోగసి, ఆడాప్షన్‌లపై వస్తున్న కేసుల గురించి వివరించారు. ఈ తరహా కేసులు మన దేశంలో కూడా అంతకంతకు పెరుగుతున్నాయన్నారు.

అంతర్జాతీయ సెమినార్‌లో న్యాయమూర్తుల ఆకాంక్ష

ఉవనైల్ యాక్ట్ 41కి సంబంధించి కేసులకు ఉన్న అవరోధాలను వివరించారు. చిన్నపిల్లలు కేసుల పరిష్కరించడంలో అనేక ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రాల మధ్య దత్తత విషయంలో కేసులు పెరుగుతున్నాయన్నారు. అంతర్జాతీ యంగా సరోగసిపై ఉన్నచట్టాలను ప్రతిబంధకాలను వివరించారు. కోడిఫైడ్ లా తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సుప్రీం కోర్టు మాజీ జడ్జి అర్.వి రవీంద్రన్ మాట్లాడుతూ వివిధ కోర్టుల్లో కేసులు త్వరగా పరిష్కారం కావడానికి న్యాయవాదులు, న్యాయాధికారులు తమ వంతు కృషి అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్బిట్రేషన్‌యాక్ట్‌కు సంబంధించి వివిధ సెక్షన్స్‌ను వివరించారు. భారతదేశం ఆర్బిట్రేషర్ హబ్‌గా భవిష్యత్తులో ఏర్పాటు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మాజీ న్యాయమూర్తి వీవీ యస్ రావు ప్రోపర్టీ లాస్ మీద మాటాకలడారు. భారతదేశానికి సంబంధించిన పౌరులు విదేశాలలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకోవడం, దానికి సంబంధించి ఉన్న ఆస్తుల వివాదాలను వివరించారు. దేశంలో గోలక్‌నాథ్, కేశవానంద భారతీ కేసులకు సంబంధించి ఉన్న ఫండమెంట్ రైట్స్ పై వచ్చిన తీర్పులను వివరించారు. అనంతరం రెండురోజులపాటు నిర్వహించిన అంతర్జాతీయ వర్క్‌షాప్‌లో పాల్గొన్న సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ జి.రోహిణిలను బెజవాడ బార్ ఆసోసియేషన్ సభ్యులు దుశ్శాలువతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లను , రెండు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించిన జట్రో, ఈడీబీసభ్యులను జస్టిస్ ఎన్.వి రమణ, మదన్ బి.లోకూర్‌లు దుశ్శాలువాతో సన్మానించారు.

ఏబీవీపీ వీరంగం

- ప్రొఫెసర్‌పై హత్యాయత్నం
- కిడ్నీ, పక్కటెముకలకు తీవ్రగాయాలు

న్యూఢిల్లీ : రామ్‌జాస్ కాలేజీలో ఏబీవీపీ కార్యకర్తలు ఎంత పేట్రేగిపోతున్నారో చెప్పడానికి ఇటీవల కాలేజీలో జరిగిన విధ్వంసకాండ రుజువుచేస్తోంది. ఒక ప్రొఫెసర్‌పై దాడికి దిగి ఆయన్ని కిందకు పడదోసి కాళ్లతో విచక్షణారహితంగా తంతూ చిత్రహింసలకు గురిచేశారు. ఆయన మెడకు ఉన్న మఫ్లర్‌తో గొంతును గట్టిగా బిగించి హత్యాయత్నానికి పాల్పడ్డారు. గత జరిగిన ఈ సంఘటన అటు ప్రొఫెసర్లను, ఇటు విద్యార్థుల్ని తీవ్ర భయకంపితుల్ని చేసింది. ప్రొఫెసర్ ప్రశాంత్ చక్రవర్తి యూనివర్శిటీలోని తన ఆర్ట్స్ ఫ్యాకల్టీ గదిలో ఉన్నారు. రామ్‌జాస్ కాలేజికి చెందిన షెహ్లా రషిద్, ఉమర్ ఖాలిద్‌ల ప్రసంగాలను రద్దు చేసినందుకు కొంతమంది విద్యార్థులు, నిరసనకు దిగారు. ఈ సందర్భంలో ఏఐఎస్ఏ విద్యార్థులకు, ఏబీవీపీ విద్యార్థులకు మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ ఘర్షణ తీవ్రమై విద్యార్థులు ఒకరిపై మరొకరు దాడులకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ దాడుల వెనుక ఏబీవీపీ హస్తమున్నదనే ఆరోపణలు వినబడుతున్నాయి. ఈ సమయంలో ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడి దాడులకు ఏబీవీపీ పాల్పడింది. ఆర్ట్స్ ఫ్యాకల్టీలో ఉన్న చక్రవర్తిపై కూడా వారి దృష్టి పడి ఆయన్ని లాక్కువచ్చి విచక్షణారహితంగా దాడి చేశారు. ఆయన్ని కిందకు తోసి కాళ్లతో తంతూ నానా బీభత్సం సృష్టించారు. అయన మెడలో ఉన్న మఫ్లర్‌తో ఉరివేసేందుకు ప్రయత్నించారు. దీనికి పోలీసులు ప్రత్యక్షసాక్షులుగా నిలవడం గమనార్హం. ఏబీవీపీ దాడులకు దిగిన సందర్భంలో వారికి కొంతమంది పోలీసులు కూడా సహకరించారని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ఈ సంఘటన అనంతరం ఆసుపత్రి చుట్టూ ప్రొఫెసర

ఇకపై సాధారణ బ్యాంక్‌గా 'స్త్రీ నిధి'

- వచ్చే నెలాఖరులోగా 11 వేల కోట్ల వడ్డీ రుణం పంపిణీ
- స్వయం సహాయకసంఘాలు మరింత పరిపుష్టం
- సీఎం చంద్రబాబు ఆదేశం

రాజధాని ప్రతినిధి ,(అమరావతి) : స్వయం సహాయక సంఘాలను మరింత పరిపుష్టం చేయాలని, దీనిలోభాగంగా వారికి అందజేయాల్సిన రూ.11వేల కోట్ల రూపాయల వడ్డీలేని రుణాన్ని మార్చి మాసాంతంలోగా ఎట్టి పరిస్థితుల్లోనూ పంపిణీ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ అంతును కేవలం రుణాల పంపిణీ ప్రక్రియగా భావించి తూతూ మంత్రంగా పూర్తి చేసి వదిలేయకుండా డ్వాక్రా సంఘాలను పరిపుష్టం చేయడానికి వెచ్చించాలని చెప్పారు. కాంగ్రెస్ పదేళ్ళ పాలనలో డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేసి స్ఫూర్తిని పూర్తిగా నీరుగార్చారని, సృజనాత్మకతను చిదిమేసి మహిళా శక్తిని హరించే వేశారని విమర్శించారు. డ్వాక్రా సంఘాలను గత పాలకులు దుర్భల పరిస్థితుల్లో అప్పగించారని, మహిళా సాధికారతే ధ్యేయంగా మళ్ళీ శూన్యం నుంచి ప్రారంభించి ఈ సంఘాలన్నింటికీ జీవసత్వాలు కల్పిస్తున్నామని గుర్తు చేశారు. మధ్యాహ్నం ముఖ్యమంత్రి తన నివాసంలో స్వయం సహాయక మహిళా సంఘాల పనితీరును సమీక్షించారు. ఇకనుండి డ్వాక్రా సంఘాలకు అందించే రుణాలను వారికి మరింత ఆదాయాన్ని సమకూర్చి ఆర్థికంగా సమున్నతుల్ని చేసే విధంగా వుండాలని నిర్దేశించారు. రుణాలందజేసి తమ లక్ష్యాలను చేరుకున్నామని చెపితే సరిపోదని, వాటిని సద్వినియోగం అయ్యే చూసే బాధ్యతలను కూడా తీసుకోవాలన్నారు 70 లక్షల మంది డ్వాక్రా మహిళలకు నైపుణ్యాలు పెంచి ఆదాయం మార్గాలను కల్పిస్తే ఊహకందని అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతి కుటుంబానికి కనీసం రూ.10వేలు ఆదాయం సమకూర్చేలా చూడాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఆ లక్ష్యానికిచేరువ కావడానికి డ్వాక్రా సంఘాలకు అందించే రుణాలే ఆధారమన్నారు. అలాగే ప్రభుత్వం చేపట్టిన స్త్రీ నిధి పథకాన్ని రానున్నకాలంలో పూర్తిస్థాయి బ్యాంక్‌గా మార్చాలని సీఎం సూచించారు. ముగియనున్న ఆర్థిక సంవత్సరంలో స్త్రీ నిధి కింద రూ.1100 కోట్లు అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, నేటికి రూ.682 కోట్లు అందించామని, మార్చి నెలాఖరుకు లక్ష్యాన్ని చేరుకుంటామని సెర్ప్ సీఈఓ పి.కృష్ణమోహన్ లందించే కార్యక్రమంగా మలచాలని సీఎం సూచించారు. పసుపు - కుంకుమ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో 6,67,362, పట్టణ ప్రాంతాల్లో 1,60,758 సంఘాల్లోని సుమారు 82 లక్షల మందికి 4,972 కోట్లు అందించినట్లు సీఎం వెల్లడించారు. కొత్తగా మరో లక్షా 85 వేల మందికి ఇవ్వనున్నామన్నారు.

బడుగులకు బడి దూరం

రాజధాని ప్రతినిధి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గానికి చెందిన పేద పిల్లలను క్రమేపీ చదువుకు దూరం చేస్తోంది. రాష్ట్రంలో1.259 ఎస్సీహాస్టళ్లు ఉండగా..2015-16లో 186 హాస్టళ్లు రద్దు చేశారు. అనంతరం 2016-17లో 267 హాస్టళ్లు రద్దు చేశారు.తాజాగా వచ్చే విద్యా సంవత్సరంలో310 హాస్టళ్లు రద్దు చేస్తున్నట్లు చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించింది.వచ్చే ఏడాది 16,588 మందిని హాస్టళ్ల నుంచి పంపించేయనున్నారు. వీరంతా గురుకుల పాఠశాలలో చేరినట్లు ప్రభుత్వం చెబుతున్నా... చాలా మంది విద్యార్థులు చదువు మానేస్తున్నారు.

పెరిగిన నాన్ సబ్సిడీ సిలిండర్ ధర

న్యూఢిల్లీ : రాయితీ లేని వంట గ్యాస్ ధరలకు రెక్కలొచ్చాయి. దీనిపై రూ.86 లను పెంచుతున్నట్టు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రకటించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎల్‌పీజీ ధరలు భారీగా పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. తక్షణమే ఈ ధరల్లో అమల్లోకి రానున్నది. అయితే సబ్సిడీ సిలిండర్ల ధరలపై ఎలాంటి ప్రభావం ఉండదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. మార్చి 1, 2017 నాటికి ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.737గా ఉంటుందని వివరించింది.

ఎస్ఐటీ సీఈవో, ఏడీబీ వైస్‌ఛైర్మన్‌గా టక్కర్

రాజధాని ప్రతినిధి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సత్యప్రకాష్ టక్కర్‌ను స్ట్రాటిజిక్ ఇనిస్టిట్యూట్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఏపీ (ఎస్ఐటీ ఏపీ) సీఈవోగా, రాష్ట్ర ఆర్థిక మండలి(ఏపీఏడీబీ) వైస్ ఛైర్మన్‌గా నియమిస్తూ ప్రస్తుత సీఎస్ అజేయ కల్లం ఉత్తర్వులు జారీ చేశారు. పదవీ విరమణ అనంతరం కూడా టక్కర్ సేవలను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయించారు. టక్కర్‌కు ఇచ్చిన పదవి రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ స్థాయిలో ఉంటుందని సీఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మార్కెట్‌లో బంట్ - డింప్లెక్స్ 'హీట్ పంప్'

రాజధాని ప్రతినిధి ,(విజయవాడ) : సోలార్‌తో వేడినీటిని తయారు చేసేందుకు భారతదేశ మార్కెట్‌లోకి బంట్ - డింప్లెక్స్ బ్రాండ్ పేరిట హీట్ పంప్‌ను ప్రవేశపెట్టారు. వివిధ రకాల సోలార్ ఉత్పత్తుల్లో ప్రాచుర్యం పొందిన బంట్ సోలార్ ఇండియా ప్రై.లి. (బెంగుళూరు) తన వ్యాపార విస్తరణ కోసం 'గ్లెన్ డింప్లెక్స్' డచ్ ల్యాండ్ జిఎంబి హెచ్ విద్యుత్ గృహోపకరణాల ఉత్పత్తుల కంపెనీతో భాగస్వామ్యం అయ్యి ఈ హీట్ పంపులను మార్కెట్‌లోకి విడుదల చేసింది. గ్లెన్ డింప్లెక్స్ సంస్థ ఇంటర్నేషనల్ సేల్స్ డైరెక్టర్ వోల్కర్ రుప్లే, బంట్ సోలార్ ఇండియా ప్రై.లి. మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ శెట్టి ఒక సంయుక్త ప్రకటన చేస్తూ ఈ డింప్లెక్స్ హీట్ పంప్‌లను బంట్ సోలార్ దిగుమతి చేసుకుని భారతదేశంలో మార్కెట్ చేస్తుందని వివరించారు. ఇంటిలో ఉన్న వేడిని నీటిని వేడి చేయడానికి ఉపయోగించుకోవచ్చని, దీని ద్వారా వినియోదారులకు విద్యుత్ ఖర్చు ఆదా అవుతుందన్నారు. హీట్ పంప్ డిజిల్ బాయిలర్ 1/3 అండ్ ఎలక్ట్రిక్ గీజర్‌లో 1/4 విద్యుత్ మాత్రమే తీసుకుంటుందన్నారు. నీటిని వేడి చేసే ప్రక్రియలో నీటి పంపు ఉత్పత్తి చేసే చల్లని గాలిని కూడా గది చల్లబర్చడానికి వాడుకోవచ్చన్నారు. ఈ బంట్ డింప్లెక్స్ హీట్ పంపు ఒక కుటుంబానికి ఏడాదికి సరిపడా వేడినీటిని అందిస్తుందన్నారు. దీని ధర రూ.2.50 లక్షల నుండి రూ.3.4 లక్షల వరకు ఉంటుందన్నారు. రెండు సంవత్సరాలు వారెంటీ కూడా లభిస్తుందన్నారు.

నిస్సాన్ .. రికార్డ్ బ్రేక్

న్యూఢిల్లీ : భారత్ నుంచి 7 లక్షల కార్లను ఎగుమతి చేసి రికార్డు సృష్టించినట్లు జపాన్ ఆటో దిగ్గజం నిస్సాన్ వెల్లడించింది. భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన ఏడేళ్ల వ్యవధిలోనే ఈ మైలురాయిని చేరుకున్నట్లు తెలిపింది. భారతలోని చెన్నై ప్లాంట్‌లో ఉత్పత్తి చేస్తున్న నిస్సాన్, డాట్సన్ బ్రాండ్లను నిస్సాన్ ఇండియా.. 106 దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు సంస్థ ప్రెసిడెంట్ గుల్మో సికార్డ్ తెలిపారు. మేడ్ ఇన్ ఇండియా కార్లకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించిందన్నారు. 2021 నాటికి దేశీ మార్కెట్లోకి ఎనిమిది కొత్త ఉత్పత్తులను విడుదల చేయనున్నట్లు వివరించారు.

పశుగ్రాసం కొరత.. ఇక్కట్లలో రైతాంగం

2021 నాటికి పాల దిగుమతి అనివార్యం

రాజధాని ప్రతినిధి : లభ్యమవుతున్న పశుగ్రాసం నాణ్యత, పరిమాణాలు పాల ఉత్పత్తిని ప్రభావితం చేసే అంశాలు, పాల గిరాకీని దృష్టిలో పెట్టుకుని పశుగ్రాసం ఉత్పత్తికి ఇపుడు వినియోగంలో ఉన్న భూములను రెండింతలు చేయాల్సిన అవసరం ఉందని వ్యవసాయంపై పార్లమెంటరీ కమిటీ 2016 డిసెంబరు నివేదికలో వెల్లడించింది. సంప్రదాయ పంటల సాగుతో పాటుగా పశుగ్రాసం సాగుకూ భూవినియోగం పెరగాల్సిన అవసరాన్ని కమిటీ ఎత్తిచూపింది. పాల గిరాకీని దృష్టలో పెట్టుకుని పశుగ్రాసం ఉత్పత్తికి ఇపుడు వినియోగంలో ఉన్న భూములను రెండింతలు చేయాల్సిన అవసరం ఉందని వ్యవసాయంపై పార్లమెంటరీ కమిటీ 2016 డిసెంబరు నివేదికలో వెల్లడించింది. సంప్రదాయ పంటల సాగుతో పాటుగా పశుగ్రాసం సాగుకూ భూవినియోగం పెరగాల్సిన అవసరాన్ని కమిటీ ఎత్తి చూపింది. కాగా, పశుగ్రాసంగా వినియోగించే పచ్చిగడ్డి (63 శాతం), ఎండుగడ్డి (24 శాతం), దాణా మిశ్రమాలు (79 శాతం) మూడు రకాల్లోనూ కొరత కొట్టొచ్చినట్లుగా ఉంది. మొత్తం సాగు భూమిలో కేవలం నాలుగు శాతమే పశుగ్రాసం కోసం వినియోగిస్తున్న పరిస్థితి ఉంది.

ఆహారం, నగదు ప్రాధాన్యతల ముందు పశుగ్రాసం కొరతను భాగం ఒక సమస్యగా చూడటం లేదని అభిప్రాపడింది. ఈ క్రమంలోనే పశుగ్రాసం సాగుకు భూ వినియోగం తగ్గుతున్న పరిస్థితి ఎక్కువని కమిటీ అభిప్రాయపడింది. భారత్‌లో పాల వినియోగ గిరాకీకి తగినట్లుగా ఉత్పత్తి సాధించిన నేపథ్యంలో ఇతర దేశాల నుంచి పాల దిగుమతి చేసుకోక తప్పదని 2015 ఎస్ఓఐఎల్ నివేదిక హెచ్చరించింది. నగదు కోసం వాణిజ్యపంటల సాగుకు రైతులు ఎలా మొగ్గు చూపుతున్నారో భవిష్యత్తులో ఎదురుకాగల పశుగ్రాసం కొరతను తట్టుకునేందుకు ఇప్పటి నుంచి జాగ్రత్త పడాలని కమిటీ హెచ్చరించింది.

ప్రపంచంలో పాల ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలిచిన భారత్ రానున్న ఆరేళ్లలో అంటే 2021 నాటికి పాలను దిగుమతి చేసుకునే పరిణామాలు పొంచి ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొత్తం ప్రపంచ పాల ఉత్పత్తిలో 17 శాతం పాల ఉత్పత్తితో భారత్ ప్రథమ స్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. ఇందులో 70శాతం పాల ఉత్పత్తి ప్రధానంగా సన్న, చిన్నకారు రైతాంగం నుంచే సమకూరుతోంది. ప్రస్తుతమున్న 299 మిలియన్ల పశువులకు అవసరమైన పశుగ్రాసం పెరుగుదలకు తక్షణ చర్యలు అవసరమవుతాయని చెబుతున్నారు. పశుగ్రాసం లభ్యతలో అప్రమత్తత పాటించకపోతే డిమాండుకు తగిన సరఫరా చేయలేని పరిస్థితి ఎదురుకానుందంటున్నారు. సరిపడా దాణా లభ్యత కలిగి ఉండి అధిక పాల ఉత్పత్తి సాధిస్తున్న రాష్ట్రాల జాబితాలో రాజస్థాన్ (704), హర్యానా (877), పంజాబ్ (1,082)లు మొదటి మూడు స్థానాలు ఆక్రమించాయి...

జనాభా, ఆదాయాల పెరుగుదల, మారుతున్న ఆహార ప్రాధాన్యతలు వెరసి పాటు, పాల ఉత్పత్తులకు భారీ గిరాకీ తలెత్తనుంది. 2021-22నాటికి 210 మిలియన్లు టన్నుల పరిమాణంలో పాలు, పాల ఉత్పత్తులకు గిరాకీ ఎదురుకానుందని ప్రభుత్వ అంచనాగా ఉంది. ఈగిరాకీకి అనుగుణంగా పాల ఉత్పత్తి ఏటా 5.5శాతం పెరగాలని స్టేట్ ఆఫ్ లైవ్‌లీహెడ్ (ఎస్ఓఐఎల్) నివేదిక వెల్లడిస్తోంది. 2014-'15లో 6.2శాతం, 2015-'16లో 6.3శాతం పాల ఉత్పత్తి పెరిగినట్లు సదరు నివేదిక తెలిపింది. భవిష్యత్తులో తలెత్తే పాల గిరాకీని తట్టుకునేందుకు 2020 నాటికి పశుగ్రాసం సాగు 1,764 మిలియను టన్నులుగా ఉండాలని ఇండియా స్పెండ్ ప్రభుత్వ విశ్లేషణ అంచనా. ఇందులో లభ్యతలో ఉన్న వరుసల రూపంలో కేవలం 900 మిలియను టన్నుల పశు దాణ లభ్యమవుతుందని ఈ లెక్కన 49శాతం పశుగ్రాసం కొరత ఆందోదళన రేపుతోందని నివేదిక హెచ్చరించింది. 1998-'2005 మధ్యన ఐదు శాతంగా ఉన్న వార్షిక ప్రైవేటు వినియోగ గిరాకీ 2005-'2012 మధ్య కాలానికి 8.5 శాతానికి పెరిగిన వైనాన్ని బెంగుళూరు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఎత్తి చూపింది. ఈ క్రమంలో పాల సరఫరా, గిరిగాకీలో మధ్యన నెలకొన్న అనంతరం పెరిగిన ఫలితంగా ఏడాదికి 16శాతం మేర పాల ధర పెరుగుతూ వస్తున్న పరిణామం ఉందని సదరు 2015 ఎస్ఓఐఎల్ నివేదిక వివరించింది. పశుగ్రాసం కొరత సమస్య తీవ్రత కారణంగా పాల ఉత్పత్తిలో ప్రపంచ పెద్దన్న హోదాకు భారత్ దూరమయే ప్రమాదాన్ని తోసివేయజాలమని నివేదిక తెలిపింది.

ఏరిశ్రమలకు దగ్గరగా నివాసాలు

20 'వర్క్‌టు వాక్' టౌన్‌షిప్‌లు పూర్తయితే దేశంలో ప్రథమ రాష్ట్రంగా ఏపీ

రాజధాని ప్రతినిధి- విజయవాడ : సింగపూర్ తరహాలో 20 'వర్క్ టు వాక్' టౌన్‌షిప్‌లను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తక్కువ సమయంలోనే ఉద్యోగులు తాము పనిచేసే ప్రదేశానికి చేరుకునే విధంగా వీటి నిర్మాణం జరగనుంది. ఈ టౌన్‌షిప్‌ల నిర్మాణం జరగనుంది. ఈ టౌన్‌షిప్‌ల నిర్మాణం పూర్తయితే దేశంలోనే ప్రథమ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ చరిత్రలో నిలవనుంది. వైజాగ్- చెన్నై కారిడార్, బెంగళూరు-చెన్నై కారిడార్లలో వీటి నిర్మాణాన్ని పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ రెండు కారిడార్లలో ఏర్పాటయ్యే వివిధ రకాల పరిశ్రమల్లో పనిచేసేవారికి సమీప ప్రాంతాల్లోనే నివాస సదుపాయం కలుగుతోంది. తద్వారా రవాణాతో సంబంధం లేకుండా కేవలం 10 నిముషాల వ్యవధిలోనే కాలినడకన ఆయా కంపెనీలకు చేరుకోవచ్చు. ఇటువంటి టౌన్‌షిప్‌లు సింగపూర్‌లో అనేకం ఉన్నాయి. అయితే వాటిలో ప్రణాళికా బద్ధంగా నిర్మాణం జరిగిన సీసీకే నగరంగా వ్యవహరించే 'ఛువా ఛు కాంగ్'ను ఆదర్శంగా తీసుకోవాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇటీవల పట్టణ ప్రాంతాల్లో గృహనిర్మాణంపై జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ అంశం చర్చకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. తొలిదశలో వైజాగ్- చెన్నై కారిడార్‌లో చేపట్టే 5 'వర్క్ టు వాక్' టౌన్‌షిప్‌లలో ఒకటి విజయవాడలో, నాలుగు విశాఖపట్నంలో నిర్మించనున్నారు. విజయవాడ శివార్లలోని జక్కంపూడి వద్ద 265 ఎకరాల్లో నివాస, వాణిజ్య, పారిశ్రామిక పరంగా 'ఎకనమిక్ టౌన్‌షిప్ ప్రాజెక్టు'ను చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రెండోదశలో మరో 400 ఎకరాలను అభివృద్ధి చేస్తారు. ఈ ప్రాంతంలో సుమారు 2వేల వరకూ ఐటీ సంబంధిత కంపెనీలతోపాటు ఎలక్ట్రానిక్ సంస్థలు కొలువ తీరనున్నాయి. అలాగే ఆసుపత్రులు, పాఠశాలలు, షాపింగ్‌మాల్స్ కూడా ఏర్పాటుకానున్నాయి. తద్వారా 18,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇక వైజాగ్ పరంగా వైజాగ్ సౌత్ టౌన్‌షిప్‌లో 388 ఎరకాల్లో స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఎస్ఈజెడ్) నిర్మాణం జరుగుతోంది. ఇక్కడ 24వేల యూనిట్లను స్థాపించనున్నారు. అలాగే మరో 300 ఎకరాల్లో చేపట్టే వైజాగ్ నార్త్ టౌన్‌షిప్‌లో 75వేల నివాసాలను ఏర్పాటు చేస్తున్నారు. అన్ని వర్గాలకు అనువైన విధంగా టౌన్‌షిప్‌లను నిర్మించడం ద్వారా ఉద్యోగులు తక్కువ సమయంలోనే తాము పనిచేసే కంపెనీలు, సంస్థలకు చేరుకోవడం వల్ల సమయం, రవాణా చార్జీలు కలిసొస్తాయని అధికారులు తెలిపారు. చువా చు కాంగ్ నగరం 1980 నుండి అంచెలంచెలుగా అభివృద్ధి చెందిందని, పరిశ్రమలకు అందుబాటులో ఉండే విధంగా గృహ నిర్మాణం జరిగిందటున్నారు. రైలు, రోడ్డు రవాణా వ్యవస్థ కూడా ఎంతో అభివృద్ధి చెందిన నగరంలో ఇతర అవసరాల కోసమే వీటిని ఉపయోగిస్తారన్నారు. విద్య, వైద్య సంస్థలే కాకుండా ఆహ్లాదం, వినోదాన్ని అందించే మాల్స్, స్విమ్మింగ్‌పూల్స్, పార్కులు తదితరాలన్నీ ఒకే చోట అందుబాటులో ఉంటాయని తెలిపారు.

16 ప్రైవేటు సంస్థలు సంసిద్ధత

రాష్ట్రంలో 5 నగరాల్లో వాక్ టు వర్క్ టౌన్‌షిప్‌ల నిర్మాణానికి మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ఈ ఏడాది జనవరి 2వ తేదీన జీవో జారీ చేసింది. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, రాజమండ్రి, కర్నూలులో పీపీపీ పద్ధతిలో నిర్మాణాలకు ప్రైవేటు సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించింది. టౌన్‌షిప్‌ల నిర్మాణానికి 16 సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేస్తూ ప్రతిపాదనలు అందచేశాయి. వీటిని పరిశీలించిన అనంతరం ఆయా అర్హతలను బట్టి సంస్థలను ఎంపిక చేసి నిర్మాణ బాధ్యతలను అప్పగించే ప్రక్రియను ఆరంభిస్తామని అధికారులు చెబుతున్నారు. సింగపూర్‌కు చెందిన సుర్బానా జురాంగ్ సంస్థతో కలిసి ఇందుకు సంబంధించిన బ్లూప్రింట్లను రూపొందించేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. రాష్ట్రంలో 2 లక్షల ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. వీటిని మొత్తం నాలుగు రకాలుగా నిర్మించనున్నారు. ఆర్థికంగా బలహీనవర్గాలు (ఈడబ్ల్యుఎస్), తక్కువ ఆదాయం వర్గాలు (ఎల్ఐజీ), మధ్యమ ఆదాయ వర్గాలు (ఎంఐజీ), ఉన్నత ఆదాయ వర్గాలు (హెచ్ఐజీ)లకు అనుగుణంగా ఈ నిర్మాణాలను టౌన్‌షిప్‌ల రూపంలో చేపట్టనున్నారు. రాష్ట్రంలో పీపీపీ పద్ధతిలో వాక్ టు వర్క్ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేసేందుకు మరిన్ని సంస్థలు ముందుకు వస్తున్నాయని అధికారులు తెలిపారు.

చెదురుతున్న అమెరికా డాలర్ కలలు

- భయం గుప్పెట్లో భారతీయులు
- ట్రంప్ విధానాలూ... కాన్సస్ కాల్పులు... అభద్రత తీవ్రం

న్యూయార్క్ : భారతీయల్లో అమెరికా డాలర్ కలలు క్రమేసి చెదురుతున్నాయి. అమెరికా డొనాల్డ్ ట్రంప్ వలసల నిరోధం పేరిట వరుసగా జారీ చేసే కార్యనిర్వాహక ఆదేశాలతో అమెరికన్ భారతీయుల్లో ఆందోళన పాదుకొంది. అమెరికా కాంగ్రెస్ జారీ చేసే వీసా ఉత్తర్వులు మరింత కఠినంగా ఉంటాయనే సమాచారమూ ఆందోళన మరింతగా పెరగడానికి దోహదడింది. న్యాయస్థానాల జోక్యంతో స్వల్ప విరామం లభించిందని ఊపిరి తీసుకుంటున్న సమయంలో ఒక్క సారిగా కాన్సాస్ విషాదం చోటు చేసుకుంది. ముస్లింలపై వివక్షతో కూడుకున్న విద్వేషాగ్ని ఉత్తర్వుల జారీకి ట్రంప్ కనబరిచిని తొందరపాటుకు అమెరికా నౌకాదళ మాజీ ఉద్యోగి ఆడమ్ పూరింటన్‌ను ఉన్మాదిగా మార్చాయి. దీని ఫలితమే పూరింటన్ తుపాకీ కాల్పుల విషాదం. ఈ విషాదం ఘటనలో తెలుగు ఇంజనీరు కూచిభొట్ల శ్రీనివాస్ (32) మరణించిన సంగతి తెలిసిందే. నౌకాదళ మాజీ ఉద్యోగిని ఉన్మాదిని మార్చాయి. దీని ఫలితంగా 32ఏళ్ల కాల్పుల సమయంలో అలోక్ మాడసాని అనే సహచరుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద దుర్ఘటన తరువాత అమెరికాలోని భారతీయులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో ఊహకే అందరని అనిశ్చితి నెలకొంది. అదే సమయంలో స్వదేశం వచ్చేయాలనే కుటుంబాల వేదుకోళ్లూ ఎక్కువవుతున్నాయి. అనిశ్చితి నెలకొంది. అదే సమయంలో స్వదేశం వచ్చేయాలనే కుటుంబాల లేక స్వదేశం వెళ్లిపోదామా?అనే ఆలోచనలో ఎక్కువ మంది ఫేస్‌బుక్, ట్విటర్ వంటి సామాజిక మాధ్య మాల్లోనూ ఒకరితో ఒకరు పలుకరించుకునే తీరులోనూ అనిశ్చితి కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. అమెరికా సిటిటన్‌షిప్, ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ గణాంకాల ప్రకారం అమెరికాకు హెచ్1బీ వీసా కోసం ఏటా కనీసం మూడు లక్షల మంది దరఖాస్తు చేస్తుంటారు. ఏటా కనీసం 85 వేల వరకు హెచ్1బీ వీసాలను అమెరికా జారీ చేస్తూ ఉంటుంది. కొన్ని సార్లు లాటరీ పద్ధతిలోనూ వీసాల జారీని చేపట్టడం గమనార్హం. అమెరికాలోని సాఫ్ట్‌వేర్ పరిశ్రమలో అధిక భాగం భారతీయులే ఉన్నారు. 2014లో అమెరికా జారీ చేసిన హెచ్ 1బీ వీసాల్లో 65 శాతం వీసాలను భారతీయులకే జారీ చేసింది. ఇందులో 72 శాతం మంది 25 నుంచి 34 మధ్య వయసులోని యువకులే ఉన్నారు. సగానికిపైగా ఉన్నత పట్టభద్రులుగాను ఉండటం విశేషం. అమెరికాలోని ఫ్లోరిడా కేంద్రంగా పని చేసే ఒక ప్రముఖ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేసే 34 ఏళ వెంకటేష్ తన ఇంటిపేరును, పని చేసే కంపెనీ అమెరికాలోని భారతీయులు ఎంతటి అనిశ్చితిని, భయాందోళనలు ఎదుర్కొనేదీ తెలుస్తోంది. వైద్యురాలైన భార్యతో సహా స్వదేశం (భారత్) కు తిరిగి వెళ్లిపోవాలనే ఆలోచనకు అమకూ, తమ కుటుంబ పెద్దలకూ మనశ్శాంతిని చేకూరుస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కాన్సాస్ విషాద ఘటన తమలో అభద్రతను ఆందోళనను అనిశ్చితిని తీవ్రం చేశాయనేది అమెరికాలోని అత్యధిక భారతీయుల మనోగతంగా ఉంది. ఇక్కడి ఏ ఒక్క భారతీయ కుటుంబాన్ని కదలించినా ఇదే భాయాలు, అనిశ్చితి వెలుగు చూస్తున్న పరిస్థితి ఉంది.

భూములు లాక్కున్నారు సరే.. పరిశ్రమలేవీ బాబూ ?

- సాగులేదు అభివృద్ధి లేదు
- వృథాగా వ్యవసాయ భూములు
- పరిశ్రమలు రాక నిరుద్యోగుల నిరాశ

నెల్లూరు : వ్యవసాయ భూముల్ని పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టేందుకు ఉద్దేశించే ప్రత్యేక ఆర్థిక మండళ్లు (ఎస్ఈజడ్) ఏర్పాటయ్యాయి. ఈ ఆర్థిక మండళ్ల కోసం సేకరించిన భూముల్లో లక్ష్యం నెరవేరిందా, పరిశ్రమలు ఏర్పడ్డయా అన్న విషయాన్ని పరిశీలిస్తే కళ్లుచెదిరే వాస్తవాలు వెల్లడయ్యాయి. రైతుల నుంచి వేలాది ఎకరాల భూమిని సెజ్‌ల కోసం సేకరించిన భూమిని అటు పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడకుండా ఇటు రైతులు వాటిని సాగుచేసుకోనివ్వకుండా నిరుపయోగంగా పడివున్నాయి. పారిశ్రామిక అవసరాలకు సేకరించే సమయంలో లక్షలాది మంది స్థానికులు ఉద్యోగావకాశాలు వస్తాయని ప్రభుత్వం చెప్పినా వాస్తవానికి పరిశ్రమల స్థాపన జరగకపోవడంతో నిరుద్యోగులు నిరాశలో కొట్టుమిట్టాడుతున్నాయి. అటు ఈ భూములు రైతులకు ఉపయోగపడక, పరిశ్రమల రాక నిరుద్యోగుల్ని నిరాశలో ముంచెత్తే ఈ సెజ్‌ల భూములు నిరుపయోగంగా పడివున్నాయి. ఉదాహరణకు దశాబ్దకాలం క్రితం నెల్లూరు జిల్లాలో పారిశ్రామికవేత్తల నుద్దేశించి సెజ్‌లు ఏర్పాటుచేయడం కోసం అధికారయంత్రాంగం 38,500 ఎకరాలను రైతుల నుంచి సేకరించింది. 88,500 ఎరకాలైతే సేకరణ చేశారుగానీ, కేవలం 30 వేల ఎకరాల్లోనే పరిశ్రమలు స్థాపించారు. ఈ దశలో కొంతమంది పారిశ్రామికవేత్తలకు సుమారు 2,500 ఎకరాలను అతి తక్కువ ధరకు అంటే ఎకరా రెండు లక్షలకు మించకుండా రాష్ట్రప్రభుత్వం కట్టబెట్టింది. ఆ భూముల్ని బ్యాంకులకు చూపించి 2,500 కోట్ల రూపాయల రుణం వ్యాపారవేత్తలు పొందారు. జిల్లాల్లో ప్రత్యేక పారిశ్రామిక జోన్లు ఏర్పాటుచేయాలని అధికారులను కొంతమంది పెట్టుబడిదారులు కోరారని విశ్వసనీయ వర్గాల కథనం. పారిశ్రామిక ఉత్పత్తుల కోసం కేటాయించిన ఈ సెజ్‌ల్లో భూమిని నామమాత్రపు ధరలకు తీసుకున్న అనేక పారిశ్రామిక సంస్థలు వాటిని రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం వినియోగిస్తున్నా యన్నది బహిరంగ రహస్యంగా మారింది.ఈ భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టి కొంతమంది పారిశ్రామికవేత్తలు రుణాలు పొందినట్లు తెలిసింది. సెజ్‌లకు కేటాయించిన భూములకు సంబంధించిన వాస్తవ స్థితిని తెలియజేయాలని ఇటీవల కేంద్రాన్ని, ఏడు రాష్ట్రా ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ భూములను ఏ విధంగా పెట్టుబడుదారులు వినియోగిస్తారో తెలియని అయోమయ స్థితిలో ప్రభుత్వ యంత్రాంగం ఉన్నది. నెల్లూరు జిల్లాలో మొత్తం 12 సెజ్‌లకు చిన్నతరహా రైతుల నుంచి సేకరించిన భూముల్ని కేటాయించారు. అంతేగాక, కోస్తాప్రాంతంలో థర్మల్ కర్మాగారం నిర్మాణానికి 33 వేల ఎకరాలను జిల్లా యంత్రాంగం సేకరించింది. ఈ కార్మాగారం ద్వారా 33 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. కృష్ణపట్నం రేపు, ఇతర పారిశ్రామిక అవసరాలకు దాదాపు 40 వేల ఎకరాలను కేటాయించారు. కృష్ణా కిసాన్ సెజ్‌కు కేటాయించిన 2700 ఎకరాల్లో కేవలం మూడు, నాలుగు వందల ఎకరాలు మాత్రమే వినియోగంలో ఉన్నాయి.

నాలుగువేల మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యంతో నిర్మాణంలో ఉన్న కృష్ణపట్నం ఆల్ట్రామెగా థర్మల్ ప్రాజెక్టు కోసం ముత్తకూరు మండలంలో రిలయన్స్ గ్రూప్‌నకు రెండువేల ఎకరాలు 2011లో కేటాయించినప్పటికీ రిలయెన్స్ గ్రూప్ ప్రాజెక్టు నిర్మాణంలో ఆశక్తత వ్యక్తంచేస్తోంది. ఇందుకు

ఈగ, మిర్చిలకు నందుల పంట

సినీ రంగానికిచ్చే నంది అవార్డులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. 2012,2013 నంది అవార్డుల ఎంపిక కమిటీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కలిసి నివేదికను అందజేసింది.2012 సంవత్సర కమిటీ కోడి రామకృష్ణ చైర్మన్లుగా వ్యవహరించారు. అమరావతిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సినీనటి జయసుధ అవార్డులను ప్రకటించారు.2012 సంవత్సరానికి గాను 'ఈగ', 2013 సంవత్సరానికి గాను 'మిర్చి' ఉత్తమ చిత్రాలుగా ఎంపికయ్యాయి.
– రాజధాని ప్రతినిధి, అమరావతి

- 2012, 2013 అవార్డుల ప్రకటన
- ఉత్తమ నడుటు : నాని, ప్రభాస్
- ఉత్తమ నటీమణులు : సమంత, అంజలి పాటిల్
- అత్యధిక అవార్డులు దక్కించుకున్న మిర్చి

2012 నంది అవార్డులు

ఉత్తమ చిత్రం : ఈగ
ద్వితీయ ఉత్తమ చిత్రం : మిణుగురులు
తృతీయ ఉత్తమ చిత్రం : మిథునం
ఉత్తమ దర్శకుడు : రాజమౌళి (ఈగ)
ఉత్తమ నటుడు : నాని (ఎటో వెళ్లిపోయిందిమనసు)
ఉత్తమ నటి : సమంత (ఎటో వెళ్లిపోయిందిమనసు)
ఉత్తమ విలన్ : సుదీప్ (ఈగ)
ఉత్తమ సహాయ నటుడు : అజయ్ (ఇష్క్)
ఉత్తమ సహాయ నటుడు : శ్యామలా దేవి (వీరంగం)
ఉత్తమ హాస్య నటుడు : రఘుబాబు (ఓనమాలు)
ఉత్తమ బాలనటుడు : దీపక్ సరోజ్ (మిణుగురులు)
ఉత్తమ బాలనటి : రుషిణి (మిణుగురులు)
ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు : అయోధ్య కుమార్ (మిణుగురులు)
ఉత్తమ స్క్రీన్ ప్లే రైటర్ : రాజమౌళి (ఈగ)
ఉత్తమ కథా రచయిత : అయోధ్య కుమార్ (మిణుగురులు)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్ : సెంథిల్ కుమార్ (ఈగ)
ఉత్తమ గాయకుడు : శంక్ మహదేవన్ (ఒక్కడే దేవుడు, శిరిడి సాయి)
ఉత్తమ గాయని : గీతామాధురి (యదలో నదిలాగ, గుడ్ మార్నింగ్)
ఉత్తమ కళాదర్శకుడు : ఎస్ రామకృష్ణ (అందాల రాక్షసి)
ఉత్తమ కొరియోగ్రాఫర్ : జానీ (జులాయి)
ఉత్తమ ఆడియో గ్రాఫర్ : కడియాల దేవీ కృష్ణ (ఈగ)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ : తిరుమల (కృష్ణం వందే జగద్గురుం)
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ : చిట్టూరి శ్రీనివాస్ (కృష్ణ వందే జగద్గురుం)
ఉత్తమ మాటల రచయిత : తనికెళ్ల భరణి (మిథునం)
ఉత్తమ గేయ రచయిత : అనంత్ శ్రీరామ్ (ఎటో వెళ్లిపోయింది మనసు)
ఉత్తమ సంగీత దర్శకుడు : కీరవాణి (ఈగ), ఇళయరాజా (ఎటో వెళ్లిపోయింది మనసు)
ఉత్తమ ఎడిటర్ : కోటగిరి వెంకటేశ్వరరావు (ఈగ)
ఉత్తమ ఫైట్స్ : గణేష్ (ఒక్కడినే)
ఉత్తమ డబ్బింగ్ ఆర్టిస్ట్ మేల్ : ఆర్ సీఎం రాజు (మిణుగురులు)
ఉత్తమ డబ్బింగ్ ఆర్టిస్ట్ ఫిమేల్ : శిల్ప (వీరంగం)
ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ : మకుట వివిఫ్ఎక్స్ (ఈగ)
ఎస్వీ రంగారావు పురస్కారం : ఆశిష్ విద్యార్థి (మిణుగురులు)

2013 నంది అవార్డులు

ఉత్తమ చిత్రం : మిర్చి
రెండో ఉత్తమ చిత్రం : నా బంగారు తల్లి
మూడో ఉత్తమ చిత్రం : ఉయ్యాల జంపాల
ఉత్తమ కుటుంబ కథా చిత్రం : సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు
అత్యంత ప్రజాదరణ పొందిన చిత్రం : అత్తారింటికి దారేది
ఉత్తమ హీరో : ప్రభాస్ (మిర్చి)
ఉత్తమ హీరోయిన్ : అంజలి పాటిల్ (నా బంగారు తల్లి)
ఉత్తమ దర్శకుడు : దయా కొడవగంటి (అలియాస్ జానకి)
ఉత్తమ సంగీత దర్శకుడు : దేవీ శ్రీ ప్రసాద్ (అత్తారింటికి దారేది)
ఉత్తమ సహాయ నటుడు : ప్రకాష్ రాజ్ (సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు)
ఉత్తమ సహాయ నటి : నదియా (అత్తారింటికి దారేది)
ఎస్వీ రంగారావు పురస్కారం : నరేష్ (పరంపర)
ఉత్తమ హాస్య నటుడు : తాగుబోతు రమేష్ (వెంకటాద్రి ఎక్స్ ప్రెస్)
ఉత్తమ విలన్ : సంపత్ రాజ్ (మిర్చి)
ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు : కొరటాల శివ (మిర్చి)
ఉత్తమ మాటల రచయిత : త్రివిక్రమ్ శ్రీనివాస్ (అత్తారింటికి దారేది)
ఉత్తమ గేయ రచయిత : సిరివెన్నెల సీతారామశాస్త్రి (మరి అంతగా, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు)
ఉత్తమ గాయకుడు : కైలాష్ ఖేర్ (పండుగలా దిగివచ్చాడు, మిర్చి)
ఉత్తమ గాయని : కల్పన (నవ మూర్తులైనట్టి, ఇంటింటా అన్నమయ్య)
ఉత్తమ ఎడిటర్ : ప్రవీణ్ పూడి (కాళీచరణ్)
ఉత్తమ బాల నటుడు : విజయ సింహారెడ్డి (భక్త సిరియాల్)
ఉత్తమ బాల నటి : ప్రణవి (ఉయ్యాల జంపాల)
ఉత్తమ స్క్రీన్ ప్లే రచయిత : ఇంద్రగంటి మోహన కృష్ణ (అంతకు ముందు ఆ తరువాత)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్ : మురళీమోహన్ రెడ్డి (కమలతో నా ప్రయాణం)
ఉత్తమ కళాదర్శకుడు : ఏ ఎస్ ప్రకాష్ (మిర్చి)
ఉత్తమ కొరియోగ్రాఫర్ : శేఖర్ వీజే (గుండెజారి గల్లంతయ్యిందే)
ఉత్తమ ఆడియోగ్రాఫర్ : ఇ రాధాకృష్ణ (బసంతి)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ : తిరుమల (శ్రీ జగద్గురు ఆది శంకరాచార్య)
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ : శివకుమార్ (శ్రీ జగద్గురు ఆది శంకరాచార్య)
ఉత్తమ ఫైట్ మాస్టర్ : వెంకట్ నాగ్ (కాళీచరణ్)
ఉత్తమ డబ్బింగ్ ఆర్టిస్ట్ మేల్ : పీజే రవి (బొమన్ ఇరానీ, అత్తారింటికి దారేది)
ఉత్తమ డబ్బింగ్ ఆర్టిస్ట్ ఫీ మేల్ : మిత్రా వరుణ మహి (ఉయ్యాల జంపాల)
ఉత్తమ విజువల ఎఫెక్ట్స్ : యతిరాజ్ (సాహసం)

భిక్షాటనకు బాల్యం బలి కారాదు : మేనక

న్యూఢిల్లీ : భిక్షాటనకు బాల్యం బలికావడాన్ని సహించబోమని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రి మేనకా గాంధీ స్పష్టంచేశారు. తాను భిక్షాటనకు వ్యతిరేకం కాదని, పిల్లలు బిచ్చమెత్తుకుంటే మాత్రం ఊరుకునేది లేదని ఆమె అన్నారు. ఈ విషయమై త్వరలోనే పోలీసు కమిషనర్‌తో చర్చించనున్నట్టు తెలిపారు. ఎఫ్ఐసీసీఐ మహిళా సంస్థ నిర్వహించిన సదస్సులో మేనకాగాంధీ మాట్లాడారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) వీధి బాలలకు సంబంధించి 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్' (ఎస్ఓపీ)ని ఇటీవల విడుదల చేసింది. అందులో వీధి బాలల పునరద్ధరణ, పునరావాస కార్యాచరణను వివరించింది. వీధి బాలలను రక్షించేందుకు తొలుత ఎన్జీవో 'చైల్డ్‌లైన్'ను సంప్రదించాలని సూచించింది. ఎన్జీవో రక్షించే పిల్లలను బాలల సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ) ఎదుట ప్రవేశపెడతారు. ఆపై సీడబ్ల్యూసీ వారికి తాత్కాలిక రక్షణ కల్పించడంపై మధ్యంతర ఆదేశాలు జారీచేసి పిల్లల్ని దగర్లోనా బాలల సంక్షేమ ఇన్‌స్టిట్యూట్ (సీసీఐ)కి పంపుతుంది. కొన్ని సందర్భాల్లో వారి కుటుంబ సభ్యులు సంప్రదించేంత వరకు బాలలను తగు వ్యక్తి పర్యవేక్షణలో ఉంచుతుంది. ఈ బాలలకు ఆధార్ కార్డు,బ్యాంకు ఖాతా, ఆరోగ్య బీమాతో పాటు విద్య, పోషకాహారం, వైద్యపరమైన అవసరాల దృష్ట్యా ఆర్థిక సాయాన్ని అందజేయాలన్నది ఎస్ఓపి ఉద్దేశం, వీధి బాలలకు సంబంధించి మార్గదర్శకాలు రూపొందించేందుకు ఎన్‌సీపీసీ ఆర్‌కి సహకరించిన ఎన్జీవో 'సేవ్ ది చిల్డ్రన్' ఆరు నెలల్లో ఢిల్లీలోని 50 వేల వీధి బాలలకు ఆధార్ కార్డులు ఇప్పించినట్టు తెలిపింది.

మహిళా భద్రతే ప్రధానంగా కేరళ బడ్జెట్

- ప్రజల ముందుకు లైంగిక నేరగాళ్లను తెచ్చేందుకు ప్రతిపాదన
- మహిళల కోసం ప్రత్యేక విభాగం
- మొత్తం కేటాయింపుల్లో 11.5 శాతం మహిళాభివృద్ధికే

తిరువనంతపురం : కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం 17-18 సంవత్సరానికి సాధారణ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. మహిళల భద్రతకు ఈ బడ్జెట్ అధిక ప్రాధాన్యత ఇచ్చింది లైంగిక నేరాలకు పాల్పడిన వారిని సిగ్గుపడే విధంగా ప్రజల ముందుకు తీసుకురావాలని బడ్జెట్ ప్రతిపాదించింది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి టీఎం థామస్ ఇశాక్ బడ్జెట్ ప్రతిపాదనలను అసెంబ్లీకి సమర్పిస్తూ "మహిళలపై దాడులు మలయాళీ జాతీయులకు అవమానకర"గా పేర్కొన్నారు. మలయాళ నటిపై లైంగిక వేధింపుల నేపథ్యంలో మహిళా భద్రతపై మరోసారి ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాల్సి వచ్చిందని అన్నారు. మహిళలపై దాడులను నిరోధించేందుకు, వారి పునరావాసానికి వివిధ పథకాల కోసం రూ. 68 కోట్లను కేటాయించినట్టు ఇసాక్ తెలిపారు. ఇందులో రూ. 12 కోట్లు పింక్ కంట్రోల్ రూమ్', స్వీయరక్షణ శిక్షణ కోసం రూ. 12 కోట్లు అవగాహన ప్రచారం కోసం రూ. 34 కోట్ల రూపాయలు ఉన్నాయి. ఆశ్రయ గృహాలు, స్వల్పకాలం ఉండే గృహాలు, సంక్షోభ నివారణ కేంద్రాల కోసం రూ. 12 కోట్లను, రెండు ఓస్ఓఎస్ సమూనా ఇళ్ల కోసం 3 కోట్ల రూపాయలను కేటాయించనున్నామని ప్రకటించారు. ఒక మహిళా పోలీసు బెటాలియన్ ఏర్పాటు చేస్తామని తాలుకా, పంచాయతీ స్థాయిలో మహిళా పోలీసు అధికారులు సందర్శించి మహిళా పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేస్తారని, నేరస్థులు సిగ్గుపడే విధంగా మహిళలపై దాడులకు పాల్పడే వారిని ప్రజల ముందుకు తీసుకురావాలని బడ్జెట్‌లో ఇసాక్ ప్రతిపాదించారు. బాధితుల రక్షణ, వేగిరమే పునరావాసం కల్పించేందుకు రూ. 5 కోట్లు కేటాయిస్తున్నామని తెలిపారు. 2017-18 సంవత్సరంలో మహిళల కోసం ప్రత్యేక విభాగాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం సామాజిక న్యాయ విభాగం క్రింద అమలు అవుతున్న మహిళలకు సంబంధించిన వివిధ సామాజిక పథకాలను కొత్త విభాగానికి బదిలీ చేస్తామని తెలిపారు. వచ్చే ఏడాది బడ్జెట్‌కు లింగ ఆడిట్ నివేదికను కూడా జతచేయనున్నామని తెలిపారు. 104 పథకాలకు సంబంధించి మొత్తం కేటాయింపులు రూ. 13,400 కోట్లు. అందులో రూ. 1,266 కోట్లను ప్రత్యేకించి మహిళల కోసమే కేటాయించారు. మొత్తం ప్రణాళికా కేటాయింపులలో 11.5 శాతాన్ని మహిళాభివృద్ధి కోసమే కేటాయించామని ఇసాక్ తెలిపారు.

సీఎస్‌గా అజేయ కల్లం

రాజధాని ప్రతినిధి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ అధికారి అజేయ కల్లం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీఎస్‌గా వ్యవహరించిన సత్యప్రకాష్ టక్కర్ విధుల నుంచి రిలీవ్ అవుతూ కల్లంకు బాధ్యతలు అప్పగించారు. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో కల్లంతో పాటు మరో నెలరోజుల్లో కొత్త సీఎస్‌గా బాధ్యతలు చేపట్టనున్న దినేశ్‌కుమార్‌ను, రిటైరైన ఎస్‌పీ టక్కర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సత్కరించారు.

బాధ్యతల స్వీకరణ, పదవీ విరమణ ఇక్కడే.....

బాధ్యతల స్వీకరణ, పదవీ విరమణ రెండూ ఇదే ప్రాంతంలో జరగడం మరిచిపోలేనని ఎస్పీ టక్కర్ చెప్పారు.కృష్ణాజిల్లా మచిలీపట్నంలో తాను సివిల్ సర్వీసెస్ తొలి బాధ్యతలు చేపట్టానని, సీఎస్‌గా ఇదే ప్రాంతంలోని వెలగపూడిలో పదవీ విరమణ చేశానని తెలిపారు. తన కుటుంబం పాకిస్థాన్ నుంచి అన్నీ వదులుకుని భారత్‌కు వచ్చేసిందని, విధినిర్వహణ కోసం తాను హైదరాబాద్ నుంచి వెలగపూడికి వచ్చానని చెప్పారు. అందరి సహకారంతో 34 ఏళ్ల సర్వీసును పూర్తిచేశానన్నారు.

మొదలైన కష్టాలు

మార్చినెల ఆరంభంలోనే నగర వాసులకు తాగునీటి సమస్య మొదలైంది... కనీసం ఇంటి అవసరాలకు కూడా నీరు లేక పోవడంతో ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.... నగరానికి ఏటా వేసవిలో తాగునీరు సమస్య ఉత్పన్నం అవుతోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

- నగరవాసులను వేధిస్తున్న మంచినీటి కొరత
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- రూ.500 నుంచి రూ.1000 చెల్లించి ట్యాంకర్ల ద్వారా కొనుగోలు
- వారంరోజుల్లో గుంటూరు ఛానల్ మూసివేత
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం : నగరపాలకసంస్థ కమిషనర్ నాగలక్ష్మి

రాజధాని ప్రతినిధి ;(గుంటూరు) : తాగునీటి కోసం నగర వాసులు అల్లాడుతున్నారు. ప్రధానంగా శివారు ప్రాంతాలలో తాగునీరు. కోసం ఇబ్బందులు పడుతున్నారు. భూగర్భజాలాలు అడుగంటిపోవడంతో నీటి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని కొనుగోలు చేస్తున్నారు. కాలువ ఆధునికీకరణ నిమిత్తం మరో వారంరోజుల్లో గుంటూరు ఛానల్‌ను మూసివేస్తున్నారు. రాజధాని పరిధిలో ఉన్న గుంటూరు నగరం రోజురోజుకు విశాలంగా విస్తరిస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే జనంతో కిటకిటలాడుతుంది. ప్రస్తుతం నగరంలో దాదాపు తొమ్మిదిలక్షల జనాభా ఉంది. జనాభాకు తగ్గట్టుగా తాగునీటి వనరులు అందుబాటులో లేవు. వేసవి కాలం వచ్చిందంటే తాగునీటి ఎద్దడి వేధిస్తోంది. ప్రధానంగా గోరంట్ల, అన్నపూర్ణనగర్ , చంద్రమౌళినగర్, స్వర్ణభారతీనగర్, ఆటోనగర్, ప్రశాంతినగర్, టెలికం నగర్‌లలో దాదాపు భూగర్భజలాలు అడుగంటాయి. సుమారుగా 300 నుంచి 500 మీటర్లలోతుకు మోటార్లు వేసినా నీరు అందడంలేదు. దీనివలన ప్రజలు నగరపాలకసంస్థకు రూ.500 నుంచి రూ.1000 చెల్లించి తాగునీటి ట్యాంకర్లు ద్వారానీటిని తెచ్చుకుంటున్నారు. రూ.500లకు ఐదువేలలీటర్లు ట్యాంకర్, రూ. 1000కు పదివేలలీటర్ల ట్యాంకు ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. నగర శివారులో భవనాల్లో ఉండే ప్రజల పరిస్థితి అధ్వానంగా ఉంది. కనీసం నిత్యం వాడుకునే నీరు కూడా దొరకడం లేదని ఆవేదన చెందుతున్నారు. దీనివలన రెండురోజులకు ఒకసారి ఇస్తున్నారని, అదీ కేవలం 30 నిమిషాలు మాత్రమే ఇవ్వడంతో మంచినీరు కూడా కొనుగోలు చేస్తున్నామని నగరవాసులు వాపోతున్నారు. తాగునీరు టిన్ను 20 లీటర్లు రూ.20 నుంచి రూ.25 పెట్టి కొనుగోలు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గోరంట్లలో ట్యాంకర్ నీటిని పంపులో నింపుతున్న మహిళ

వారంరోజుల్లో గుంటూరు ఛానల్ మూత

గుంటూరు ఛానల్‌లో ఉన్న సిల్ట్, తూటికాడ వంటిని తొలగించి ఆధునికీకరణ పనులు చేసేందుకు మరొ వారంరోజులలో నీటి సరఫరా నిలుపుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నగరానికి తాగునీరు సమస్య పొంచి ఉంది. అయితే ప్రకాశం బ్యారేజీ వద్ద అత్యధిక సామర్థ్యం ఉన్న ఇంజన్లు పెట్టి పైపులైన్ల ద్వారా తక్కెళ్లపాడు ట్యాంకుకు తరలించి అక్కడ నుంచి నగరానికి తాగునీరు సరఫరా చేస్తామని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది కూడా ఇలాగే సరఫరా చేశారు. కానీ దాదాపు ఐదురోజులు మోటార్లు మరమ్మతులకు అప్పట్లో జనం తాగునీరు కోసం అల్లాడిపోయారు. ఈ నేపథ్యంలో అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు సంగం జాగర్లయూడి కెనాల్ నుంచి గుంటూరులో కొంత భాగంకు తాగునీరు సరఫరా అవుతుంది. అయితే దీని నుంచి సరఫరా వచ్చేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవు.

శాశ్వత పరిష్కారం చూపాలి

గుంటూరు నగరానికి ఏటా వేసవిలో తాగునీరు సమస్య ఉత్పన్నం అవుతుంది. వేసవిలో దాదాపు నాలుగునెలలుపాటు తాగునీరుకు జనం అల్లాడిపోతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కృష్ణా నది నుంచి నీటిని గుంటూరుకు నిరంతరం తీసుకురావాలని ఆ నీటిని శుద్ధి చేసి తాగునీరు సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మోటార్ల ద్వారా నీటి తరలింపు : కమిషనర్ నాగలక్ష్మి

మరో వారం రోజుల్లో గుంటూరు ఛానల్ మూసివేస్తున్నారు. దీనివలన నగరంలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రకాశం బ్యారేజీ నుంచి మోటార్లు ద్వారా నీటిని తోడి పైపులైన్ల ద్వారా తక్కెళ్లపాడు వాటర్ ప్లాంట్‌కు తరలిస్తాం. అక్కడ శుద్ధిచేసిన జలాలను గుంటూరు నగరానికి అందిస్తాం. ఇప్పటికే ట్రయల్‌రన్ కూడా చేశాం. గుంటూరు ఛానల్ మూసిన వెంటనే కృష్ణా నది నుంచి నీరు తక్కెళ్లపాడు తరలిస్తాం. అలాగే వేసవి తాగునీటి సరఫరా కోసం రూ.2 కోట్లుతో ప్రణాళిక రూపొందించాం. ఇప్పటికే ఇది అమలులోకి వచ్చింది. శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ నాగలక్ష్మి తెలిపారు.

ప్రజా ప్రతినిధులు ఆదాయపు అఫిడవిట్లు

- పదిలక్షల ఆదాయం లేనివారు 72 శాతం ...
- 35 శాతం మంది ఆదాయం రెండున్నర లక్షలేనట
- వీరిలో బీజేపీ సభ్యులే అధికం

అబద్ధాల పుట్ట

రాజధాని : ప్రధాని నరేంద్ర మోడీ సందర్భం వచ్చినప్పుడూ, లేనప్పుడూ తరచూ చేసే హెచ్చరిక ఏమంటే "పన్ను ఎగవేస్తే శిక్ష తప్పదు! ఆదాయం పన్ను ఎగవేతదారులపై ప్రస్తుతం దృష్టి పెట్టాం. దొరికితే ఇక అంతే! – అవును... దేశంలో ఆదాయపు పన్ను చెల్లించే వారి సంఖ్య తక్కువగా ఉంటోంది. ఎక్కువగా నిజాయితీగా ప్రభుత్వోద్యోగులే ఆదాయం పన్ను చెల్లిస్తున్నారు. ప్రైవేటు, రాజకీయనాయకులు, వ్యాపారులు అధికశాతం మంది పన్ను చెల్లించకుండా తప్పించుకుంటున్నారని, ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఆవేదన! అయితే దేశంలో పార్లమెంటు సభ్యులతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజాప్రతినిధులు ప్రకటించిన ఆదాయం వివరాలు ప్రజల్ని ఆశ్చర్యాల్లో పడేసేలా ఉన్నాయి. ఏడాది పది లక్షలకు మించి తమకు ఆదాయం లేదని ప్రజాప్రతినిధులు ప్రకటించిన అఫిడవిట్లు తెలియజేస్తున్నాయి. ఇలా ప్రకటించిన వారిలో భారతీయ జనతాపార్టీ (బీజేపీ) ప్రతినిధులే అత్యధిక శాతం ఉన్నారు. మొత్తం 4,900 అఫిడవిట్లలో 72 శాతంలో బీజేపీ నేతలే అగ్రస్థానంలో ఉన్నారు. ఈ శాతంలో కొద్దమంది కాంగ్రెస్ నేతలు కూడా ఉన్నారు. తమకు ఏడాదికి పదిలక్షలకు మించి ఆదాయంలేదని ఈ 72 శాతం మంది అఫిడవిట్లు సమర్పించారు. 35 శాతం మందికి రెండున్నర లక్షలకు మించని ఆదాయం దేశవ్యాప్తంగా ప్రజాప్రతినిధులు సమర్పించిన అఫిడవిట్లలో 75 శాతం మంది తమకు ఏడాది పదిలక్షల రూపాయల ఆదాయం ఉందని తెలిపారు. 35 శాతం మంది తమ ఏడాది రెండున్నర లక్షలకు మించి లేదని ప్రకటించగా, నలభై శాతం మంది తమ ఆదాయం లోపు ఉందని తెలిపారు. వీరిలో 24 శాతం మంది అంటే 1.140 మంది ఆదాయం పన్ను నుంచి మినహాయింపు కూడా పొందారు. ఏ ఆర్థికమంత్రి అయితే అధికులు పన్ను తక్కువ చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారో... అదే ఆర్థికమంత్రి మాటమాటల్లో "మాలో చాలమంది ఆదాయం పన్ను పరిధిలోకి రావడం లేదనే విషయాన్ని మనం గ్రహించాలి. అన్నారంటే ప్రజాప్రతినిధుల్లో ఆదాయం పన్ను విషయంలో దాగున్న వాస్తవాలు తెలుస్తాయి.

62 శాతం ఎంపీల ఆదాయం పది లక్షల కంటే తక్కువే!

2015-16 సంవత్సరంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రకటించిన ఆదాయానికి కుటుంబ సభ్యుల ఆదాయం (స్థిర చరాస్తులు) కూడా కలిపితే 62 శాతం మంది ప్రజాప్రతినిధుల ఏడాది ఆదాయం పది లక్షల కంటే తక్కువగా ఉంది. 1843 మంది ప్రజాప్రతినిధుల కుటుంబసభ్యుల ఆదాయం సహా మొత్తం పదిలక్షల రూపాయలకు మించి ఉన్నది. పదిలక్షల రూపాయలకు మించి ఆదాయం ఉందని ఆదాయపు పన్ను రిటర్న్స్‌లో 25 మంది ప్రజాప్రతినిధులు తెలిపారు. లోక్‌సభ సభ్యుల్లో 63శాతం మంది తమ ఆదాయం పదిలక్షల రూపాయలకు తక్కువగా ఉందని ప్రకటించగా రాజ్యసభ సభ్యుల్లో 13 శాతం మంది మాత్రమే పదిలక్షల రూపాయల కంటే ఆదాయం తక్కువగా ఉందని పేర్కొన్నారు. శాసనసభ్యుల విషయానికొస్తే, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన 80 శాతం ఎమ్మెల్యేలు తమకు పది లక్షల రూపాయల కంటే తక్కువ ఆదాయం ఉందని ప్రకటించారు. 35 శాతం మంది తమ ఆదాయం రెండున్నర లక్షల కంటే తక్కువని, అందువల్ల ఆదాయపుపన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. ఇందుకు వివిధ కారణాలు చూపారు. తాము రైతులమని, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలు ప్రకారం (అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, నాగాలాండ్, మిజోరం, త్రిపుర ప్రాంతాలకు చెందినివాంమని) మినహాయింపు ఇవ్వాలని పేర్కొన్నారు. దేశంలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనా వారిలో సగంమంది తమ ఆస్తులను రెండుకోట్లుగా, 28 శాతం మంది ఐదు కోట్ల రూపాయలుగా తెలిపారు. 70 శాతం మంది పార్లమెంట్ సభ్యులు తమ ఆదాయం కోటి రూపాయలుగా చెప్పారు. ప్రజాప్రతినిధులు పేర్కొన్న ఆస్తుల వాస్తవాలను తేల్చేందుకు చట్టప్రకారం పరిశీలనే ఉండడం లేదు. ప్రజలు దీనిపై దృష్టించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అమరావతి సంపద సృష్టిస్తుందా ?: జస్టిస్ స్వతంత్రకుమార్

న్యూఢిల్లీ : రాజధాని నగరం ఆదాయాన్ని సృష్టిస్తుందా అని జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్‌జీటీ) ప్రశ్నించింది. అమరావతి నగర నిర్మాణాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ స్వతంత్ర్యకుమార్ నేతృత్వంలోని ఎన్‌జీటీ ధర్మాసనం విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ఏకే గంగూలీ తుది వాదనలు ప్రారంభించారు. వీలైనంత త్వరగా రాజధానిని నిర్మించుకోవాలన్నదే ప్రజల , ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్ నుంచి పరిపాలన సాగించేందుకు అవకాశమున్నా.. ఆ నగరంపై ఆంధ్ర ప్రభుత్వానికి పరిపాలనా అధికారం లేదని, అక్కడ పెట్టే పెట్టుబడి మొత్తం తెలంగాణకే వెళ్తుందని, చేసే ఖర్చులకు సంబంధించిన పన్నులు, ఆదాయం కూడా ఆ రాష్ట్రానికే వెళ్తాయని, ఈ నేపథ్యంలో ఎంత త్వరగా అక్కడి నుంచి అమరావతికి మారితే అంత మంచిదని వివరించారు. హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఉమ్మడి ప్రభుత్వం రుణాలు తీసుకుందని, అయితే.. అప్పులు, ఆస్తుల విభజనలో హైదరాబాద్‌కు చేసిన అప్పుల



భారం కూడా ఏపీపైనే పడిందని, దాని ఆదాయం మాత్రం తెలంగాణకు వెళ్తోందని చెప్పారు. రాజధాని కారణంగా ఆదాయం వస్తుందా అని జస్టిస్ స్వతంత్ర కుమార్ ప్రశ్నించారు. ఏపీలో పారిశ్రామిక నగరం ఏదని ప్రశ్నించగా..... ప్రస్తుతం విశాఖపట్నం, నెల్లూరులే పారిశ్రామికంగా అభివృద్ధి చెందాయని గంగూలీ వెల్లడించారు. అమరావతి ఓ పారిశ్రామిక జోన్‌ను ఏర్పాటు చేస్తున్నారా అని అడుగగా... హరిత పారిశ్రామిక విధానాన్ని ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఏపీ రాజధానిఎంపికకు కేంద్రం శివరామకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేసిందని, ఆ కమిటీ అధ్యయనం జరిపి నివేదిక తయారు చేసిందన్నారు. ఈ – మెయిళ్ల ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించగా... ఎక్కువ మంది విజయవాడకు ఓటేశారని, ఆ తర్వాత స్థానాల్లో గుంటూరు, విజయవాడ– గుంటూరు నిలిచాయని తెలిపారు. రాజధాని ఏర్పాటుతో ప్రభావితమయ్యే గ్రామస్తులు, ఈ– మెయిళ్లు పంపించలేరు కదా అని ధర్మాసనం అడుగగా.. అవునని గంగూలీ బదులిచ్చారు.. కాగా.. ఇవి కేవలం కమిటి సిఫారసులేనని, రాజధాని ఎంపిక రాష్ట్రప్రభుత్వ నిర్ణయమేనని శివరామకృష్ణన్ నివేదికలో స్పష్టం చేశారన్నారు. రాజధాని ఎంపికకు అంతర్జాతీయంగా పాటించే ప్రమాణాల ప్రకారం.. నీరు, భద్రత, అనుసంధానత, భూమి లభ్యత, ప్రాంతీయ అభివృద్ధి అంశాల వారీగా చూస్తే... విజయవాడ– గుంటూరు ప్రాంతమే రాజధాని ఏర్పాటుకు అనుకూలమైనదిగా కమిటీ తేల్చిందన్నారు. భూమి విషయానికొస్తే ప్రభుత్వ భూమి లేదని, ప్రైవేటు భూమి సేకరణకు ఎక్కువ వ్యయమవుతుందని, దాంతో ఈ ప్రాంతానికి కమిటీ తక్కువ మార్కులు వేసిందని అయితే.. రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా భూ సమీకరణ చేపట్టి ఈ సమస్యను పరిష్కరించిందని వివరించారు.

నోట్లరద్దు దండగమారి పనులే

కోల్‌కతా : కేంద్రప్రభుత్వం ఆకస్మికంగా ప్రకటించిన పెద్దనోట్ల రద్దు బిచ్చగాళ్లు, చిరు వ్యాపారులు, తోపుడు బండ్లవాళ్లపై పడిన ప్రభావాన్ని అంచనా వేసేందుకు ఒక బృందం నాలుగు నెలలుగా కోల్‌కతా రోడ్లపై తిరుగుతోంది. పెద్దనోట్ల రద్దుతో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందన్న ప్రభుత్వ వాదనతో బుర్రాబజార్‌లోని రోజువారీ కూలీలు ఏకీభవించడం లేదు. పోస్టా ప్రాంతంలో రోజువారీ కూలీ మహమ్మద్ ఇర్ఫాన్ (62) మాట్లాడుతూ 'బడాబాబులు నేడూ పెద్ద వాహనాలు కొనుక్కొంటూనే ఉన్నారు. కష్టాలన్నీ క్రిందిస్థాయి వారే అనుభవించాల్సి వస్తోంది. అని అన్నారు. రోజుకు రూ.250 నుంచి రూ.300 వరకు సంపాదించేవాడిని, కానీ వినియోగదారుల చేతుల్లో డబ్బులేక రూ.100కు మించి రావడంలేదని ఇర్ఫాన్ వాపోయారు. తన కుటుంబంలో ఆరుగురు ఉంటారని, పెద్దనోట్లు రద్దు అయిన తొలిరోజుల్లో ఏ విధంగా గడిపామన్నది గుర్తుచేసుకోవాలని అనుకోవడం లేదన్నారు. 90ఏళ్ల కమల (మారుపేరు) ప్రతిరోజూ బీబీడీ బ్యాగ్ వద్ద బిచ్చమెత్తుకుంటోంది. ఆమె మాట్లాడుతూ 'పెద్దనోట్ల రద్దు అనంతరం భయంతో ఎంతో కష్టపడి దాచుకున్న ఆరు రూ.500 నోట్లను మురికికాలువలో పారవేశాను. నరేంద్రమోడీ చాయ్‌వాలా నుంచి ప్రధాని స్థాయికి ఎదిగినట్టు విన్నా. తనను తాను పేదల రక్షకుడిగా చెప్పుకునే ఆయన చేసినది. ఇదేలా! తదుపరి ఎన్నికల్లో రాహుల్‌గాంధీ అధికారంలోకి వస్తారని ఆశిస్తున్నా' అని చెప్పింది. మరో బిచ్చగాడు ఉత్పాల్ దాస్ కూడా కమల తరహా భావాలనే వ్యక్తంచేశాడు. 'నా కుటుంబం రోజుల తరబడి వస్తూలుండాల్సి వచ్చింది. నా ఐదేళ్ల పాపను స్కూలు పంపేంత స్తోమత లేదు' అంటూ తన బాధను వెళ్లగక్కాడు, పెన్నులను అమ్మే ఓ చిరువ్యాపారి మాట్లాడుతూ 'పెద్దనోట్ల రద్దు చాలా ఘోరమైన నిర్ణయం. దీంతో వ్యాపారం పతనమైంది. మార్కెట్‌లో డబ్బే లేకపోతే వ్యాపారం జరగాలని ఎలా అనుకుంటాం' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాళాలను తయారుచేసే వ్యక్తి మాట్లాడుతూ 'పెద్దనోట్ల రద్దు లేదా ఏ ఇతర చర్య వల్ల నాకు ఇలాగే చనిపోతా. మెరుగైన భవిష్యత్ గురించి ఆలోచనే మానేశా' అని వాపోయాడు. కాగా అవినీతి అంతమౌతుందిని, దేశానికి నల్లధనం తిరిగి వస్తుందని భావించిన మరికొందరు నోట్లరద్దుకు మద్దతు పలికారు. రోడ్డుపక్కనే హోటల్ నడిపే ఉలుబేరియా వాసి రామ్ భౌమిక్ మాట్లాడుతూ 'పేదలు, ధనికులకన్న వివక్ష తగ్గింది. ఇప్పుడుండరూ. సమానులే. అవినీతిపరులు తమ వద్ద మూలుగుతున్న నల్లధాన్ని బయటకు తీయడం తప్పదు. వారు చేసిన తప్పులకు శిక్ష అనుభవిస్తారు' అని అన్నారు. టాక్సీ డ్రైవర్ సుదీప్ దత్తా మాట్లాడుతూ ప్రధాని మోడీని ప్రశంసలతో ముంచెత్తారు. 'మోడీ దేశానికి కేవలం మంచే చేశారు. మార్కెట్‌లో నకిలీ నోట్లే లేకుండా పోయాయి. తొలుత కొన్ని ఇబ్బందులు ఎదురైన్నా ఇప్పుడు పరిస్థితి మెరుగుపడింది. అని అన్నారు. తోపుడుబండ్ల వారు కొందరు మాట్లాడుతూ 'మాకు పెద్దనోట్లతో పెద్దగా పనిలేదు గనుక వాటి రద్దుతో వచ్చిన నష్టమేమీ లేదు' అని చెప్పారు. సమాజం నుండి అవినీతి తొలుగుతుందంటే ప్రభుత్వానికి మద్దతివ్వడంలో తప్పులేదని చాయ్‌వాలా అయిన రాము పేర్కొన్నారు. మోడీకి వీరాభిమాని అయిన రాంగోపాల్ మట్లాడుతూ ' మోడీకి ఎవరు సాటిరారు. ప్రస్తుతం దేశాన్ని అత్యద్భుతంగా నడిపిస్తున్న ఉత్తముడాయన. ఆయనకు పూర్తి మద్దతిన్నా. కొందరు చెబుతున్నట్లు పెద్దనోట్ల రద్దు ఫలితాలు ఇప్పుడే కనిపించకపోవచ్చు..కానీ భవిష్యత్తు బాగుంటుంది. కనీసం నా పిల్లలు మెరుగైన జీవితాన్ని గడుపుతారు' అని అన్నారు.

అతి త్వరలో దినపత్రికగా రానున్న
రాజధాని వార్తలు
పత్రికకు రాష్ట్రవ్యాప్తంగా
విలేకరులు కావలెను
సంప్రదించవలసిన నెం:9440662699
Email : Info@rajadhanivartalu.com

రుధిరాశ్రువులతో మహిళలు

ప్రతిరోజూ... ప్రతి గంటా..ప్రతి నిమిషం...ప్రతి సెకను ఈ భూగోళంలో మహిళలు, పిల్లలపై దౌర్జన్యాలు జరుగుతూనే ఉన్నాయి . ఈ దేశం, ఆదేశం అనే తేడా లేదు.. ప్రతిదేశం ఇదే విషయంపై రక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటిస్తాయిగాని, అమలు శూన్యం. ఇది ఏదో కాకి కథకాదు...ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తీవ్ర విమర్శ . అగ్రదేశాలైన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లు తమ ఆధిపత్యంకోసం, సహజ సంపదకోసం మధ్యాసియా దేశాలను అంతర్యుద్ధాలతో, యుద్ధాలతో భ్రష్టు పట్టించడంతో అక్కడ పిల్లలు, మహిళలు తీవ్ర అరాచాలకు గురవుతున్నారు. ప్రాణాలను నిలుపుకుంటానికి దేశం దాటి వెళుతున్న మహిళలు, పిల్లలపై లైంగిక దాడులు చేస్తూ, శరీరాలను, మనస్సులను తీవ్ర గాయాలు చేస్తున్నారు. శరణార్థులు వెతలు, కథలు కన్నీటి సముద్రాలే...

యుద్ధాల నేపథ్యంలో ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని కట్టుబట్టలతో పిల్లలను తీసుకొని పొరుగుదేశాలకు వెళుతుంటే కనీసం మానవత్వం లేకుండా ప్రవర్తిస్తున్నాయని అగ్రదేశాలపై ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. శరణార్థుల పిల్లలపై దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారని బ్రిటన్‌ను ఆ సంస్థ అభిశంసించింది. పిల్లలపై క్రూరమైన చట్టాలను ప్రయోగిస్తున్నారని బ్రిటన్ ప్రధాని థెరిసామేను దునుమాడింది. ఈ కోవలో 36 దేశాలున్నాయని తెలిపింది. అలా అని అగ్రదేశాల మహిళ పరిస్థితి కూడా అంత గౌరవనీయంగా ఏం లేదు.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మహిళలపై చేసిన వ్యాఖ్యలు వింటే ఎక్కడైనా స్త్రీలు...అణగదొక్కబడేవారే అని తెలుస్తుంది.

లిబియాలో శరణార్థుల పిల్లలపై హింసోన్మాదం

లిబియాలో శరణార్థుల పిల్లలపై హింసోన్మాదం చోటుచేసుకుంటుందనియునెసెఫ్‌తెలిపింది. మహిళలు, బాలికలపై అసభ్యంగా ప్రవర్తించడం, అత్యాచారాలకు పాల్పడటం, ఇతర విధాలుగా వారిని హింసించడం జరుగుతోందని యునెసెఫ్ పరిశోధకులు 82 మంది మహిళలను, 42 మంది పిల్లలను ఇంటర్వూలు చేసి నివేదిక వెలువరించింది. పిల్లలు రకరకాల హింసకు గురయ్యామని, సైనిక దుస్తులు ధరించినవారు తమపై అత్యాచారాలకు, లైంగిక వేధింపులకు, దాడులకు పాల్పడ్డారన్నారు. లైంగిక దాడులను అడ్డుకునే కుంటుంబ పురుషులను దాడి చేయడం, లేదా హత్య చేయడం జరిగిందని బాధితులు తెలిపారు. లిబియాలో దాదాపు 34 శరణార్థ నిర్భంధ కేంద్రాలున్నాయని యునెసెఫ్ తెలిపింది. వీటిలో దాదాపు 7 వేల మంది ఉన్నారని ఆ సంస్థ తెలిపింది.

సమ్మెకు సై అన్న అర్జెంటైనా మహిళలు

దేశంలోనూ, ప్రపంచంలోనూ మహిళలు పరిస్థితులు అంతకంతకు దిగజారడంతో అంతర్జాతీయ మహిళాదినోత్సవమైన మార్చి 8న భారీ సమ్మె జరపాలని నిర్ణయించారు. దీనికి అన్ని ట్రేడ్‌యూనియన్లు, సామాజిక సంస్థలు అన్ని వయసుల ప్రజలను తమకు మద్దతు తెలిపాయని అక్కడి మహిళా సంఘాలు తెలిపాయి. మహిళల పట్ల అసభ్య ప్రవర్తన, లైంగికదాడులు, హింసను నిరోధించాలని, మహిళలపట్ల వివక్ష చూపుతూ హింసకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ అదేరోజు భారీ ర్యాలీ జరపనున్నారు.

ఇక్కడంతా ద్వంద్వ ప్రవృత్తే...

ఆదిశక్తి, జగత్‌జనని అంటూ దేశంలో మహిళలకు అత్యంత గౌరవం ఇచ్చేదేశంగా ప్రకటించు కుంటున్న భారత నాయకులు, చెప్పేవన్నీ కల్లబొల్లి కబుర్లేనని చెప్పక తప్పదు. మహిళల వస్త్రధారణపై, వారి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలపై అడుగడుగున నిషేధాలే... జీన్స్ వేసుకుంటే సముద్రంలో కలపాలని ఒక ఎంపీ అంటే మహిళలు వంటిట్లో ఉంటే ఏ సమస్య రాదని మరో స్పీకర్ ఉవాచిస్తారు. రాంజాస్ కాలేజీలో జరిగిన అల్లర్ల నేపథ్యంలో శ్రీరాం కాలేజీ విద్యార్థి, కార్గిల్ అమర జవాను కుమార్తె గుర్‌మెహర్ కౌర్ స్పందిస్తూ భావప్రకటనా స్వేచ్ఛపై సంకెళ్లు

తంతుగా ప్రపంచ మహిళా దినోత్సవం

విధించాలని చూస్తే ఊరుకోం అని ఫేస్‌బుక్‌లో పోస్టు చేసినందుకు నానా దూమారం రేగింది. ఆమెను రేప్ చేస్తామంటూ బెదిరింపులు వచ్చాయి. దావూద్‌లా మాట్లాడుతుందని అన్నారు. నానారకాలుగా భయభ్రాంతులకు గురిచేశారు. చివరికి ఆమె ఆందోళనను వదలి, ఢిల్లీ నుంచి సొంతగ్రామం వెళ్లాల్సిన పరిస్థితులు కల్పించారు.

వీరేంద్రా వెటకారాలు వద్దు..

ఈ దేశంలో రాజకీయనాయకుల అడుగులకు మడుగులొత్తుతుంటారు ఇక్కడి సెలబ్రిటీలు, ఆకోవలో వీరేంద్ర సెహ్వాగ్ ఒకరు. రేప్ చేస్తామన్నా, దావూద్‌లో పోల్చినా పెదవి విప్పని ఆయన గుర్‌మెహర్ మానాన్న పాకిస్థాన్ చంపలేదు. యుద్ధం చంపింది అన్న వ్యాఖ్యతో నానా వెటకారాలు చేశారు. చిన్నప్పటి నుంచి వీరేంద్ర ఆటను చూస్తూ పెరిగాను, ఆయన నా హృదయాన్ని ముక్కలు చేశారని కౌర్ వాపోయారు. నిజానికి ఈ పరిస్థితి ఆమె ఒక్కరిదే కాదు...ఆయన మహిళలపట్ల ఎంత తేలిగ్గా, ఎంత కఠినంగా ప్రవర్తించగలరో ఈ ఘటన రుజువుచేసింది. ఈ వ్యాఖ్యలతో ఆయన తన గౌరవాన్ని పూర్తిగా పోగొట్టుకున్నారు. ఇందుకు బదులుగా ఏ పరిస్థితుల్లో ఆ వ్యాఖ్య చేయాల్సి వచ్చిందో అడిగి ఉంటే బావుండేది. ప్రపంచ వ్యాప్తంగా రుధిరాశ్రువులతో మహిళలు బ్రతుకుతుంటే ఎన్ని అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు వస్తే ఏమిటి ? యత్ర నార్యస్తు పూజ్యతే తత్ర దేవతా: రమంతే ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు ఆనంద నృత్యం చేస్తారని వేదాలు చెబుతున్నాయి. ఆ పరిస్థితి మన పిల్లలపిల్లల నాటికైనా వస్తుందా..? అలాంటి సమాజం కోసం కృషి చేసేవారికి ఈ వ్యాసం అంకితం....

– జయ

ఒత్తిడితో జీవితాలు అంతం

పోలీసుల చేతుల్లో ఆయుధాలు శాంతిభ్రద్రలను కాపాడేందుకే వినియోగపడుతున్నాయా లేక నిరాశా నిస్పృహల మధ్య తమను తాము కాల్చుకునే సంస్కృతికి దారితీస్తోందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రల్లో శాంతిభద్రతలను కాపాడే ఉద్దేశంతో ప్రభుత్వం కల్పించే ఆయుధాలు కేవలం అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకే ఉపయోగపడుతున్నాయా అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇందుకు కొన్ని సంఘటనలను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇటీవల కాలంలో ప్రధాని నరేంద్ర మోడీ హైదరాబాద్ పర్యటనకు వచ్చినప్పుడు బందోబస్తులో ఉన్న వరంగల్‌కు చెందిన శ్రీధర్ అనే సబ్ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వరంగల్ నుంచి బందోబస్తు కోసం హైదరాబాద్ వచ్చిన అతను ఎస్‌వీపీ జాతీయ పోలీసు అకాడమికి రెండు కిలో మీటర్ల దూరంలో గల మైలార్‌దేవ్‌పల్లిలోని ఒక అపార్టుమెంట్‌లో తన సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే, ముఖ్యమంత్రి ఎన్ .చంద్రబాబునాయుడు పర్యటన సమయంలో కర్నూల్‌లో ఒక కానిస్టేబుల్ తన వద్ద ఉన్న తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ రెండు సంఘటనల వల్ల పోలీసుల చేతుల్లో ఆయుధాల ఏ మేరకు సద్వినియోగమవుతున్నాయో, పోలీసుల చర్యలతో తుపాకీ సంస్కృతి ఎలా ప్రబలుతోందో విశదమవుతోంది. రాష్ట్ర ప్రయోజనాలను, శాంతిభద్రతలను కాపాడేందుకు సంఘవిద్రోహులపై విధినిర్వహణలో ఉన్న పోలీసులు తుపాకులు ఉపయోగించడం సర్వసాధారణం. సివిల్ తగాదాల్లో కల్పించుకుని పోలీసులు కాల్పుల జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి.

ఎస్‌పీ సలహాపై నివేదికకు హైకోర్టు ఆదేశం

ఈ ఆయుధ సంస్కృతి ఎంతవరకు వెళ్లిందంటే పోలీసు కుటుంబాలకు కూడా అధికారులు ఆయుధాలను సమకూర్చే పనిలో నిమగ్నులయ్యారని సమాచారం. ఇందుకు ఉదాహరణగా కర్నూలు జిల్లా ఎస్‌పి హరికృష్ణ ఉదంతాన్ని తీసుకోవచ్చు. ఇటీవల ఏకే 47 రైఫిల్ దగ్గర ఉంచుకోవాలని తన భార్యకు ఆయన సలహా ఇచ్చారట. ఈ విషయంలో సమగ్ర నివేదిక సమర్పించమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఉత్తర్వులపై స్పందించేందుకు ఎస్‌పీ నిరాకరించారు. అదెంతో పాత కేసని, దానిపై ఇప్పుడు వ్యాఖ్యానించడం సరికాదని ఆయన అన్నారు.తమకు ఆయుధాలు ఇవ్వడమంటే అధికారులు భావిస్తున్నారు. మానవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు, భూతగాదాలను పరిష్కరించేందుకు రాజమహేంద్రవరం, కాకినాడ, విజయవాడ పోలీసులు కృషి చేస్తుంటారు. విజయవాడలో ఆస్తి తగాదాలను పరిష్కరింపబడంలో పోలీసులు పెట్టింది పేరు. విజయవాడలో పోలీసులు చేస్తున్న సివిల్ తగాదాల పరిష్కారాలను నిరోధించకపోతే న్యాయస్థానాలపై భారం అధికమవుతుందని పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నరసింహారెడ్డి వ్యాఖ్యానించారు. సివిల్ తగాదాల పరిష్కారం చర్యలకు పోలీసుల దూరంగా ఉండాలని మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ సుభాషణ్ రెడ్డి కూడా సూచించారు. అయితే, పోలీసు అధికారులపై ఒత్తిడి అధికంగా ఉంటుందని మానసిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. వ్యక్తిగతంగాను, ప్రాంతీయ సమస్యలతో వారు సతమతమవుతుంటారని, అంటే వివాహపరమైన విభేదాలు, కంగుబాటు, మానసిక ఇబ్బందులు, పనిలో ఒత్తిడులతో వారు బాధపడటం సహజమని వారు చెబుతున్నారు.

- ఖాన్

బ్యాంకులను నిర్వీర్యం చేసే కుట్రలపై
ఉద్యోగుల ఆగ్రహం

రాజధాని ప్రతినిధి ; (విజయవాడ) : కేంద్రప్రభుత్వం బ్యాంకింగ్ రంగంలో తీసుకువస్తున్న చర్యలకు నిరసనగా యునైటెడ్ ఫోరం అఫ్ బ్యాంక్ యూనియన్స్ ఇచ్చిన పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేశారు. దీనిలో భాగంగా స్థానిక గాంధీనగర్ లోని ఎస్‌బీఐ వద్ద కేంద్రం తీసుకువస్తున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉద్యోగులు నినాదాలు చేశారు. ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకుండా చేయడానికే మోడీ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు అన్నారు. దేశానికి ఒక దుష్టత్రయం తయారయ్యిందని, వారు రిజర్వ్‌బ్యాంకు గవర్నర్ , చంద్రబాబులు కాగా వీరికి మరో నాయుడు తోడయ్యాడని అన్నారు. వీరంతా కలిసి ప్రజావ్యతిరేకంగా చర్యలు తీసుకుంటూ విదేశీ, బడా పారిశ్రామిక వర్గాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వం బ్యాంకులను నిర్వీర్యం చేసి ప్రైవేటు శక్తులకు అప్పగించాలని ప్రయత్నిస్తున్నారన్నారు. భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే వ్యతిరేక నిర్ణయాలను కలసికట్టుగా ఉద్యమించి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. యునైటెడ్ ఫోరం అఫ్ బ్యాంకు యూనియన్స్ నాయకులు మాట్లాడుతూ, పెద్దనోట్ల రద్దు సమయంలో పని చేసిన అధిక సమయంకు పరిహారం అందించడంతో పాటు బ్యాంకులకు అయిన ఖర్చును ప్రభుత్వమే భరించాలని డిమాండు చేశారు.ప్రజావ్యతిరేక బ్యాంకింగ్ కార్మిక సంస్కరణలను విరమించుకోవాలి. రుణ ఎగవేతదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ నిరసనలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్ బ్యాంకు సంఘాల నాయకులు ఏఐబీఈఏ నాయకులు కెఎస్. రావు, ఎఐటీఓసీనాయకులు కె.రఘురామ్, ఎన్‌సీబీఈ నాయకులు పి.ఎల్. ప్రకాష్, ఏఐబీఓఏ నాయకులు శ్యామ్‌బాబు, బీఈఆఫ్ నాయకులు ఆర్ అజయ్‌కుమార్, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

సామాజిక,ఆర్థిక,సాంస్కృతిక, రాజకీయ,వారపత్రిక
రాజధాని వార్తలు
యాడ్ - రూ.500/- మాత్రమే
94406 62699, 96768 44442

సమాధులపై దొడ్ల నిర్మాణం దుర్మార్గం

ముస్లిం యునైటెడ్ ఫ్రంట్

రాజధాని ప్రతినిధి, గాంధీనగర్ :

ముస్లింల సమాధులపై మరుగు దొడ్లు నిర్మిస్తామని చెప్పడం అత్యంత దుర్మార్గమని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు హబీబుర్ రహమాన్ అన్నారు. ముస్లింలు సమాధులను ఆరాధిస్తారని, పెద్దల కోసం ప్రార్థనలు చేస్తారన్నారు. కనీస జ్ఞానమున్నవారెవరూ సమాధులపై మరుగుదొడ్లు నిర్మించబోరన్నారు. ఏలూరు రోడ్డులోని ఓ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తారాపేటలోని స్మశానవాటికను రూ. 1.60 కోట్లతో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తన అనుచరులతో చెప్పిస్తున్నారన్నారు. సమాధులపై పార్కింగ్, బాత్‌రూమ్‌లు వంటి కట్టడాలు నిర్మిస్తామని మ్యాప్‌ను విడుదల చేశారని చెప్పారు. వాస్తవానికి తారాపేట స్మశాన వాటికలో జరిగేది అభివృద్ధి కాదని, ఆ పేరుతో భారీ కుంభకోణానికి ఎమ్మెల్యే ఆయన అనుచరులు పథకం రచించారని ఆరోపించారు. రోడ్డు విస్తరణ పేరుతో ఖబరిస్థాన్‌ను తొలగించేందుకు ప్రయత్నిస్తే ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ అడ్డుకుందన్నారు. ప్రస్తుతం అధికార పార్టీలో చేరిన ఎమ్మెల్యే అభివృద్ధి పేరుతో స్మశాన వాటికను తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తారాపేట, ఇస్లాంపేట, వించిపేట, కొత్తపేట, మహంతీపురం, ఫోర్‌మెన్ బంగ్లా, చిట్టీనగర్, ఆలీనగర్ తదితర ప్రాంతాల ముస్లింలు తారాపేటలోని ఖబరిస్థాన్‌ను వినియోగిస్తుంటారన్నారు. ఇప్పటికే స్మశాన వాటికలో స్థలం సరిపోక ఇబ్బందులు పడుతుంటే వాటిని పట్టించుకోకుండా సమాధులపై నిర్మాణాలు చేపడతామనడం సరికాదన్నారు. గతంలో పనిచేసిన ఎమ్మెల్యేలు, మేయర్లు స్మశాసవాటిక అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. మాజీ మేయర్ మల్లికా బేగం మాట్లాడుతూ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ తనకు ఓటు వేసిన మైనార్టీలపై అక్రమ కేసులు పెట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అర్ధరాత్రి పోలీసులను ఇళ్లపైకి పంపించి దాడులు చేయిస్తున్నారన్నారు. సామాజిక కార్యకర్తలు అభివృద్ధిని అడ్డుకుంటున్నారంటూ, జైళ్లలో పెట్టిస్తున్నారని విమర్శించారు. జలీల్‌ఖాన్ ముస్లింల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారన్నారు. స్మశాన వాటికలు అభివృద్ధి చేయాలన్న చిత్తశద్ధి ఉంటే విద్యాధరపురంలోని ఖబరిస్థాన్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. ఎమ్మెల్యే పోలీసులను అడ్డుపెట్టుకుని తప్పుడు కేసులు పెట్టించడం మానుకోవాలన్నారు.అనవసరంగా కేసులు పెట్టించి మైనార్టీ యువకులను ఇబ్బందులకు గురిచేస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. సమావేశంలో ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ ఉపాధ్యక్షులు యాసిన్, ఎండీ రియాజ్, ఫెరోజ్, అహ్మద్‌లు పాల్గొన్నారు.

Printed by Pattan Hussain Khan, published by Pattan Hussain Khan on behalf of Vastitude media pvt ltd.and printed at Jagathi Publications Ltd.D.No: 5-625,Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. publised at Guntur. Editor: Pattan Hussain Khan, Ph: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18